కామ్రేడ్ గంగారాం స్మృతిలో...

దామెర రాములు కవిత



సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మా స ప త్రి క

120

అక్టోబర్ 1981

నిర్వహణ

'సాహితీమిత్రులు'

సంవత్సర చందా రు. 20

ఈ సంచిక రు. 2

ఈ సంచికలో....

SRJANA is commended for use in Public Libraries in the
State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd
Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu
Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 50600
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

120
అక్టోబర్ 1981

సృజన

మాసపత్రిక

కామ్రేడ్ గంగారాం స్మృతిలో...

దామెర రాములు

గుబురు గుబురు చెట్లగుంపులలో
పచ్చముసుగేసిన ప్రకృతివొడిలో
దోగాడుతోన్న ఆ పసికందు కేరింతలు
మీరు విన్నారా ?

బుడిబుడినడకలతో బోసినవ్వుతో
మీవైపే చూస్తోన్న
ఆ పాపకళ్ళలో ప్రతిఫలిస్తోన్న
ఆశాకుసుమాల పరాగాలనీ
భవిష్యదుజ్వలజాడలనీ
మీరు పసిగట్టారా ?

మీరలా చూస్తుండగానే
ఆకాశమంత ఎత్తు ఎదిగి
ఖాకీదుస్తులతో వెన్నుమీద దారిబత్తెపు బ్యాగ్‌తో
భుజానికి వేళ్ళాడుతోన్న రైఫిల్‌తో
దోపిడీదుర్గాన్ని ముట్టడించడానికి
చకచకా కదిలిపోతున్నాడాబాలుడు

ఎవరూ ఆపకండి ఆవేశపడకండి !
తల్లులారా ! వీరకుంకుమ నుదుటదిద్దండి !
మీ కన్నకడుపు
పొద్దుగ్రుంకిన సూర్యుడో
పొద్దుపొడిచే సూర్యుడో
తేల్చుకోవటానికి
రెండుజాములే ఉందిరాత్రి....

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 2

విలువలు

గ్రామీణప్రజలపై, పట్టణాల్లో విప్లవభావాలవైపు ఆకర్షితులవుతున్న విద్యార్థి యువజనులపై జరుగుతున్న పోలీసుదాడులు, దౌర్జన్యాలగురించి వింటుంటే సారా వ్యాపారల గూండాయిజంగురించి, అంతులేని అక్రమ ఆర్జనలగురించి బయటపెట్టిన అరుణ్ శౌర్యాన్ని అభినందించే మన ఆంగ్లపత్రికా పాఠకజనం ఇక్కడేంచేస్తున్నట్లు అని ఆశ్చర్యంవేస్తుంది. ఈ వార్తలు పత్రికల్లోరావు నిజమే. పౌరహక్కులసంఘాలు చెప్పినా వేయనిపత్రికలు తాముగా ఈ విషయాల్లో విచారణచేసి వాస్తవాలు బయటికి రావాలనుకోవడంకూడా అత్యాశే.

ఎమర్జెన్సీవల్ల ప్రజల ప్రజాస్వామిక హక్కులపై ఎంతోకాలంగా ఎంతదారుణమైన అణచివేత అమలవుతున్నదో తెల్లబట్టలవాళ్ళకు తెల్లమయిందనిఆశించాం. తమ భావప్రకటన స్వేచ్ఛకూడ హరింపబడినపుడు భావాలసంగతి అలావుంచి భౌతికజీవిత ప్రాథమిక అవసరాలకోసం రెక్కలు ముక్కలుచేసుకునే కష్టజీవి ఎన్ని గండకత్తెర్లలో తనప్రాణాలు బిగబట్టుకొన్నాదో చదువుకున్నవాళ్ళు చదువుకున్నారనుకున్నాం. ఇందిరా గాంధీ తిరిగి అధికారంలోకి వచ్చేదాకా ఈ 'వికాసవంతుల్లో' కనిపించిన సంచలనం ఆ భ్రమల్ని కల్పించిందికూడ.

కాని విషాదాంతనాటకం మళ్ళీ తెరతొలగి నిర్వహింపబడుతూవుంటే ఈ 'వికాసవంతులంతా' మౌనప్రేక్షకులుగానో, ఉదాసీన ప్రేక్షకులుగానో అంజయ్యమీద చలోక్తులు మొదలుకొని అణుబాంబు ప్రయోగందాకా చర్చల్లో తలదూరుస్తున్నారు. ఎమర్జెన్సీతర్వాతకూడ ఎన్నికల్లోగెలుపు ఇందిరాగాంధీకి ఎలాంటి చట్టబద్ధతనిచ్చిందో, భార్గవకమీషన్ రద్దుపై మాట్లాడని మనమౌనంకూడ ఎన్కౌంటర్ల హత్యలకు అలాంటి చట్టబద్ధతనే ఇచ్చింది.

మాట్లాడవలసినవారిమౌనం మాట్లాడగలిగినవారిమౌనం ఈదేశంలో పోలీసు రాజ్యాన్ని బలాదూర్‌చేస్తున్నది.

పట్టణాల్లోనే పట్టుకొని కాల్చేస్తున్నారు. మేజిస్ట్రేట్ చెవికీ, డాక్టర్ స్టెతస్కోపుకు తుపాకిగుండుచప్పుడు వినొచ్చేలా కాల్చేస్తున్నారు.

భద్రమైన ఉద్యోగాల్లో వున్నవాళ్ళను బెదరగొట్టడమెలాగో వాళ్ళకుతెలుసు. న్యాయశాస్త్రానికి, వైద్యశాస్త్రానికి, సామాజికశాస్త్రాలకు అర్థమేమిటో ఆయారంగాల్లో వున్న అందరికీ పోలీసులే భాష్యంచెప్పగలరు. వాళ్ళుచెప్పిందే శాస్త్రమని ఆ శాస్త్రజ్ఞులతో ఒప్పించనూగలరు. జ్ఞానం భయాన్ని నిర్దేశించేస్థితినుంచి భయాన్నే జ్ఞానంగా

పూజించేస్థితికి మనచదువులు మనల్ని తెచ్చాయి. ఈ చదువులు ప్రజా రాజకీయాల ప్రమాదాన్ని గుర్తించాయిగనుక ఎన్నికల రాజకీయాలను ప్రోత్సహిస్తాయి. క్రమశిక్షణతోకూడిన సాహసానికివెరచి దుస్సాహసానికి దోహదంచేస్తాయి. పాతసమాజ విలువల్ని ధ్వంసంచేయాల్సిన యువతరాన్ని అసలు విలువలనే ధ్వంసంచేయడానికి పురికొల్పుతాయి. నిర్మాణశక్తికి భయపడి అసలు చేతులకు పని ఇవ్వడానికే నిరాకరిస్తాయి. బౌద్ధిక బానిసత్వాన్ని అధికారము సాంఘిక ప్రతిష్ఠఅనుకొని తప్పుడు చైతన్యంతో బతికేస్థితికితెస్తుంది ఈ వ్యవస్థ.

మరి ఈ వ్యవస్థలో అలజడి ఎవరు సృష్టిస్తున్నారు. అలజడి సృష్టించడం ఎవరికి మాత్రం ఏం షోకు? ఎవరునడిస్తే తప్ప గమ్యంచేరరో వాళ్ళకు నడవక తప్పదు. ఎవరు ఉరికితే తప్ప ఉప్పైనా దొరకదో వాళ్ళు చేతులెట్లాముడుచుకొని కూర్చోగలరు. కట్టెలుగొట్టి బతికేవాని పని, చేతులు నాజూకుగావుండాలని చెప్పేవాడు కనీసం తాను తింటున్న తిండికోసం ఆ కట్టెలు మండుతున్న క్రమాన్ని అయినా కన్నెత్తి చూడనివాడు, సమాజంలోని నాజూకుతనం డిప్పలేసిచూస్తే ఎన్ని భీభత్స దృశ్యాలో, సమాజంలో యథాస్థితి శాంతిననుభవిస్తున్న వర్గాలు తాము అశాంతికి గురిచేస్తున్న వర్గాల జీవనదృశ్యాలపై సంస్కృతీ సభ్యతలనే పెద్ద మాయాజలతారు కప్పుతున్నాయి.

ఆధునిక సమాజ అవసరాలను గుర్తించి, చాల హీనవర్గాల ప్రజల క్షేమాన్ని ఎల్లవేళలా మనసులో పెట్టుకొని ప్రజలకు సేవచేయడమే పోలీసుల కర్తవ్యమని పోలీసు ఉన్నతాధికారి చెప్తే దాని అర్థం తమన్యాయమైన హక్కులకోసం పోరాడే యువకుల్ని పోలీసు స్టేషన్‌లలో నెలలతరబడి నిర్బంధించి చిత్రహింసలకు గురిచేయడమని అమాయకులు కాని వాళ్ళకు తెలియదా. ప్రజలతో మర్యాదగా ప్రవర్తించండి అంటే ఎదురుమాట్లాడిన ప్రజల్ని లాకప్పులోవేసి ముడ్డిలో రోళ్ళకర్రలు దూర్చినవాళ్ళకు సేవాపతకాలు వస్తుంటే పాలకులు ఏం ఉద్దేశించి ఏం చెప్తున్నారో మనకు తెలియకపోయినా పోలీసులకు తెలియడంలేదా. ఈ నేరాలన్నీ పోలీసులే చేస్తున్నారని కాదు. పాలకవర్గాల నేరప్రవృత్తి పోలీసు యంత్రాంగం ద్వారా ప్రజలు చవిచూస్తున్నారు. ఇది ఇవ్వాళ ప్రశ్నించే వానిపై అమలవుతున్న అణచివేతయేకావచ్చు. రేపు మౌనంగావున్న వానిపై విరుచుకపడదని హామీవున్నదా? మౌనంగా, వినయంగా, అలీనంగా లేదా అతిశంగా వున్నవాళ్ళంతా క్షేమంగావున్నారా? అసలట్లావుండగలగడం సాధ్యమేనా? ఏ ప్రజల అహర్నిశల శ్రమవల్ల మన శ్రమతగ్గి బుద్ధిజీవులమయ్యామో

ఏ ప్రజల భౌతిక ఆచరణవల్ల మనం ఆలోచనాపరులమయ్యామో, ఎవరినెత్తురు తమకు చెమట మనకు అత్తరయిందో వాళ్ళుగ్రహించి మనల్ని గ్రహింపజేయడానికి ఉద్యమిస్తుంటే ఊర్లు మేల్కొంటుంటే, ఆ ఊర్లనుంచి, ఆ వేర్లనుంచి దూరంగా విసిరివేయబడ్డమనం మన తల్లివేరును పోల్చుకోలేనంత ఝంఝూటంలో తలమునకలయ్యాం. మనం పొద్దున్నే లేస్తే వినిపించే సుప్రభాతాలు, కనిపించే పతాకశీర్షికలు, ట్రాఫిక్ పోలీసు, తామరోడ్డుపెదవులకు చిరునవ్వులంటించుకున్న సంస్కారాలు, కార్లు- ఏవిచెప్తాయి - రాత్రి ఏపోలీసుస్టేషన్‌లో ఏ యువకునిశరీరాన్ని బ్లేడుతోగాట్లుపెట్టి కారంచల్లుతూ కొట్టినసంగతి - 70 రోజులుగా ఉచ్చరొచ్చు పోలీసులాకప్పులతో కటకటాలుతప్ప సూర్యోదయాలుచూడని కదుములుకట్టిన గాయాలుతప్ప, కళ్ళల్లో భయాలుతప్ప అభయాలుచూడని, నవయవ్వనాలసంగతి ఎవరుచెప్తారు. ఇదీ మన సంస్కృతిలో భాగమేనని, ఇదే మన సంస్కృతిఅని తెలుసుకున్నప్పుడు ఉద్దేశపూర్వకంగా ఆలోచించడానికి నిరాకరిస్తున్న ఎన్నిఅగాధాలను తరచిచూడాల్సివస్తుంది- కష్టాలకు మూలకారణాలు వెతకడం చాలాకష్టమైనపని- కాని కష్టాల్లోవున్నవాళ్ళు కారణాలువెతకడం మాత్రమేకాదు ఆ కారణాల్ని తొలగించుకోకుండా కష్టాలనించి గట్టెక్కలేరు.

ఇవ్వాళ మనకిది పట్టకపోవచ్చు- రేపు దృష్టికిరావచ్చు- కాని రేపుకాకపోతే మరొకరోజు చాల సమీపభవిష్యత్తులోనే మనకూ ఒకసవాల్‌గా ఇది ముందుకు వస్తుంది- అప్పుడు మనకు ఈ సవాల్‌ను ఎదుర్కొనే అనుపానులు కాదుగదా స్థయిర్యమువి గలదు- ఎదుటివానినెత్తురు ఒకడు తాగుతుంటే మనం చూస్తూవున్నామంటే మననెత్తురు నెత్తురుకాదన్నమాట. అది అప్పటికే నీరైపోయిందో - లేదా ఆ దృశ్యాన్ని చూస్తుంటే సహజంగా రగుల్కొవాల్సిన స్వభావాన్ని అణచుకోవడంవల్ల నిప్పుకావల్సిందికాస్త మసిఅయిందో. సామాజిక జీవితంవల్ల సాధ్యమైన ఆలోచనలు సామాజిక జీవితంకోసం వినియోగించడంద్వారా పదనెక్కుతాయి. వినియోగంలోకి వస్తాయి. సామాజిక జీవితప్రగతికి దోహదంచేస్తూ అందులోభాగంగా వ్యక్తివికాసానికి తోడ్పడుతాయి, అట్లాకానినాడు అవి మనకుమాత్రమే పనికిరావాలని అనుకున్ననాడు అందుకుకూడ పనికిరాకుండా తుప్పుపట్టిపోతాయి. ఆ అసహాయతనుంచి మనల్ని ఎవరూకూడా కాపాడలేరు.

5-10-81 — సంపాదకుడు

రగులుకొనే రాక్షసిబొగ్గు

రగులుకొనే రాక్షసిబొగ్గుపై విమర్శ[1]లో కె. బాలగోపాల్‌గారు ప్రధానంగా పది అంశాలు చర్చకుతెచ్చారని అనిపిస్తున్నది. అయితే ఈ అంశాలమీద ఆయన నిర్మించిన వాదనాప్రవాహంలో, శైలి ఉరవడిలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది గనుక సరిగ్గా ఆయన విమర్శకు పునాది అంశాలనుమాత్రం ఇక్కడ స్పష్టంగా తెలిపి నా విమర్శ ప్రారంభిస్తాను.

1. మార్క్సిస్టు దృక్పథంలో జాతి ఉద్యమాలకు విశిష్టస్థానంలేదు [2]
2. ఈశాన్యభారతంలో నడుస్తున్న అన్ని ఉద్యమాలపట్ల సురాకు సద్భావంఉంది. [3]
3. రగులుకొనే రాక్షసిబొగ్గులో సురా బెంగాలీలకు అన్యాయంచేశాడు. [4]
4. సురా ఈశాన్యభారతాన్ని ఒక్కయూనిట్‌గా పరిగణించాడు [5]
5. భారతదేశంలో ప్రాంతీయ దోపిడీమీద ఆధారపడ్డ వలసవిధానంలేదు– దేశంలో అంతర్గత వలసలు (Colonial hinter-l ands) లేవు [6]
6. ఒక ప్రాంతాన్ని వలసవిధానంలో ఆర్థికంగా దోచుకుంటే దానిఫలితంగా దోచుకున్న ప్రాంతాలన్నీ, ఆ ప్రాంతాలలోని వర్గాలన్నీ (వాటిమధ్య ఎన్ని అసమానతలున్నా) మొత్తంగా అభివృద్ధిచెందాలి. (కార్మికవర్గంతోసహా). [7]
7. ఆర్థికేతర వలసవిధానంకూడా ఉంటుంది. ఈశాన్యప్రాంతంతో భారత ప్రభుత్వం అనుసరించే విధానంఅదే. [8]
8. అస్సామీ ప్రాంతీయ బూర్జువావర్గం స్థానిక వనరులమీద ఆధిపత్యంకోసం భారత బడాబూర్జువావర్గంతో చేస్తున్న పోరాటమే ప్రస్తుత అస్సాం ఉద్యమం[9].
9. ఒక అఖిలభారత బడాబూర్జువావర్గం, ఒక్కొక్క ప్రాంతానికిచెందిన ఒక్కొక్క ప్రాంతీయ బూర్జువావర్గం అనేదే సరైనవిభజన. అఖిలభారత బడాబూర్జువా వర్గంలో గుజరాతీలు, మార్వాడీలు, పార్శీలు, జైన్‌లు, చెట్టియార్లు మొదలైన వాళ్ళెందరో ఉన్నారు. కాని వాళ్ళు వాళ్ళజాతుల ప్రతినిధులుకారు. ప్రాంతీయ బూర్జువావర్గంకూడా భాషా ఏకత కలిగివుండవలసిన అవసరంలేదు. [10]
10. వర్గ పోరాటదృక్పథం వదిలిపెట్టి జాతుల బలహీనబంధాల సంకెళ్ళ సంగీతానికి తన్మయత్వం పొందడం మార్క్సిజానికి తగదు. [11]

ఈ పది అంశాలకూ వరుసగా జవాబు చెప్పి ఆ తర్వాత బాలగోపాల్‌గారి వ్యాసంలో వాదనాక్రమంలో వచ్చిన కొన్ని ఆలోచనల్ని కూడా పరిశీలిద్దాం.

మొదటిఅంశం : మార్క్సిస్టు దృక్పథంలో జాతి ఉద్యమాలకు విశిష్టస్థానం లేదన్నది నిజంకాదు. మార్క్సిస్టు దృక్పథంలో జాతి ఉద్యమాలన్నింటికీ సమర్థనీయత లేదు, జాతిఉద్యమాలన్నిటిపట్లా వ్యతిరేకతలేదు. కాని వాటిపట్ల ప్రత్యేక ("విశిష్ట") దృక్పథమూ, వాటికి ప్రత్యేక ("విశిష్ట") స్థానమూవుంది. అందుకే మార్క్స్‌నుంచి మావోదాకా జాతులసమస్యను గురించి పరిశీలించారు. జాతిఉద్యమాలను పట్టించుకున్నారు. ఐరిష్, పోలిష్‌జాతుల ఉద్యమాలను మార్క్స్, ఎంగెల్స్‌లు సానుభూతితో చూసారు, సమర్థించారు ....కమ్యూనిస్టు ప్రణాళిక 1892 పోలిష్‌కూర్పుకు పీఠికరాస్తూ ఎంగెల్స్ "యూరోపియన్ జాతులలో ప్రతిఒక్కజాతీ తన సొంతఇంట్లో సంపూర్ణంగా స్వపరిపాలనను కలిగిఉన్నప్పుడు మాత్రమే ఈ యూరోపియన్ జాతులమధ్య హృదయపూర్వకమైన అంతర్జాతీయ పరస్పర సహాయం సాధ్యమవుతుంది "[12] అన్నారు.

"ప్రతి జాతికీ స్వపరిపాలననూ ఐక్యతనూ పునఃస్థాపితం చెయ్యకుండా శ్రామికవర్గంయొక్క అంతర్జాతీయ ఐక్యతనూ సమానలక్ష్యాల అభిముఖంగా ఈ జాతులమధ్య శాంతియుతమైన వివేకవంతమైన సహకారాన్ని సాధించడం అసంభవం"[13] అని ఎంగెల్స్ 1893 ఇటాలియన్ కూర్పుకు పీఠికలో రాసారు.

పీడకజాతులతో పీడితజాతులు చేసేపోరాటాలను ఎందుకు సమర్థించాలో లెనిన్ వివరంగానే చెప్పారు.

"....పీడకజాతి జాతీయతావాదానికి, పీడితజాతి జాతీయతావాదానికి తేడాను మనం గుర్తించాలి- పెద్దజాతి జాతీయతావాదానికి, చిన్నజాతి జాతీయతావాదానికివున్న తేడాను మనం గుర్తించాలి ..."[14] అన్నారు లెనిన్. ఆయనే ఇంకా స్పష్టంగా ఇలా అన్నారు:

"....అందుచేతనే శ్రామిక సంఘీభావపు ప్రాథమిక ప్రయోజనమూ, ఫలితంగా శ్రామికవర్గ పోరాటపు ప్రాథమిక ప్రయోజనమూ జాతిసమస్యపట్ల మనం లాంఛన దృక్పథం (formal attitude) కలిగి ఉండగూడదని నిర్దేశిస్తున్నాయి. ఎల్లప్పుడూ మనం పీడకజాతి (పెద్దజాతి)పట్ల పీడితజాతి (లేదా చిన్నజాతి) శ్రామిక వర్గానికిగల విశిష్ట దృక్పథాన్ని (specific attitude) గణనలోకి తీసుకోవాలని నిర్దేశిస్తున్నాయి"[15].

జాతీయోద్యమాలు ఎట్లా వికసిస్తాయో వాటిలో కార్మికవర్గం పాత్రా, రైతాంగంపాత్రా ఎలావుంటుందో సవివరంగా చర్చించిన తర్వాత కామ్రేడ్ స్టాలిన్ ఇలా రాసారు.

""అందువల్ల అతిసున్నితమైన రూపంనుంచి అతి మొరటైన రూపందాకాఉన్న అన్నిరకాల జాతీయ పీడనా విధానాలను కార్మికులు ఎదుర్కొంటారు, ఎదుర్కోవడం మొదలుపెడ్తారు. ఒక జాతిని ఇంకో జాతిమీదికి రెచ్చగొట్టే విధానాన్నికూడా అన్ని రూపాల్లోనూ ఎదుర్కొంటారు.

అందుచేత అన్నిదేశాల్లోని సోషల్ డెమొక్రసీ జాతుల స్వయం నిర్ణయాధికారం హక్కును నొక్కిచెప్తుంది". 16

"జాతీయ స్వభావంకలిగిన పోరాటంలో వర్గపోరాటంకూడా జాతీయరూపాన్ని దాల్చుతుంది. ఇలా ఈ రెంటిమధ్య తాదాత్మ్యత ప్రదర్శితమవుతుంది...."17.

"అంతిమ పరిశీలనలో జాతుల పోరాటాలన్నీ వర్గపోరాటాలే"18 అనికామ్రేడ్ మావో రాసాడు.

భారతదేశంలో జాతుల సమస్యగురించి మార్క్సిస్టు - లెనినిస్టు గ్రూపులన్నీ మొదటినుంచీ పట్టించుకుంటూనే ఉన్నాయి- వాటి తరతమ భేదాలను గణనలోకి తీసుకుంటూ జాతిఉద్యమాలను సమర్థిస్తూనే ఉన్నాయి.

"ఈనాడు భారతదేశంలో.... కార్మికవర్గ నాయకత్వాన నూతన ప్రజాస్వామిక విప్లవంతోపాటు జాతులసమస్యకూడా కొనసాగుతోంది....

....విప్లవపోరాటం తీవ్రతరంగా అభివృద్ధి చెందని ప్రాంతాల్లోనూ, విప్లవ పోరాటం ఆరంభమై తాత్కాలికంగా దెబ్బతిన్న ప్రాంతాల్లోనూ.... (జాతులమధ్య పోరాటం) .... ఘర్షణలుగా రూపొందవచ్చు. ఐతే ఆ ఘర్షణల్లో పాల్గొనే ప్రజల్లో విప్లవ పొటెన్షియాలిటీస్ ఉన్నాయని.... మనం మర్చిపోరాదు. అందువల్ల ఆ పోరాటాల్లో పాల్గొనే ప్రజల్లోఉన్న పొటెన్షియాలిటీస్‌ను యుధసా వ్యవసాయ విప్లవానికి అనుకూలంగా ఉపయోగించుకోవడానికి వీలుగా కార్మికవర్గం అలాంటి ఘర్షణల ఎడల.... అనుకూల వైఖరినే తీసుకోవాలి".19 అని కామ్రేడ్ కె. ప్రసాదరావు రాసారు.

భారతదేశంలో జాతుల సమస్యపట్ల మార్క్సిస్టులు తీసుకోవాల్సిన సరైన దృక్పథం ఇది.

క్రాంతి ప్రచురణలు తరఫున తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ జాతుల సమస్య పై పుస్తకాలు వెలువడ్డాయి.[20]

ఈ మధ్యనే ఈ సమస్యపై అఖిలభారత సెమినార్ నిర్వహించబడింది.[21]

"బూర్జువా జాతీయతావాదాన్ని ఖచ్చితంగా నిరాకరిస్తూనే మార్క్సిజం లెనినిజం ప్రగతిశీల జాతిఉద్యమాల ఆవశ్యకతను నిరాకరించదు, జాతీయ ప్రయోజనాలను విస్మరించదు. జాతీయ ప్రయోజనమూ, జాత్యహంకారమూ ఏ రకంగానూ ఒకటి కావు...." [22]

ఇవన్నీ మార్క్సిస్టు దృక్పథంలో జాతిఉద్యమాలకు విశిష్టస్థానం లేదని తెలుపుతున్నాయా ? ఉందని తెలుపుతున్నాయా ?

మార్క్సిస్టు దృక్పథంలో జాతిఉద్యమాలకు విశిష్టస్థానం వుంటుంది; ప్రత్యేకంగా సమర్థనీయస్థానంగానీ, వ్యతిరేకించవలసిన స్థానంగానీ వుండదు.

రెండ అంశం : ఈశాన్య భారతంలో నడుస్తున్న అన్నిఉద్యమాలపట్ల సురాకు సద్భావం ఉండడమన్నది మంచివిషయమే। బాలగోపాల్‌గారు దాన్ని నెగెటివ్ అంశంగా చూపుతున్నారు. అయినా సురా రగులుకొనే రాక్షసిబొగ్గులో చేసింది ఈశాన్య భారత రాజకీయార్థిక పరిచయం మాత్రమే. ఈశాన్యభారత ఉద్యమాలన్నిటినీ వివరించి, విశ్లేషించే ప్రయత్నంఅది. ఆయాఉద్యమాలపట్ల నిర్మొహమాటమైన, నిర్దిష్టమైన వ్యాఖ్యలు చేసేందుకుకూడా ఆయన వెనుకాడలేదు. అందువల్ల ఆయనకున్న సద్భావం పరిమితులకులోబడిన సద్భావమేనని తెలుస్తుంది. ఆయనకున్న సద్భావం 'అసుకు సైద్ధాంతిక బలంలేద'[23]ని, 'ప్రజలమధ్య వైరుధ్యాలను అసు సరిగాఅర్థం చేసుకోలేద'[24]ని 'అస్సాం ఉద్యమానికి, మిగతాప్రాంత ఉద్యమాలకి ప్రధానమైన విభేదాలున్నాయ'[25]ని గుర్తించిన సద్భావమే. కళ్ళు కప్పేయకుండా ఆబ్జెక్టివ్‌గావుంటే చాలు సద్భావమైనా, దుర్భావమైనా।

మూడోఅంశం : సురా పుస్తకంలో బెంగాలీలకు అన్యాయం చేశాడన్నది పాక్షికసత్యమే, వలసకు సాంఘిక ఆర్థిక కారణాలను సురా వివరించాడు.[26] ఐతే బెంగాలీజాతి విషయంలో ముందుగా వచ్చిన జాతీయ చైతన్యమూ విద్యావ్యాప్తి పాలక వర్గంగా తయారుకావడానికీ, పీడించడానికీ తోడ్పడ్డాయి.

"ఒకప్పుడు అణచబడినజాతులే ఇతర ప్రజలకు పీడకజాతులుగా తయారవుతాయి"[27] అన్నాడు జార్జిథామ్సన్.

"ఏ ఒక్కజాతికీ గౌరవంవద్దు. ఏ ఒక్కభాషకూ గౌరవంవద్దు; ఒకమైనా రిటీ జాతిపట్ల చిన్నమెత్తు పీడనగానీ, చిన్నమెత్తు అన్యాయంగానీవద్దు- ఇవి కార్మిక వర్గ ప్రజాస్వామ్యపు లక్ష్యాలు"28 అన్నారు లెనిన్.

నాలుగోఅంశం . సురా ఈశాన్యభారతాన్ని ఒక్కయూనిట్‌గా పరిగణించా డన్నది పూర్తిగా అబద్ధం.

"ఈశాన్య భారత్‌ని భౌగోళికంగా మూడుప్రాంతాలుగా విభజించవచ్చు"29.

"ఆర్థిక. రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో ఏరకంగానైనా ఈశాన్యభారత ప్రాంతమంతా ఒకేగాటన కట్టివేయడం అసాధ్యం"30

"మైదాన ప్రాంతాలు కొండ ప్రాంతాలకు పూర్తిగా భిన్నంగా వున్నాయి. రెంటికీ కలిపి ఒకే చరిత్ర రాయడం దుస్సాహసం"31

ఈ అంశాన్ని సురా వేరువేరుచోట్ల స్పష్టంగానే చెప్పాడు. ఐనా బాలగోపాల్‌గారు సురా ఈశాన్య భారతాన్ని ఒక్క యూనిట్‌గా పరిగణించాడని ఆరోపిస్తున్నారు. ఒక్క భౌగోళికవిభాగం గనుక, ప్రాంతమంతటా ఉద్యమాలు చెలరేగుతున్నాయి గనుక ఒకే పుస్తకంలో రాయడం జరిగిందిగాని 'నాగా, మిజో పోరాటాలపట్ల వున్న సాను భూతిని అస్సాం ఉద్యమానికి కూడా కట్టబెట్టడానికి' కాదు. ఒకే పుస్తకంగా రాయడం సౌలభ్యం కోసమైనా కావచ్చు, సమాచారసేకరణలో, దొరుకుతున్న సమాచారంలో అస్తవ్యస్తతవల్లనైనా కావచ్చు. ఒకే భౌగోళిక ప్రాంతం కావడంవల్లనైనా కావచ్చు.

ఐదో అంశం : భారతదేశంలో ప్రాంతీయ దోపిడీమీద ఆధారపడ్డ వలస విధా నంలేదు. దేశంలో అంతర్గత వలసలు (Colonial hinterlands) లేవు.

ఈ అంశం భారతదేశపు వాస్తవ పరిశీలనలో నిజంకాదని తేలుతుంది. ఐతే ఈ అంశానికి సంబంధించి బాలగోపాల్‌గారి వాదనలో పరస్పరవైరుధ్యం ఉంది.

"పాకిస్తాన్ ఏర్పడ్డ తరువాత పశ్చిమ పాకిస్తాన్ తూర్పుపాకిస్తాన్‌ను వలస విధానంలో దోచుకుంది" 32 అని ఆయనే అంటున్నారు. భారత ఉపఖండంలో ఒక దేశానికిఉన్న వలసవిధానం ఇంకోదేశానికి ఎట్లా లేకుండా పోయింది ? లేక పాకిస్తాన్ పాలకవర్గాలకూ, భారత పాలకవర్గాలకూ మౌలికమైన తేడాలున్నాయా ?

ఇలాంటి వలస విధానమే లేకపోతే బాలగోపాల్‌గారే చెప్పినట్లు తెలంగాణ, రాయలసీమలకంటే ఆంధ్ర, దక్షిణ తమిళనాడుకంటె ఉత్తర తమిళనాడు, ఉత్తర కర్ణాటక కంటెదక్షిణ కర్ణాటక ఎందుకు అభివృద్ధి సాధించాయి ?

ఈ ఎగుడు దిగుళ్ళు రావడానికి కారణం దళారీ గుత్తపెట్టుబడిదారు వర్గపాలన అని బాలగోపాల్‌గారు అంటున్నారు. మరి పాకిస్తాన్‌లో దళారీగుత్త పెట్టుబడిదారు వర్గపాలన కాక వలసవిధానమే తూర్పు పాకిస్తాన్‌కూ పశ్చిమ పాకిస్తాన్‌కూ మధ్య ఎగుడుదిగుళ్ళను సృష్టించిందా ?

ఆరో అంశం : ఈ అంశం సైద్ధాంతికంగా సరైందేకాని బాలగోపాల్‌గారు దీన్ని భారతదేశానికి వాస్తవంలో అన్వయించడంలేదు. ఆయనన్నట్టే వలసవిధానంలో దోచుకుంటున్న ప్రాంతంలో అన్ని వర్గాలూ మొత్తంగా అభివృద్ధి చెందలేదా?

ఇతర రాష్ట్రాల ఉదాహరణలెందుకుగాని ఆంధ్రప్రాంతానికీ, తెలంగాణప్రాంతానికీ అన్నివర్గాల జీవనవిధానంలోనూ, అభివృద్ధిలోనూ తేడాలేదా ? కూలిరేట్లలో తేడా లేదా ? జీవనవ్యయంలో తేడాలేదా ? తెలంగాణలో లగ్జరీలుగా భావించబడుతున్నవి ఆంధ్రలో ఒక్కొక్కచోట కంఫర్టబుల్స్‌గా, ఒక్కొక్కచోట నెసెసిటీస్‌గా భావించ బడడం లేదా ?

ఏడో అంశం : ఆర్థికేతర వలసవిధానం– ఇది నాకు స్పష్టంగా తెలియదుగాని ఈశాన్య ప్రాంతంలో భారత ప్రభుత్వం అనుసరించేది ఇది మాత్రమే కాదు.

ఎనిమిదో అంశం : అస్సామీ ప్రాంతీయ బూర్జువావర్గం స్థానిక వనరులమీద ఆధిపత్యం కోసం అఖిలభారత బడాబూర్జువా వర్గంతో చేస్తున్న పోరాటమే ప్రస్తుత ఉద్యమం. ఇది ఊహే కాని వాస్తవం కాదు.

"ఆ ప్రాంతాల్లో ప్రాంతీయ బూర్జువావర్గం ఉనికిని ఊహించడం గానీ, ఇప్పుడునడుస్తున్న బలమైన ఉద్యమాలకు నాయకత్వం వహించగలశక్తి దానికుందని అనుకోవడంగానీ ప్రయాస పూర్వకమైనఊహే. వాస్తవంగా ప్రాంతీయ బూర్జువా వర్గాన్ని కనుక్కోవడంకష్టమే. ఇంకోవైపు ఉద్యమాల్లో మధ్యతరగతి, శ్రామిక వర్గమూ బలంగాఉన్నాయి.

నిజానికి పారిశ్రామికీకరణ జరగాలని వాళ్ళు ఇస్తున్ననినాదం ప్రాంతీయ బూర్జువా వర్గానికి వ్యతిరేకమైందే, ఒకవేళ ప్రాంతీయ బూర్జువావర్గమే బలంగావుంటే ఇంకెవణ్ణోవచ్చి పారిశ్రామికీకరణ చెయ్యమని అంటే తన మార్కెట్‌లో, పరిశ్రమల్లో ప్రవేశించమని అది కోరుతుందా?"33 అని నిర్మల్ సేన్‌గుప్తా వేస్తున్నప్రశ్న అసంబద్ధమైనదేమీకాదు.

ఆధునిక ఫ్యాక్టరీల కార్మికవర్గం, రవాణా కార్మికవర్గం, నూతనవర్తకులు,

అభివృద్ధి చెందకుండా రాష్ట్ర ఆర్థికపరిస్థితులు అడ్డుకున్నాయి. బూర్జువావర్గం జాతీయ వాదం నేర్చుకునే మొట్టమొదటి పాఠశాల మార్కెట్ అని స్టాలిన్ అన్నారు. అయితే అస్సాంలో బూర్జువావర్గంగానీ, బ్రిటిష్ లేదా భారత బూర్జువావర్గంతో పోటీపడాల్సిన మార్కెట్ గానీ లేకనేపోయాయి. అస్సాంలో ఆధునిక పరిశ్రమలు, రవాణాసౌక ర్యాలు, బ్యాంకింగ్ మొదలైన కాపిటలిస్టు ప్రగతి సూచకాలేవీ బ్రిటిష్ పాలనాకాలం లోనూ, 1947 తర్వాతనూ అభివృద్ధి కానేలేదు. పెద్ద పరిశ్రమ అయిన తేయాకు పరిశ్రమలో బ్రిటిష్ వాళ్ళు గుత్తాధిపత్యం నెలకొల్పినట్లే భరత బడాబూర్జువా వర్గం ప్రస్తుత అస్సాం వర్తకవాణిజ్యాల మీద ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇవ్వాళ అస్సాంలో పెద్దపరిశ్రమలు ఆయిల్, తేయాకుమాత్రమే. ఈ రెండుపరిశ్రమలలోనూ అస్సామీయుల పెట్టుబడి చాలా తక్కువగాఉంది. మొత్తం 620 తేయాకుతోటల్లో 158 చిన్నతోటలు మాత్రమే అస్సామీయులవి- కొన్ని ఎంతచిన్నవంటే వాటివిస్తీర్ణం 10 నుంచి 20 హెక్టేర్లలోపేఉంది. వీళ్ళలో చాలామందికి సొంతఫ్యాక్టరీలులేవు. దేశం లోని పెద్ద పారిశ్రామిక సంస్థల్లో ప్రముఖమైన 75 సంస్థలచేతుల్లో 248 పెద్దతోటలూ ఫ్యాక్టరీలూ ఉన్నాయి. మిగిలినవాటిలో పెద్దతోటలన్నీ, ఫ్యాక్టరీలన్నీ బ్రిటిష్ కంపె నీల చేతుల్లో ఉన్నాయి. ఆయిల్ పరిశ్రమ ప్రధానంగా ఆయిల్ ఇండియా లిమిటెడ్ అనే ప్రభుత్వ సంస్థ చేతుల్లోఉంది. కొంత చిన్నభాగం బ్రిటిష్ పెట్టుబడితోకూడిన ఎ. ఓ. సి అనే ప్రైవేటురంగం చేతుల్లోవుంది.[34]

ఇది అస్సామీ బూర్జువా వర్గపునిజమైన స్థానం. అయితే "అడ్డుపోబడుతున్న పెరుగుదలా, భారత బడాబూర్జువా వర్గపుపట్టుగురించిన చైతన్యమూ కొద్దిపాటిగావున్న అస్సామీ బూర్జువావర్గం ఉద్యమాన్ని సమర్థించేట్టు చేసాయి."[35]

బాలగోపాల్‌గారు ఊరికే వ్యాఖ్యానించేబదులు వివరాలతో అస్సాం ఉద్యమాన్ని నడుపుతున్నది బూర్జువా వర్గమే అని రుజువుచేసి 'సంజీబ్‌కుమార్ బరువా, తిలోత్తమ మిశ్రా లాంటి అస్సామీ మార్క్సిస్టు మేధావుల, సుర లాంటి విజాతి మార్క్సిస్టు మేధావుల' 'దృష్టిమాంద్యాన్ని' తొలగించొచ్చు గదా! లేదా అస్సామీ బూర్జువావర్గా నికి సాయపడుతున్న వీళ్ళను ఎక్స్‌పోజ్‌చేయొచ్చు గదా?

"పీడిత ప్రజల జాతీయవాదం చాలా తరచుగా జాతీయ బూర్జువావర్గం నుండే కాక సామాజిక ప్రజాస్వామ్యవర్గాలనుంచీ, విప్లవకర వర్గాలనుంచీ వెలువడుతుంది"[36] అన్నాడు గెజర్‌మన్.

అస్సాంలో ఇదే జరిగింది. అస్సామీ జాతీయవాదం రైతాంగం నుంచీ మధ్య తరగతి వర్గంనుంచీ పెల్లుబికింది.

తొమ్మిదో అంశం : ఈ అంశం ఇంకా నాకు స్పష్టం కావడంలేదు. అందుకే కొన్ని ప్రశ్నలువేసి వదిలేస్తాను. అఖిలభారత బడాబూర్జువా వర్గం, ప్రాంతీయ బూర్జువావర్గం అనే వాదన సరైందేనా ? దీంట్లో దళారీ బూర్జువావర్గం స్థానం ఎక్కడ ? ప్రాంతీయ బూర్జువా వర్గం భాషాఏకత కలిగివుండాల్సిన అవసరంలేదన్నారు గనుక దాంట్లో సామ్రాజ్యవాదుల దళారీలు, అఖిలభారత బడాబూర్జువాల దళారీలు, వాళ్ళతో ఘర్షణపడే ప్రాంతీయబూర్జువాలు మూడురకాలు వుంటారా ? ఐనా వాళ్ళు వాళ్ళజాతుల ప్రతినిధులు కాకుండా పోవడమనేది సరైందేనా ? పెట్టుబడిదారును మాతృభాషనుబట్టి ఏప్రాంతం వాడన్నది నిర్ణయించడం ఏవిధంగా భౌతికవాదానికి విరుద్ధం ? అతని వ్యాపారదృష్టే గణనలోకి తీసుకోవాలనడం ఎట్లాశాస్త్రీయం ? అలా అయితే భారతదేశాన్ని దోచుకోవడమే, బహుశా సెటిల్అయి దోచుకోవడమే వ్యాపార దృష్టిగాగలిగిన బ్రిటిష్ బూర్జువావర్గాన్ని బ్రిటిష్ బూర్జువావర్గం అనడంకూడా ఇక అశాస్త్రీయమేనా ?

పదోఅంశం : వర్గ పోరాట దృక్పథంవదిలిపెట్టి జాతుల బలహీనబంధాల సంకెళ్ళ సంగీతానికి తన్మయత్వం పొందడం మార్క్సిజానికి తగదు.

పోలిష్, ఐరిష్ జాతులవిషయంలో మార్క్స్, ఎంగెల్స్లు, ప్రపంచ పీడిత జాతులన్నిటి విషయంలో లెనిన్, స్టాలిన్, మావోలు బలహీనబంధాల సంకెళ్ళ సంగీతానికి తన్మయత్వం పొందలేదా ? అది వాళ్ళకి తగనిపనేనా ?

జాతుల సమస్యపై లెనిన్ను విమర్శిస్తూ రోజాలక్సెంబర్గ్ రాసిందానికి జవాబుగా లెనిన్ ఇలారాశారు.

"ఐరిష్ జాతిపట్లా, ఐరిష్ ప్రజలపట్లా సానుభూతి ప్రకటిస్తూ ఇంటర్నేషనల్ తీర్మానం ప్రతిపాదించేటప్పుడు మార్క్స్ ఇంగ్లాండ్ నుంచి ఐర్లండ్ వేర్పాటును కోరాడు. [బహుశా వర్గపోరాటం మరిచిపోయినందుకు అమాయకుడైన మార్క్స్ను మన అర్ధమేధావి తిట్టిఉండేది.]" 37.

జాతుల బలహీనబంధాల సంకెళ్ళసంగీతానికి తన్మయత్వంపొందడం తప్పేమీ కాదు. ఐనా బాలగోపాల్గారు మెచ్చుకున్న పిఎల్ఏ భావజాలమే "చిరకాలపు యుద్ధాలకు అచిరకాలంలో కనబడే విజయసంకేతం" 38 అనుకునే సురా వర్గపోరాట దృక్పథాన్ని వదిలేశాడా ?

ఇక వాదనాక్రమంలో బాలగోపాల్‌గారు లేవనెత్తిన కొన్ని అంశాలను పరిశీలిద్దాం.

1. సురా కోట్‌చేసిన సంజీవని పత్రిక సంపాదకీయంలోని అస్సామీలు అస్సామీలుకారని, బిహారీలు, ఒరియాలు, బెంగాలీలు అనేవిషయం సురా చెప్పలేదని[39] బాలగోపాల్‌గారు అంటున్నారు.

విజాతికార్మికులను తేయాకుతోటల్లో నిర్బంధించిన అనేకానేక చట్టాలను వివరించి సురా 1884-85, 1888-89 నాటికి విజాతి కార్మికులెంతమంది ఉన్నారో పట్టిక ఇచ్చాడు.[40]

2. వలసప్రాంతాల ఉత్పత్తి, జీవన ప్రమాణాల పెరుగుదలరేటు ఇతర ప్రాంతాలకంటె తక్కువగాఉండాలి.[41] అంటున్నారు బాలగోపాల్‌గారు.

జీవనప్రమాణం సంగతి సరేగాని ఉత్పత్తి పెరుగుదలరేటు ఇతర ప్రాంతాలకంటె తక్కువగా ఉంటుందా? పెట్టుబడిని ఎగుమతిచేసి లాభాల్ని దిగుమతిచేసుకునే వలసవిధానంలో వలసలో ఉత్పత్తి పెంచడం జరగదా?

3. సురా "ఆధారం; ఇండియాటుడే 1961-71"[42] అని ఇచ్చినతర్వాత "ఏ సంవత్సరంలోనో ఏ సంవత్సరం ధరలప్రకారమో చెప్పలేదు"[43] అనడం, మళ్ళీ నాలుగులైన్ల కిందనే "అక్కడఇచ్చిన రెఫరెన్సునుబట్టి" అనడం బాలగోపాల్ గారికి భావ్యంకాదు.

4. సురా ఖచ్చితంగా "ఆధారం: ఆరవ పంచవర్షప్రణాళిక ముసాయిదా"[44] అని రాశాక ఐదో పంచవర్షప్రణాళిక గణాంకాలతో వాటినిపోల్చి సురా "జాగ్రత్తగా కలగలిపి"[45] ఏదో మోసం చేశాడన్నట్టు ఆరోపించడం బాలగోపాల్‌గారికి తగనిపని.

5. రెండున్నర పేజీలు సగటు గణాంకాల మీదనే ఆధారపడి వాదనచేసి ఆపని చేసినందుకే సురాను తప్పుపట్టడం భావ్యమా?[46]

6. మనమీపాలనను అంతం చేయడం ఎందుకోసం?[47] వర్గాల మధ్య ప్రాంతాల మధ్య, జాతుల మధ్య ఎగుడు దిగుళ్ళు లేకుండాచేసే సమసమాజం రావడానికి కాదా?

7. ఉద్యమాల వర్గస్వభావాలను కప్పిపుచ్చడమే సురా ఉద్దేశ్యమైతే[48] ఉద్యమాల్లో పాల్గొంటున్న, నాయకత్వం వహిస్తున్న వర్గాలనూ, వాటి ప్రయోజనాలనూ సురా ఎందుకు వివరించాడు?

8. "ఉద్యమాలు నడిపేవారి స్వభావాన్ని ప్రమాణంగా తీసుకోగూడదు. ఉద్యమం యొక్క అసలు స్వరూపం చూడాలి అన్న వాదన బొత్తిగా అశాస్త్రీయమని"49 ఖండించిన బాలగోపాల్‌గారు నాయకత్వం నిమిత్తమాత్రం అనడం పరస్పర విరుద్ధంగా ఉంది. ఆ తర్వాత ఆయన చేసిన వాదనఅంతా ఆయన అశాస్త్రీయమన్న వాదనను బలపరిచేదిగానే ఉంది. అస్సాం, ప్రిపాక్, త్రిపుర నాయకత్వాల వర్గపునాదీ, స్వభావమూ ఒకటే ఐనప్పటికీ ఉద్యమాల అసలు స్వరూపాలు వేరువేరు కాదా? ఈనాటి ఆదిలాబాద్ కరీంనగర్ జిల్లాల రైతాంగ పోరాటాలకు వ్యాన్‌గార్డ్‌గా నిలబడ్డది విద్యార్థులా?

9. రాష్ట్ర అధికార భాషగా బెంగాలీని తీసేసి అస్సామీని ప్రకటించగానే బెంగాలీ సాంస్కృతిక పీడన పాత కథ[50] అయిపోతుందా? అంటే ఇవాళ భారత దేశంలో ఇంగ్లీషు సాంస్కృతిక పీడన పాతకథ అయిపోయిందా?

10. "అస్సామీ భాష" మాట్లాడేవారు మైనారిటీ అయ్యారని[51] సురా అనలేదు "అస్సామీయులు" మైనారిటీ అయ్యారన్నాడు.

11. తలసరి ఆదాయమే అభివృద్ధికీ అల్పాభివృద్ధికీ నిజమైన ప్రమాణమవుతుందా?[52]

12. వలస విధాన దోపిడీ ఒక్క అస్సాంలోనే సాగుతుందని సురా అన్నాడా? చివరగా ఒక్కమాట- రగులుకొనే రాక్షసిబొగ్గుపై విమర్శలో బాలగోపాల్‌గారు మిత్రులపట్ల ప్రదర్శించాల్సిన వైఖరి ప్రదర్శించకపోవడం విచారకరం.

— 'పృథ్వి'

పాదసూచికలు

1 కె. బాలగోపాల్ - సృజన ఆగస్ట్ 1981 సంచిక 118 పేజీలు 5-18
2 ,, పే 5, 13
3 ,, పే 5
4 ,, పే 6
5 ,, పే 8
6 ,, పే 12, 13
7 ,, పే 13

8 ,, పే 13
9 ,, పే 16, 17
10 ,, పే 17
11 ,, పే 18
12 మార్క్స్, ఎంగెల్స్ - కమ్యూనిస్టుపార్టీ ప్రణాళిక- అను గిడుతూరి సూర్యం- విదేశ భాషా ప్రచురణాలయం, మాస్కో - పే. 30
13 ,, పే 32
14 Lenin- On the National Question and Proletarian Internationalism- Novosti Press Agency Publishing House- Moscow 1970 p. 143.
15 Lenin- Ibid p. 145
16 Stalin- Marxism and the National Quest on - Books & periodicals, Calcutta 1977 p. 26
17 మావో రచనలు - రెండో భాగం క్రాంతి ప్రచురణలు సికింద్రాబాదు 1979 పే. 265
18 Mao - Tse - Tung - Peking Review August 8 th 1963. as quoted in George Thomson - From Marx to Mao - Tse - Tung " China Policy Study Group - London - 1977 - p. 61
19 కె. ప్రసాదరావు- రాష్ట్ర విభజనోద్యమం-మార్క్సిజం, సృజన మే 1973 పే. 18
20 భారతదేశంలో జాతుల సమస్య- మార్క్సిస్టు దృక్పథం, క్రాంతి ప్రచురణలు, సికింద్రాబాదు 1981, Nationality Question in India, 1981.
21 ఆం. ప్ర. రాడికల్ విద్యార్థి సంఘం ఈ సెమినార్ ను 1981 ఆగస్టు 22, 23 తేదీల్లో మద్రాస్‌లో నిర్వహించింది.
22 G. Glezerman, Clasees and Nations, progress publishes, Moscow, 1980, p. 39.
23 సురా- రగులుకొనే రాక్షసిబొగ్గు, యుగ ప్రచురణలు, హైదరాబాదు, 1980, పేజీ 117.
24 ,, పే. 117
25 ,, పే. 122
26 ,, పే. 93
27 Lenin - Collected works, Vol 19, p. 91.
28 George Thomson, op cit. p. 54.

29 సురా, పై. ఉ, పే. 11.
30 ,, పే 11
31 ,, పే 11
32 బాలగోపాల్ పై. ఉ., పే 8
33 Nirmal Sen Gupta, Nationality Question In the Present Epoch. paper presented at All India Seminar on Nationality Question in India, Madras, 1981, p. 9-10
34 Tilottama Misra. Assam and the National question, paper presented at op cit Seminar - 1981 p. 12-13
35 Tilottama Misra, Ibid, p. 13
36 G. Glezerman, op cit p. 52
37 Lenin, opcit, p. 64
38 సురా, పై. ఉ. పే 129
39 బాలగోపాల్ పై, ఉ. పే 6
40 సురా పై, ఉ. పే 95
41 బాలగోపాల్ పై ఉ, పే 10
42 సురా పై ఉ. పే 74
43 బాలగోపాల్ పై ఉ. పే 9
44 సురా పై ఉ. పే 83
45 బాలగోపాల్ పై ఉ. పే 10
46 ,, పే 11
47 ,, పే 13
48 ,, పె 13
49 ,, పే 14
50 ,, పే 16
51 ,, పే 16
52 ,, పే 11,12

సమ్మె — విస్తరణ

కార్మిక

5 గంటల సైరన్ కూత అయితనే ఆడోల్లు నిద్రలేచి బొగ్గుపొయ్యిలు అంటేపెటోల్లు. తల్లులు లేపెటాల్లకు సంటిపిల్లలకు తెలివిపడి పిలగాండ్ల ఏడుపు. పొద్దటి బదిలి (డ్యూటీ) వచ్చిందంటనే పనికి పోయెటోల్లకు తిప్పలే, వండి పెట్టెటోల్లకు తిప్పలే. నిదురచ్చినా, పొరగాండ్లు ఏడ్సినా, చాతగాకపోయినా చీకటితోనేలేచి పొయ్యి అంటేసి కూడు అండుడు తప్పదు. పొయిల్లల్ల నుండి వచ్చేపొగకు పొద్దుపొడిచింది కూడ ఏర్పడదు.

పొయ్యిలు అంటేత్తనే నీల్ల కురుకాలె. వాడంతటికి ఒక్కటే నల్ల. నీల్లు దొరుకుతయోలేదోనన్న ఏగిరం. ఎంత ఏగిరపడి పంపుకాడికి పోయినా పోయెవారకే ఆడోల్లలొల్లి, కుండల సప్పుడు.

"మాఆయినది పొద్దటి డూటి నన్నొక కుండెడు నీల్లు పట్టుకపోనీయిండ్లి" ఒకరు.

"డ్యూటికి యాల్లయిపోతాంది పొయ్యిమీద బియ్యంపెట్టిన ఒక్క బిందెడు పట్టుకపోనీండ్లి దండంపెడుత" ఇంకొకరు.

ఇప్పుడచ్చే పట్టుకుంటనంటె మొదాలచ్చినోల్లం ఈన్నె ఉండాల్నా.

"నీమొగడే బాయిల పనిచేత్తాండు గాని నామొగడు చేత్తలేడా" అంటూ ఇంకొకరు.

నాకుండ ముట్టుడయ్యింది కొత్తది కొనియ్యి "చిన్నపెద్ద తేడేలేకుంటయింద"ని పెద్దకులపోల్ల బూతులు

"నీ కులంపెద్దదయితె ఇంటికాన్నే పంపేసుకోకపోయినవా" తక్కువకులపోల్లు.

నేను ముందంటే నేను ముందని తన్నులాటలు, సిగపట్లు, బండబూతులు, కుండలు పలుగుడు.

యాల్లయి పోవట్టే గుడిసెనుండి ఓగంట ముందుగాల్నె బయిల్లెల్లి 8 మైల్లు సైకిలు తొక్కితొక్కి తిన్నకూడు అరిగెతట్టు ఆదర బాదరపోతెనే డూటికిఅందినట్లు లేటయితె డ్యూటి ఎత్తిపోద్దని మొగోల్ల ఏగిరం.

పొద్దుగాల చీకట్ల లేచిపోతే పనిచేసి ఇంటికి తిరిగచ్చేటాల్లకు పొద్దుగూకె. కడుపుల ఆసర లేకుంటె బొగ్గుతట్ట ఎట్లమోత్తరు. రాత్రి మిగిలిందిపెడ్తె సలికూడని సరిగ్గ తినిపోరని పాతులాట.

స్నానం చేసినట్టు పెయిలకెల్లి చెముటకారంగ, కనిపించి కనిపించని మసుక లైటులోని, మందువాసన పొగల ఊపిరిఆడకుండ బొగ్గుతట్టెత్తుకోని ఎక్కడ జారి పడిసత్తనోనన్న బయంతో, పిక్కలునొప్పి పెట్టుతాంటె చడాబు ఎక్కుకుంట తట్టెత్తుకపోయి లాడీసులునింపి. పెయ్యంత నొప్పిపెట్టి, కాల్లుచేతులు గుంజుతాంటె అలిసిటతోని పడుకొన్న బర్తలను "డ్యూటి యాల్లయితాంది లేత్తెగాదా", ఆడోల్ల అరుపులు. "జెరాగ్రిగె చాతనయితలేదు కాల్లుగుంజుతానయి" మొగోల్ల గునుసుడు.

పిలువంగ పిలువంగ లేచి 6 గంటల సీటి అయితదని ఆదర బాదరగ కూడు తిని, బూట్లుతొడుక్కోని, తలకు టోపిపెట్టుకోని, తట్టచెమ్మసు పట్టుకొని సల్లంగ ఇంటికి తిరిగత్తనో ? లేదో? నని పిలగాండ్లను చూసుకోని, పెండ్లానికిచెప్పి డ్యూటికి బయిలెల్లుతరు.

నడిచిపోయేదోల్లు నడిచి, సైకిల్లమీద పోయెటోల్లు సైకిల్లమీద డ్యూటికి పోతాంటె, పెయ్యంత బొగ్గుమసి అంటి, గరిమిల బొగ్గుమోసి నడువచాతగాక ఈడ్సు కుంట ఈడ్సుకుంట ఇండ్లలకత్తాంటె గాయాల్లకు రోడ్లమీద ఎక్కడ సూసినాకార్మికులే.

బాయిలు నడిచినప్పుడే గిదంత. గాని గిప్పుడు లేదు గాతీర్గ,

తెల్లారుతుండంగనే 5 గంటల సైరన్ కూతమోగింది. సైరన్‌కూత ఇన్న ఆడోల్లు సదురుకోని పంటాండ్లుకాని లేత్తలేరు. తల్లులు పక్కల్నే ఉన్నరన్న దైర్యంతో పిల్లల ఏడ్పుల్లేవు. పొద్దుపొడుపు ఎల్లినా పొయిలల్ల నుండి పొగ ఎల్లుతలేదు.

అర్దగంటసేపు పడే పంపునీల్లకు మాత్రం ఆరాటం తప్పుత లేదు.

డ్యూటికి యాల్లయిపోతాందనేటి ఏగిరం లేదు మొగోల్లకు. బాయిల దిగుడు లేక చాల దినాల నుండి మూలకుబడ్డ తట్ట చెదలుపట్టింది. గుడెసె బొంగులకు కట్టిన టోపి పొగబట్టి నల్లబడుతాంది, తీసుడులేక మూలకుపడ్డ చెమ్మసు చిలుము పట్టింది.

సైరను సప్పుడేకాని సొరెడు బొగ్గు అత్తలేదు బాయిల్లల్ల నుండి.

పండ్లల్ల పుల్లేసుకోని హాజరన్నపడి అత్తమని కొందరు, బాయికాడ ఏమిసంగతి తేలుద్దో చూసివద్దామని కొందరు – బాయిల మీదికి పోతాండ్లు, తెల్లారంగనే ఇంటి ముంగట ఎవలో పిలుత్తాండ్లన్న అలికిడి ఇనంగనే కండ్లుతూడ్సుకుంట బైటికచ్చిండు రాజయ్య.

ఊరికి పోతివిగదా మాయిల్లమే అచ్చినవ్ కండ్లుతూడ్చుకుంటనే అడిగిండు చెందద్రియ్యను. "ఊరిసంగతి చెప్పుతగని, బాయిలు నడుత్తనయా ?" కండ్లుతూడ్చుకుంట కూకుండిపోయిన రాజయ్యకు చెందద్రియ్య మాటలు ఇనంగనే నిదరిమబ్బు తేలిపోయినట్టయి ఎనుకకుదిరిగి 'బాయిలు నడుసుడంటె అగమేనా ఏసంగతి తేలంది ఎట్లనడుత్త యనుకుంటున్నవ్ బాయిలు నడుసుడుగాదు రామకిష్టాపురం డివిజన్ బాయిలు కూడ బందైనయ్ ఇగేం నడుత్తయ్ బాయిలు దినదినం వారాలు గడువబట్టె బాఎనుకబాయి బాయిలన్ని బందుగావట్టె, గిట్లయితే బాగనేతింటం చిట్టిపైసలెట్లగట్టుడో ఏమో;" చెందద్రియ్య తందిపడుకుంట ఇంకేదో మాట్లాడుదాంఅనుకోంగనే చెందద్రియ్య బార్య చేతులూపుకుంట మాట్లాడుతూ వాకిట్లకచ్చింది. "నీకు చిట్టికెల్లకపోతే కంపినోనికి ముద్దా ? గిసోంటోల్లు ట్రయికెందుకు చేసింద్లు, తన్నినా గుద్దినా నోరుమూసుకుంట పనిచేత్తెగాదా ?" సంకలున్న పిల్లగాడు ఏడుత్తున్నా గాఏడుపుసంగతి పట్టించుకోకుండనే చెప్పుతాంది.

మాటల సందడిలో బీడి అంటించుకుందామని గీకిన అగ్గిపుల్ల సంగతేమరిచి మాటలింటాంటే చేయి సుర్రుమంది, పెండ్లాం మాటలకు రేషమచ్చింది చెందద్రియ్యకు "చల్....నువ్విక్కన్నుంచి ఎల్లిపో నువ్వేంచెప్పుతన్నవు నాకు గాపోరాగాన్ని ఊకుంచరాదు, రాజకీయం చెప్పుతనవానాకే."

చెందద్రియ్య ఎవ్వారానికి కోపానికి రావన్నో, నవ్వన్నో సమజుగాలె రాజయ్యకు.

'గాదానిమీద నీకెదుకెగురుతవ్ గాఎగిరేదేదో దొరోనిమీది కెగురుతెగాదా ? అయినా అచ్చక్క అన్నదాంట్ల ఏం తప్పున్నది. గానెల రోజుల కింద మీబదిలి పిల్లరోల్లే లొల్లిబెడ్తిరిగదా పేం పనిలెక్క 3 ఏండ్లాయె ఇంకా పర్మనెంటు చేత్తలేరు కంపినోల్లని, గప్పుడు నువుకూడ బాగనే మాట్లాడ్తివిగదా, గప్పుడు గూడ బాయిబందుపెట్టె ఇద్దర్ని జైళ్ళ పెట్టిరిగదా ? గట్లనే ఇప్పుడు గూడ, లాడీనోనికి కాలుమీద బొగ్గుపెల్లబడి కాలు చితల్ చితలు అయ్యి కాలంత వాపెక్కి, దొరా నానొప్పి ఇంకతగ్గలేదు నన్ను దావఖాన్లనే అన్‌ఫిట్‌లో ఉంచుండ్లని గట్టిగ చెప్పినందుకే గావాని బాదంత సూడకుంటనే డాక్టరోడు ఫిట్టుజేసే, మీదికెల్లి అరెస్టు చేపించే, నీకు గిట్లయితే ఊకుంటవా' రాజయ్య మాటలకు బీరిపోయి సూత్తాండు చెందద్రియ్య.

రాజయ్య ఇంకేదో చెప్పుదామనుకునటాల్లకే ఏదో ఎత్తిపోతునట్లు మోగుతాంది సైరన్ కూత, కూత పప్పుడు ఇంటనే కూసున్నోడు లేచి; "7 సీటి అయితాంది బాయికాడికి పోదాంపా" అంటు కదిలిండు రాజయ్య.

రాజయ్య ముంగట నడుస్తుంటె ఎనుక చెంద్రియ్య బయల్దేరిండు.

"నిన్ననే రాత్రిబదిలి (మూడోషిఫ్టు) నడుత్తదన్నరుగాదా ఏమయింది. నువు పోలేదా డ్యూటికి" వెనుక వస్తున్న చెంద్రియ్య మాటిని నిలబడ్డడు రాజయ్య.

"అ.. నిన్న యూనియనోల్లు బజారు మీద మందిని జమజేసి చెప్పిండే అబాయి ఈబాయోడు అంతా 50 మంది దాకా వాళ్ళ మనుషులే జమఅయిండ్లు. యూనియనోల్ల మాటిని బాయిలల్లకు దిగుతే మనగురించి పట్నంలొకొట్లాడి అడ్వాన్సు ఇప్పిత్తనన్నడు".

"అయితే లేబరోల్లు ఏమన్నరు" చెంద్రియ్య. "లేబరోల్లెవరు? అచ్చినోల్లు వానోల్లే కాబట్టి సరేఅంటే సరేఅన్నరు. గంతల్లకే ఏమున్నది జే అంటే జై అని పించిండు లీడరాయన. ఇంకేమున్నది ఊరంత ప్రచారం చేసిండ్లు! రాత్రి బదిలి నడుత్తదని అవుగని నువు ఊరికేపోతివి నీకెవ్వలు చెప్పిండ్లు?"

'గా.... 5 ఇంక్లయిన్ల చేసెటోడు మా ఊల్లెగల్పి చెప్పిండె' చెంద్రియ్య.

'వాడు లీడరోల్ల మనిషి గావచ్చు నీతోచెప్పింది అందుకే ఊరికి పోయినోనివి మాయిల్లమె తిరిగచ్చినవా' రాజయ్య. ఊరు సంగతి తీపెటాల్లకు మనుసుల కలకల మన్నది చెంద్రియ్యకు. కాసేపు ఏమి మాట్లాడకుండనే నడిసిండు.

చెంద్రియ్య మాటెందుకు బందుజేసిండో సమజుగాక "మాట్లాడవేందే అన్నడు" రాజయ్య.

"ఏం మాట్లాడెతట్టున్నది, ఏమి జెప్పెతట్టున్నది ఏడసూడబోదమన్నా ఏమి సక్కదనంలేదు. అంత నాషన గాలానికేవుంది".

"ఏమయిందేంది" ముంగట నడుస్తున్న రాజయ్య ఎనుకకు తిరిగి అడిగిండు.

"బాయిలు బంద్లై, జీతంలేక బియ్యానికి తిప్పలగావట్టెగదా మా అన్నదగ్గరికన్న పోయి ఏమన్న రూపాలడుకచ్చుకుందామని ఊరికిపోతే ఏమున్నది ఇక్కడి కంటె ఎక్కువే నడిసింది అడగూడ."

ఇంకేదో చెప్పుదామనుకునేటాల్లకే అడిగిండు రాజయ్య "ఏమన్న లొల్లి జరిగిందా ఇంటికాడ."

"ఇంటికాడగాదు, ఊల్లనే జరుగుతాంది ఊరోల్లకున్నూ దొరోనికి కూల్లు, కయికిల్లు, జీతాలు పెరుగన్నని ఊల్లె సంఘంబెట్టి, దొరోనితోని వాల్లు చెప్పకుంటే వాడు ఇనలేదట, అయితేమయిందంటే ఊల్లోలంత దొరకు పనికిబోవుడు బందు పెట్టిండ్లట, ఇంకేమున్నది దొరోడు పోలీసోల్లను పిలిపించి పనికి రానోల్లందర్ని

కొట్టుతాంటే ఆడోల్లు, మొగోల్లనకుండ వాల్ల యిట్లంవచ్చినట్లు కొడుతాంటే ఊరు యిడిసి దెంకపోతాండ్లందరు. మాటడు కూడ ఎటోపోయిండట. నేను ఊల్లెకు పోయె సరికి పోలీసోల్లు నన్నుపట్టుకోని రాడికల్లోనివార నువ్వు అని తన్నుకుంట దొరోనింటికి తీసుకపోంగనే ఆడ పటువారోడు కలిసి "వీడిక్కడోడుగాదు" సుట్టీరాన్ని కచ్చిండు అన్నింటికీ. వీన్నిడిసి పెట్టుండ్లంటె "మాదర్ చోత్ ఎందుకచ్చిన వీడికి" అని ఇంకే దేదో తిట్టుకుంట ఎల్లిపోఅని దొబ్బేసిండ్లు. ఇగ నాకాఊల్లె ఉండబుద్దిగాక తెల్లారేసి ఎల్లచ్చిన." పోలీసోల్లు కొట్టినదెబ్బ సూపించుకుంట చెప్పిండు చెందిరియ్య.

మాటలల్ల తొవ్వనడిసినట్లే ఏర్పల్లే, బాయి దగ్గరికిరానే వచ్చిండ్లు.

"ఏమయిందే? ఎటాయె: మాయిల్లమే తిరిగత్తాండ్లు:" హాజరుపడి ఇంటికచ్చె టోల్లను ఆపి అడిగిండు చెందిరియ్య.

"ఏమున్నది ఇగ బాయిలు నడుసెతట్టులేవు గదా ఊరికన్న బోదామని తొందరగ మర్లినం."

"గదిసరేగాని బాయిమీద ఏమి సంగతి జరిగింది," రాజయ్య.

"సంగతేంది ఉన్నసంగతే మస్టర్లు కోసుడు బరాబరేనట లాడీసోల్ల (లాడీసులల్లో బొగ్గు నింపేకార్మికులు) పేర్లురాసి బోర్డు ఏసిండ్లు, ఇంక ఎవలకో ముగ్గురికి "డిస్మిస్ లెటర్లు" గూడ యిచ్చిండ్లట:" చెప్పుకుంటనే ఇంటికి పోయెటోల్లు ఎల్లిపోతాండ్లు.

"ఇగ గిట్లయితే బాయిలు నడిసినట్టే, ఇంకేంనడుత్తయి:" రాజయ్య.

"గాబెల్లంపల్లి బాయిలోల్లకు కట్టుచేసిన జీతంఇచ్చిండ్లటగదా గట్లనే మనకుగూడ ఇత్తెగాన గాడ్దికొడుకులు:" చెందిరియ్య.

"ఇగో.... అన్ని బాయిల మీద ఒక్కసారే కానూనుపెడ్తె బాయిలన్ని బందయి తయిగాబా, అందుకే వాల్లకు తిరిగిచ్చి, మనకు కట్టుజేత్తాండ్లు:" రాజయ్య.

"ఆగో! వాల్లకో కానూను మనకో కానూనా? నీయవ్వ మా ఊల్లెగూడ గిట్లనే చేత్తాండ్లు, కూలిపెంచుమని ఊరోల్లు బందుపెడ్తె ఊరోల్లకు ఇవ్వకుండనే ఎక్కువ పైసలిత్తనని పక్కఊరోల్లను కూలికి తెచ్చుకుంటాండు దొరోడు:" చెందిరియ్య.

"వాల్లకిట్లమైందే కానూను. అక్కడోల్లకిచ్చి ఇక్కడోల్లను దెబ్బకొట్టాలని సూత్తాండ్లు కంపినోల్లు" రాజయ్య.

"నీయవ్వ బలేఎత్తులున్నయి కంపినోనిదగ్గర" చెంద్రియ్య.

"బాయికాడ మంది బాగనే జమ అయినట్లు ఉన్నరుగదా" రాజయ్య.

"ఆ.... పోలీసోల్లుగూడ పొద్దుగాల్నే అచ్చిండ్లు" చెంద్రియ్య

మ్యాన్‌వే ఆఫీసుకాడ హాజరుపడేటోల్లు హాజరుపడుతాండ్లు. గుంపుగ నిలబడ్డ మంది బోర్డుకు అంటించిన కాగితాలు సదువుతాండ్లు. సదువచ్చినోల్లు చదువుతాంటే రానోల్లు ఇంటాండ్లు. తుపాకులుపట్టుకొని 20 మందిదాక పోలీసోల్లు మర్రిచెట్టుకింద నిలబడ్డరు.

కట్టెచేతులపట్టుకున్న జెమదారు చెట్టుకాడికి, మేనేజరు ఆఫీసుకాడికి తిరుగుతాండు.

బోర్డుకాడ మంది బాగజమయిండ్లు. ఏమి కాగితాలో ఎనుకోల్లకు కనబడుతలేవు.

'చదువెటోల్లెవరో బాగ సదువరాదుండ్లి' మందిలకెల్లి ఎవరో కార్మికుడు.

'నేను చదువుతుండుండ్లి' పయింటుతొడుక్కున్న కార్మికుడు ముందుకచ్చిండు.

కాగితాలమీద అన్ని లాడీసోల్లపేర్లే, 1160 మంది పేర్లదాక రాసున్నయి. పేర్లమీద ఇంకేదో రాసివున్నది. పేర్లకింద బాయి మేనేజరు సంతకం చేసివుంది.

ముందుకచ్చిన కార్మికుడు సదువుతాండు "ఇందు మూలముగా లాడీసు కార్మికులకు తెలియజేయునదేమనగా : కార్మికులు చట్టవిరుద్ధమైన సమ్మె చేయుచున్నందువలన కార్మికుల జీతం నుండి 8 మస్టర్లు కోతపెట్టబడును. అనగా ప్రతి కార్మికుని జీతం నుండి 281 రూ॥ కట్‌చేయబడును." కింద పేర్లురాసివున్నయి.

చుట్ట తాగుతున్న ముసలి కార్మికుడు నోట్లోచుట్టను చేతిలపట్టుకోని తుపుక్కున ఊంచి "వారీ నిన్నవచ్చిన లీడరోడు అసలు కోతచట్టమేలేదనిచెప్పె, కంపినోడేమో నోటీసుబోర్డుపెట్టి కట్‌చేత్తననబట్టె ఎవనిమాట నమ్మేతట్టులేదు".

"కోతపెట్టుటొక్కటేకాదు ముగ్గురికి "డిస్‌మిస్ లెటర్లు" కూడ ఇచ్చిండ్లట" ఇంకో కార్మికుడు.

డిస్‌మిస్‌ల సంగతి ఇనటాలకే ఎవలెవలకటా ? అంటూ దూరాన నిలుసున్నోల్లు దగ్గరికచ్చిండ్లు.

అప్పుడే కండ్లద్దాలు, జేబునిండ కాగితాలు పెట్టుకున్న మేస్త్రి గుంపులకచ్చి, మన సొరువచ్చిండు పోదాంపొండ్లని కార్లనుండిదిగిన లీడరుదగ్గరికి పోతాండు.

గా మేస్త్రిమాట పట్టించుకోకుండానే "లాడీసోల్లకు ఇద్దరికి, జనరల్ మజ్దూ రాయినకు ఒక్కనికి లెటర్లు ఇచ్చిండ్లట"

నొల్లెసుట్ట కిందపారేసి ముసలోడు "బంచొత్ బాయిల ఎవడు దిగుతడో సూద్దాం, ఎవడన్నదిగుతె చెప్పులు మెడలేసి తింపుదాం".

"లాడీసోల్లు పైకుచేత్తె మజ్దూరాయినకు ఎందుకిచ్చిండ్లట" దవుడకు పొగాకు ఏసుకుంట అడిగిండు టింబరింగు కార్మికుడు.

"వీల్లుముగ్గురు చేయబట్టే సమ్మె జరుగుతాందట. సమ్మెకు మీరే కారకులని, కార్మికుల్ని రెచ్చగొట్టి సమ్మెచేపిత్తాండ్లని ముగ్గురికి లెటర్లు యిచ్చిండ్లు" పయింటు తొడుక్కున్న బదిలీపిల్లర్ కార్మికుడు బడాబడాచెప్పిండు.

"యూనియన్ లీడర్ వచ్చిండుగదా ఏమిచెప్పుతడో వోదాంపా" కార్మికులు కదిలిండ్లు.

అక్కడక్కడ నిలుసున్న కార్మికులంతా ఒక్కకాడికి జమఅయిండ్లు.

"ఆపతి అత్తెనో(ఆగిఅడగంది ఎల్లదాయె. ఆగిఅడుగుతెనో జీతం కోతపెట్టవట్టిరి మీదికెల్లి డిస్‌మిసులు చేయబట్రిపుల్ల ఎమర్జెన్సీకన్న ఎక్కువనే సాగించుకునేతట్టున్నది". కూసున్నోల్లులేసి పందిల కచ్చిండ్లు.

కండ్లద్దాలుతీసి చేతులపట్టుకోని చెయ్యిఊపుకుంట మాట్లాడుతాండు లీడరాయిన. వేరేబాయిలకాడి నుండి వచ్చిన లీడరాయిన యూనియన్ మనుసులు లీడరెనుక నిలుసున్నరు.

"కార్మిక సోదరులారా.... మీరంత కూర్చోండి".

"మనం కూకోకుంటె ఈనెకు సభచెప్పరాదా? కూసుంటేంది, నిలబడుతేంది నువ్వు చెప్పేదేందో చెప్పరాదు"; పందిల నుండి మాటలు.

పరిస్థితి ఏమి బాగలేదనుకున్న లీడరాయిన తన ఉపన్యాసాన్ని మొదలుపెట్టిండు "కామ్రేడ్స్.... మీరంత ఐక్యంగాఉండి ట్రేడ్‌యూనియన్‌కు మద్దతునిస్తే మేనేజిమెంటుతోని కొట్లాడి ఏదైనా సాదించగలం. మేనేజిమెంటు చట్టాన్నితప్పుగా అర్థంచేసుకుంటాంది అసలు ఏకానూన్లో కూడ సమ్మెచేసినోల్ల జీతం కోతపెట్టడానికి కంపినోల్లకు అధికారంలేదు. కాని ఈ లేని చట్టాన్ని ఉన్నదని ప్రచారంచేసి కొంత మంది కార్మికులు మిమ్ముల్ను రెచ్చగొట్టి సమ్మెచేపిస్తాండ్లు"

లీడరుమాటలు పూర్తిగానేలేదు; గుంపుల గుసగుస మొదలయింది. "మనిషికి 281 రూ॥ జీతం కోతపెడుతున్నామని పేర్లురాసి బోర్డుపెట్టే కంపినోడు. కార్మికులు రెచ్చగొడుతుండ్లా కంపినోడా?"

ఆఫీసుముందు నిలబడి తనకేమిపట్టనట్లు సిగరెటు పీల్చుకుంట నిలబడ్డడు మేనేజరు. కట్టెబట్టుకున్న జమేదారు మందిదగ్గరికచ్చింది.

"ఆయన జెప్పేదేందో పూర్తిగా చెప్పనీయండ్లి ఎవ్వలుగూడ మద్య మద్య మాట్లాడకండి ఆయన మాట్లాడుడయినంక మనం మాట్లాడుదాం"; కార్మికల్లో ఒకడు గట్టిగచెప్పేసరికి.... తిరిగి ప్రశాంతత.

"కార్మిక సోదరులారా సమ్మె మనకు చివరి ఆయుధం. అన్ని అవకాశాలను ఉపయోగించుకొని ఏమికానప్పుడు ఆఖరిసారి మాత్రమే మనం సమ్మెచేయవలసి ఉంటది. కామ్రేడ్ లెనిన్ చెప్పినట్లు రెండుఅడుగులు ఎనుకకేసి ఒక్కఅడుగు ముందు కెయ్యాలె కాబట్టి ఇప్పుడు సమ్మెను విరమించుకొని పనుల్లోకివెల్లండి. కార్మికు లందరికి అడ్వాన్స్ ఇప్పించెటానికి నేను హైదరాబాదులో ప్రభుత్వంతో మాట్లాడి, కొట్లాడి......."

మాటలు పూర్తిగానేలేదు కార్మికుల్లో తిరిగి గందరగోళం.

"మస్టర్లు కోతపెట్టుడు బందుకావాలని మనమంటాంటె అడ్వాన్స్ ఇప్పిస్త దంటడేందిరా"

"ఎప్పుడచ్చినా రెండడుగులు ఎనుకకు, ఒక్కడుగు ముందటికంటడు, తాపకు రెండు అడుగులు ఎనుకకేత్తె మనం ఎక్కడికి పోతాంరా ? .... అయినా మనం అడ్వాన్సుకోసం సమ్మెచేత్తానమా" కార్మికుల్లో కలకలం లేసింది.

లీడరాయనకు మొకాన చెమటపట్టింది జేబులనుండి దస్తితీసి తుడుసుకున్నడు, కార్మికులలొల్లిలో తనమాట అందరికి వినిపిస్తలేదనుకొని గొంతెత్తి మాట్లాడుతాండు.

"కామ్రేడ్స్.... మస్టర్లు కోతపెట్టేచట్టం ఇప్పుడు పుట్టిందికాదు. 1936 నాడు ఇంగ్లీసోల్ల జమానల్నే పుట్టింది. ఈ చట్టం మనకేకాదు, దేశమంతటఉన్నది. దేశ మంతా సమ్మెచేస్తెనే పోతదికాని మన సింగరేణిల్నే సమ్మెచేస్తెపోదు. కాబట్టి రాడికలోల్ల మాటలుపట్టుకొని సమ్మెను కొనసాగించి నష్టపోకుండ్లి. సమ్మెచేస్తె చట్టంపోదు. మేము సుప్రీమ్‌కోర్టుల కేసుపెట్టి సాదించుకత్తం. రాడికలోల్లు మిమ్ముల్ని ఎగేసి తప్పుకుంటరు. నష్టపోయేదిమీరే. ఇంద్రవెల్లిలో అమాయకులైన గిరి జనులను రెచ్చగొట్టి 60 మందిని తుపాకులకు గురిచేసిండ్లు. మేము మేనేజిమెంటుతో ఏదో ఒప్పందం చేసుకున్నమని తప్పుడుప్రచారం చేత్తాండ్లు. మా ఎర్రజెండా యూనియన్ నాయకత్వాన 30 పైసలున్న కార్మికుల జీతాన్ని 30 రూ॥ అయ్యేందుకు ఎంతోకొట్లాడి సాదించినం. ఇంకా ఎన్నోహక్కులు సాదించుకున్నం కాబట్టి ......"

కార్మికుల అలజడిలో లీడర్ మాటలు కమ్మేసినయి.

"గా యింద్రివెల్లి సంగతి ఇప్పుడేందిరా వీడుచెప్పేది".

"కంపినోడు అన్నట్లే లీడరోడు అనబట్టె. రాడికలోల్లు ఎగేసుదేమున్నది జీతాల్లల్లకోత పెట్టేది అబద్ధమా?" అక్కడక్కడ కూసునోల్లు నిలబడి బొగ్గుదుమ్ము అంటుతె దులుపుకుంటలేసి గుంపుల కచ్చిండ్లు.

"6నెల్ల కిందట పండుగమస్దరు కట్టిత్తలేకుంటే బాయిలోల్లు అందరుఆగి లొల్లి బెడితె నేను కేసుపెట్టి గెలిపిత్తనని బాయిలదించి ఏమిసాదించుకచ్చినవ్వర? కేసుపెడ్త డటకేసు ఏదిఅడిగినా కేసుపెట్టుడే బాయిల దెబ్బతగిలి కాలిరిగినోనికి దవాకాండ్లమందు లిత్తలేరంటె కూడ ఎవలు ఆగి అడుగద్దట? దానికిగూడ కేసేపెడుతడా వీడుకేసుపెట్టి, వాడు వాదించి యాడాదితర్వాత ఒకేల్ల గెలిసత్తె అప్పటిదాకా దెబ్బతాకినోడు ఆన్నే సత్తడా? కోర్టోడు మాత్రిం సర్కారోడు కాదా?"

పొద్దుఎక్కి ఎండ మండుతాంది. రాంగకూడ తినిరాక కడుపుల మండుతాంది. లీడరోని మాటలకు కార్మికుల గుండెలు మండుతానయి. ఈ మంట ఆమంటతో లొల్లిఎక్కువైంది. కార్మికులల్ల నుండి లాగుతొడుక్కున్న లాడీసాయిన అటీటుపోయే కార్మికుల్ని దగ్గరకుపిలిసి అందరిముంగట నిలబడి లీడరుచెప్పిందానికి వ్యతిరేకంగా మాట్లాడెసరికి లీడరు మనుసులు మాటలకు అడ్డమచ్చి మాట్లాడనిత్తలేరు.

"ఇగో మీలీడరు మాట్లాడినప్పుడు మేం లొల్లిలేకుండ యున్నం గట్లనే ఇప్పుడు మావోడు మాట్లాడుతాంటె మీరినాలె. నువుమాట్లాడుతాంటే మేం అద్దన్నమా, మావోన్ని ఎందుకద్దంటాండ్లు?"; మందిలో మల్లి లొల్లిలేసేసరికి లీడరు మనుసులు పక్కకుజరిగిండ్లు. ముందుకుపోయిన కార్మికుడు మాట్లాడుడు మొదలుపెట్టిండు.

"సూడుల్లి అన్నలారా నిన్నటిదాకనో కోతచట్టమేలేదు, రాడికలోల్లే ఉన్నట్టుగ తప్పుడు పచారం చేత్తాండ్లన్నడు. ఈరోజునోన్ని చట్టం ఎనుకన్నేపుట్టింది కేసుపెడ్త నంటాండు. మనం జీతంకోత బందుకావాలని సమ్మెచేత్తాంటే అడ్వాన్స్ ఇప్పిత్త దిగుండ్లని చెప్పుతాండ్లు. అయితే ఎవరు తప్పుడు ప్రచారం చేత్తాండ్లో ఎవలు రెచ్చ గొడతాండ్లో మీరే అర్థంచేసుకోండ్లి. ఆపదచ్చినవ్వుడు సమ్మెచేసెదాకా ఎవడు పట్టించు కుంటలేదు. సమ్మె కార్మికుల జన్మహక్కు.

కార్మికులకు లేనిపోని సమస్యలుసృష్టించి మొండితనం అవలంబిస్తున్న మేనేజి మెంటు వాండ్లు కార్మికులను సమ్మెచేసేస్థితికి రెచ్చగొడుతుండ్లు. న్యాయమైన సమస్యల గురించి సమ్మెచేస్తె జీతంలో కోతపెడుతాండ్లు. అంటే సమ్మెచేసేహక్కు మనకు లేదన్నమాట. అయితే మనం వానిసల్లెక్కనే పనిచేయువలసి ఉంటది. అయితే మేనేజిమెంటుతోని ట్రేడ్‌యూనియన్లు విద్రోహపు ఒప్పందాలుచేసుకోని కంపినోని దిక్కే మాట్లాడుతాండ్లు. అయితే లీడర్లు కంపినోల్లుకలిసి ఈరకంగ జేసుకుంటనే సమ్మెను మేమే చేపిస్తున్నమని నాకు మరి వేరేఇద్దరికి డిస్‌మిస్‌లెటర్లు ఇచ్చిండ్లు. కాబట్టి కార్మికులారా ఎవరు ఏమనిచెప్పినా మీకు సమ్మెహక్కుకావాలో లేక వాని సత్వమే కావల్నో ఆలోసించుకోని అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడండి."

కార్మికునిమాటలు పూర్తిగాకముందే యూనియన్ నాయకులు కల్పించుకునే సరికి కార్మికుల్లో లొల్లిమొదలైంది.

"కార్మికుల్లారా యూనియన్ లేకుండా సమ్మెచేసి మీరు ఏమిసాదించుకోలేరు. మా మాటఇనకుండ మీరుంటె మీగుంచి ఎవలు కంపినితోని మాట్లాడుతరో, ఏ లీడరు సాదిత్తదో సాదించుకోండి" కార్మికులమీద అలిగినట్టు మాట్లాడిండు లీడర్.

"ఇగో యూనియన్‌నుండి నువ్వు రాజీనామ పెట్టి పో తర్వాత మాదాంట్లనుండే పుడుతరు లీడర్లు". కార్మికులు.

"వానితోనేందిరా ప్యాపా" అంటు కార్మికులంతా కదిలిండ్లు. ఎవరికి తోచినట్లు వాల్లు లీడర్లను మేనేజిమెంటును తిట్టుకుంట ఇండ్లదారి పట్టిండ్లు. లీడర్ల కుట్రలకు లేబర్లగుండెలు మండుతానయ్.

"కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి!" ఎవరో కార్మికుడు మందిలకెల్లి గొంతెత్తి అరిచిండు. కార్మికులంతా అందుకున్నారు.

"మేనేజిమెంటు దౌర్జన్యం నశించాలి!"

"దొంగ ట్రేడ్‌యూనియన్ల కుట్రలను బగ్గుంచేయండి!"

"మస్టర్లకోత చట్టానికి వ్యతిరేకంగా పోరాడండి!"

"పోలీసు క్యాంపులను ఎత్తివేయాలి."

కార్మికుల ఊరేగింపు కదులుతు పోతుంటే పోలీసువ్యాను వెంబడించింది.

పిచ్చివాడి డైరీ

లూసున్

ఆ ఇద్దరు అన్నదమ్ములూ— వాళ్ల పేర్లు మనకి అనవసరం— నేను హైస్కూల్లో చదువుకునే రోజుల్లో నాకు మంచి స్నేహితులు. మేము విడిపోయి కొన్నేళ్లగడిచిన తర్వాత, క్రమంగా ఒకళ్ల సంగతి ఒకళ్లకి తెలియకుండాపోయింది. కొన్నాళ్లకిందట వాళ్లల్లో ఒకడికి చాలా జబ్బుగావుందని విన్నాను. మా ఊరువెడుతూ, దారిలో వాళ్లని చూడ్డంకోసం దిగాను. అయితే ఇద్దరిలో ఒకడే నాకు కనిపించాడు. జబ్బుచేసింది వాళ్ల తమ్ముడికి అని చెప్పాడు.

"మమ్మల్ని చూడ్డానికి పాపం! అంతదూరంనించి శ్రమపడివొచ్చావు. చాలా సంతోషం! మావాడికి కొన్నాళ్లకిందటే నయమయిపోయింది. మళ్లీ ఉద్యోగంలో జాయిన్ అవడానికి వెళ్లిపోయాడు." అన్నాడతను అని, నవ్వుతూ వాళ్లతమ్ముడు రాసిపెట్టుకున్న డైరీ రెండు సంపుటాలు నాముందుపడేసి "ఇవిచదువు, వాడిజబ్బేమిటో నీకు తెలుస్తుంది. పాతస్నేహితుడివి గనుక వీటిని నువుచూస్తే ప్రమాదంలేదు." అన్నాడు. నేనా డైరీ మొదటినుంచి చివరిదాకా పూర్తిగా చదివాను. అతడొకరకమైన హింసన భయ గ్రంథి (Persecution Complex) తో బాధపడినట్టు నాకు తోచింది. రాత చాలా గందరగోళంగా, సందర్భశుద్ధి లేకుండా ఉంది. చాలా చాలా దారుణమయిన మాటలు రాశాడు. అంతేకాక, అతను తేదీలు వెయ్యలేదు. సిరారంగు మార్పునిబట్టీ, దస్తూరీలో మార్పునుబట్టీ అదంతా ఏకబిగిని చేసిన రచనకాదని తెలుస్తూంది! అయితే కొన్నిభాగాలు మరీ అంత అసంబద్ధంగాలేవు. వాటిలో కొంతభాగం వైద్యపరిశోధన నిమిత్తం నేను కాపీ చేసుకున్నాను. డైరీలో ఏ అసంబద్ధవాక్యాన్నీ నేను మార్చలేదు. పేర్లు మాత్రం మార్చాను. అయితే దానిలో ఉదహరించబడిన వ్యక్తులు లోకానికి అంతగా తెలియని పల్లెటూరివాళ్లు; ఊరూ, పేరూ లేనివాళ్లు. శీర్షిక వ్యాధినయమయిన తర్వాత డైరీ రచయితే పెట్టింది. దాన్ని నేను మార్చలేదు.

1

ఈరాత్రి చంద్రుడు చాలా కాంతిగా ఉన్నాడు.

ముప్ఫయ్యేళ్లపైబడి నేను చంద్రుణ్ణి చూడలేదు. అందుకని ఇవాళ చంద్రుణ్ణి చూడగానే నా సంతోషానికి అవధుల్లేవు. గడచిన ముప్ఫయిపైచిలుకు సంవత్సరాలూ నేను చీకట్లో ఉన్నానని క్రమంగా అర్థంఅవుతూంది. ఇక ఇప్పుడు నేను చాలా జాగ్రత్తగా వుండాలి. లేకపోతే 'చావో' ఇంటిదగ్గర ఆ కుక్క నాకేసి రెండుసార్లు అలా ఎందుకుచూస్తుంది?

నా భయానికి తగినంత కారణం లేకపోలేదు.

2

ఈరాత్రి అసలు చంద్రుడులేడు. ఇది అపశకునమని నాకు తెలుసు. ఇవ్వాళ పొద్దున చాలా జాగ్రత్తగానే నేను బయటికివెళ్లినా, చావో నాకేసి చిత్రంగాచూశాడు- నేనంటే భయపడుతున్నట్టూ, నన్ను హత్యచెయ్యదల్చుకున్నట్టూ. ఇంకా ఏదెనమందు గురున్నారు. నన్నుచూసి గుసగుసలాడుకుంటున్నారు. నాకు ఎదురయిన వాళ్లందరూ అలాగేవున్నారు. అందరిలోకీ భయంకరమయిన వ్యక్తి నన్నుచూసి వెకిలిగానవ్వాడు నేనాపాదమస్తకం వణికిపోయాను- వాళ్ల ఏర్పాట్లన్నీ పూర్తయినయ్యని తెలిసి.

అయితే నేను జంకలేదు- ముందుకి సాగుతూనేవున్నాను- ఎదురుగా కొందరు పిల్లలు నా గురించి చర్చిస్తున్నారు- వాళ్లకళ్లల్లో చూపుకూడ సరిగ్గా చావో చూపులాగానేవుంది- వాళ్ళ ముఖాలు కూడా పాలిపోయివున్నాయి- వాళ్ళలా ప్రవర్తించడానికి, ఆ పిల్లలకి నామీద కక్ష ఏమిటా అని నేనాశ్చర్యపోయాను- ఉండబట్టలేక 'నాకు చెప్పండి' అని అరిచాను కాని వాళ్లుపారిపోయారు.

చావోకి నామీద ఏంకక్షో! రోడ్డుమీది జనానికి నామీద ఏంకక్షో! '— నాకు ఆశ్చర్యంగావుంది, ఇరవయ్యేళ్ళ క్రితం 'కూ చియు' వ్రాసిపెట్టుకున్న చాలాఏళ్ళ తాలూకు అకౌంటు కాగితాలమీద నేను నడవడం, 'కూ'కి చాలాకష్టం కలగడం తప్ప మరోటి నామనస్సులోకి రావడంలేదు- చావో అతణ్ణి ఎరక్కపోయినా ఈమాట వాడు వినివుండాలి- అందుకు నామీద కక్ష తీర్చుకోవాలనుకుంటూవుండాలి- అందుకని అతడు రోడ్డు మీది జనంతో కలిసి నామీద కుట్రపన్నుతున్నాడు- మరి పిల్లల మాటేమిటి? అప్పటికి వీళ్లు పుట్టనయినా పుట్టలేదే? ఇవ్వాళ వాళ్లు నన్నెందుకంత వింతగాచూడాలి? నేనంటే భయపడుతున్నట్టూ, నన్ను హత్య చెయ్యదల్చుకున్నట్టూ? ఇది నిజంగా నన్ను భయపెడుతోంది, కలచివేస్తోంది, నాకు చిరెత్తిస్తోంది.

నాకుతెలుసు- ఈమాట వాళ్ళ తలిదండ్రులవల్ల వాళ్లు వినివుంటారు.

3

రాత్రుళ్లు నిద్రపట్టడంలేదు- ఏ విషయమైనా అర్థంకావాలంటే జాగ్రత్తగా ఆలోచించాలి.

ఆ జనంలో కొందరికి మేజిస్ట్రేటు 'కోదండం' శిక్షవిధించాడు- కొందర్ని స్థానిక కామందులు లెంపకాయకొట్టారు- కొందరి భార్యల్ని అమీనాలు లేవదీసుకుపోయారు- కొందరి తల్లిదండ్రులు అప్పుల బాధపడలేక ఆత్మహత్యచేసుకున్నారు- కాని అదెప్పుడూ వాళ్ళు నిన్నటంతగా భయపడలేదు; భయంకరంగా కనిపించలేదు.

అన్నిటికంటె విచిత్రమయిన సంగతి- నిన్న ఆ స్త్రీ వీధిలోపిల్లాడిని జబ్బపట్టుకొని లాక్కుపోతూ "రాక్షసి పిల్లాడా! నిన్ను చూస్తుంటే నమిలిమింగేయాలన్నంత కోపమొస్తోంది" అంది- అయినా అంతసేపూ ఆవిడ నాకేసేచూస్తూంది- నా ఒళ్ళు జలదరించింది- నన్ను నేను తమాయించుకోలేకపోతూను- అప్పుడు ఆకుపచ్చ ముఖాల, పారపళ్ళ జనమంతా వెర్రెత్తినట్లు నవ్వడం మొదలెట్టారు. ముసలి చెన్ హడావిడిగావచ్చి నన్ను ఇంటికి లాక్కుపోయాడు.

అతడునన్ను ఇంటికి తీసుకపోయాడు సరే- ఇంట్లో అందరూకూడా నన్నెరగనట్లు చిత్రంగా నటించారు. తక్కిన అందరిలాగే వాళ్లూ నాకేసి చూడటం మొదలుపెట్టారు. నేను నాగదిలోకి వెళ్ళగానే తలుపుబయట తాళంపెట్టారు- కోడినో, బాతునో గంపకిందికి నెట్టినట్లు, ఈ సంఘటన నన్నుమరీ పిచ్చివాణ్ణి చేస్తూంది.

కొద్దిరోజులక్రితం ఉల్ఫ్ క్లబ్ గ్రామంనించి పంటలు పోయినయ్యని చెప్పుకోవడానికి వచ్చిన మా రైతొకడు వాళ్ళఊళ్లో ఒక పేరుమోసిన రౌడీని జనం కొట్టిచంపేశారని మా అన్నయ్యతో అన్నాడు. అప్పుడుటా- జనంలో కొందరు వాడిగుండెకాయనీ, కాలేయాన్నితీసి నూనెలో వేయించుకు తిన్నారుట- తమలో సాహసం పెంపొందించుకోడంకోసం. నేను మధ్యలో అడ్డువస్తే ఆరైతూ, మా అన్నయ్యకూడా నాకేసి వింతగాచూశారు. వాళ్లిద్దరి కళ్ళల్లోనూ సరిగ్గా బయట ఆ జనం చూపిన చూపులాంటి చూపేఉందని నాకు అనిపిస్తూంది.

ఆమాట జ్ఞాపకంవస్తేనే నాకు మాడదగ్గర్నుంచి మడమదాకా వణుకు పుట్టుకొచ్చింది.

వాళ్ళు మనుషుల్ని తింటారు. అందుచేత నన్నూతినొచ్చు.

ఆ స్త్రీ అన్న "నిన్ను నమిలి మింగేయాలనిపిస్తూంది" అన్నమాట, ఆ ఆకుపచ్చని ముఖాల, పారపళ్ళ పకిలనవ్వు, ఆరోజున ఆ రైతుచెప్పిన కథ రహస్య సంకేతాలని స్పష్టంగా నాకర్థమవుతుంది. వాళ్ళ మాటల్లోని విషం, వాళ్ళ నవ్వులు దూస్తున్నకత్తులూ నేను గుర్తించాను. వాళ్ళపళ్లు తెల్లగా మెరుస్తున్నాయి; నరభక్షకులు వాళ్ళు.

నేను చెడ్డవాణ్ణి కాకపోయినప్పటికీ 'కూ' ఎకౌంట్ల మీద నడిచిన నాటి నుంచీ ఈ దాసుడుమూత సాగుతూనేవున్నట్టు నాకనిపిస్తుంది నేను ఊహించలేని రహస్యాలేవో వాళ్ళకుండవచ్చు. వాళ్ళకు కోపమొస్తే ఎవర్నయినా వాళ్ళు చెడ్డవాడు అనేస్తారు. నాకు వ్యాసరచన నేర్పుతున్నపుడు మా అన్నయ్య ఎంత మంచివాడయినాసరే

అతనికి వ్యతిరేకంగా నేను యుక్తులుచూపిస్తే ఆ భాగం పక్కన ఒక గీతగీసి తన మెప్పును సూచించడం, అలాగే తప్పు పని చేసినవాళ్ళని నేను క్షమిస్తున్నట్టు కనిపిస్తే ఆయన "మంచిదే! నువ్వు నీసొంతతెలివితేటలు చూపిస్తున్నావు". అనడం నాకు జ్ఞాపకంవుంది. వాళ్ళ రహస్యాలోచనల్ని నేను ఎలాతెలుసుకోవడం? ముఖ్యంగా మనుషుల్ని తింటానికి వాళ్ళు సిద్ధపడు తున్నప్పుడు!

ఏవిషయమైనా అర్థంకావాలంటే జాగ్రత్తగా ఆలోచించాలి. వెనకటిరోజుల్లో జనం తరుచు మనుషుల్ని తినేవాళ్ళని నాకుగుర్తుంది. అయితే అదిఅంత స్పష్టంగా మనస్సుకి రావడంలేదు. చరిత్ర పరిశోధనకి పూనుకున్నాను. కాని నా చరిత్రలో తేదీలులేవు. మొదటినించీ చివరిదాకా ప్రతిపుటలో 'నీతి, నిజాయితీ' అనేమాటలే గిరికివున్నాయి. ఎలాగూ నిద్రపట్టడంలేదుకనుక అర్ధరాత్రిదాకా ఏకదీక్షగా చదివాను. చివరికి పంక్తులమధ్య మాటలు కనిపించసాగినయి. పుస్తకంఅంతటా రెండేమాటలు– "మనుషుల్నితిను"

పుస్తకంలోని ఈ మాటలూ, అనాడు రైతుచెప్పినమాటలూ– అన్నీ చిత్రంగా ప్రశ్నార్థకాల్లాగ నవ్వుతూ నావేపు చూస్తున్నయి.

నేనూ మనిషినే; వాళ్ళునన్ను తినాలనుకుంటున్నారు.

4

పొద్దున కొంతసేపు నిశ్చలంగా కూచున్నాను. ముసలి చెన్ భోజనంతెచ్చాడు. ఒకప్లేట్లో కూరలూ, ఇంకోప్లేట్లో ఉడకబెట్టిన చేపలూ– చేపలకళ్ళు తెల్లగా, గట్టిగా వున్నాయి. మనుషుల్ని తినాలనుకునే ఆ జనంనోళ్ళలాగే దానినోరు తెరుచుకునివుంది. కొన్నిముద్దలు తిన్నతరువాత గొంతులోకి జారిపోతున్న ఆ ముద్దలు చేపమాంసమో, మనిషిమాంసమో నాకు తెలియలేదు. అంతా కక్కేసుకున్నాను.

"చూడు చెన్! నాకిక్కడ ఊపిరి సలపడంలేదని, తోటలో తిరిగిరావాలనుకుంటున్నాననీ మా అన్నయ్యతో చెప్పు" అన్నాను. ముసలి చెన్ ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. కాస్సేపట్లో తిరిగివచ్చి గేటుతెరిచాడు.

నేనుకదల్లేదు. వాళ్ళునాతో ఎలా వ్యవహరిస్తారో చూద్దామని గమనిస్తున్నాను. వాళ్ళు నన్ను వెళ్ళనివ్వరు నాకుతెలుసు. అంతవరకు ఖాయమే! ఓ ముసలాయన్ని వెంటబెట్టుకుని మెల్లగా బయటికివచ్చాడు మా అన్నయ్య. అతనికళ్ళల్లో హత్యను సూచించే మెరుపుకనిపిస్తూంది– అదినేనెక్కడ చూసిపోతానోఅని తలవంచుకుని, కళ్ళ జోడులోనించి చాటుగా నావేపు పక్కచూపులు చూస్తున్నాడు.

"ఇవాళ నీకుబాగా కులాసాగా ఉన్నట్టుందే ?" అన్నాడు మా అన్నయ్య.

"ఔను !" అన్నాను.

"నేనివాళ నిన్ను పరీక్షించడానికి 'హో'ని పిలిచాను అన్నాడు.

"మంచిదేగదా !" అన్నాను- నిజానికి ఆ ముసలాయన మారువేషంలో వచ్చిన తలారివాడుఅని నాకుతెలుసు. నా నాడిచూసేనెపంతో ఆయన నావొంట్లో ఎంతకొవ్వుందో పరీక్షిస్తున్నాడు- దానివల్ల నామాంసంలో ఆయనకికూడా వాటాదొరుకుతుంది- అయినా నేను భయపడలేదు- నేను మనుషుల్ని తినకపోయినా వాళ్ళకంటే నేను ఎక్కువ ధైర్యశాలిని ! ఆయన ఏంచేస్తాడో చూద్దామని నారెండు గుప్పిళ్లూ ముందుకుసాచాను. ముసలాయన కూచున్నాడు; కళ్ళుమూసుకున్నాడు- కాసేపుతడబడ్డాడు. కొంతసేపు అలా మౌనంగాకూచుని, ఆ తరువాత దెయ్యంతోకూడిన కళ్ళుతెరిచి నాతోఅన్నాడు- అనవసరపు ఆలోచనలు మనస్సులోకి రానియ్యకు ! కొన్నాళ్ళపాటు ప్రశాంతంగా విశ్రాంతితీసుకో ! నీకు నయమైపోతుంది".

అనవసరపు ఆలోచనలు మనస్సులోకి రానియ్యకూడదట ? కొన్నాళ్లపాటు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాలట, నేను బాగాబలిస్తే సహజంగానే వాళ్లు తినేందుకు మరింత మాంసం దొరుకుతుంది. కాని దానివల్ల నాకు వొరిగేదేమిటి ? అది నాకు 'నయం' ఎలా అవుతుంది ? ఒకపక్క నరమాంసం తినాలని ఉబలాటపడుతూ మరోపక్క కపటంతో మంచివాళ్లుగా నటించడానికి ప్రయత్నిస్తూ ఖచ్చితంగా కార్య రంగంలోకిదిగే ధైర్యంలేని వీళ్లనుచూస్తూ ఉంటే నాకు నిజంగా పగలబడినవ్వాలని పిస్తుంది. నవ్వకుండా ఉండలేకపోయాను- అంత తమాషాగా కనిపించింది. ఆ నానవ్వులో ధైర్యం, నిజాయితీ ఉన్నయ్యని నాకుతెలుసు, ముసలాయనా, మా అన్నయ్యా కూడా తెల్లబోయారు- నాధైర్యం, నానిజాయితీ చూసి !

అయితే- నేనంత ధైర్యస్తుణ్ణి గనకనే నాధైర్యంలో కొంతభాగం పొందడం కోసం నన్ను తినడానికి వాళ్లు మరింత తొందరపడుతున్నారు. ముసలాయన గుమ్మం దాటి ఇంకా దూరంగా వెళ్లకముందే మెల్లగా మాఅన్నయ్యతో అంటున్నాడు: "వెంటనే తినడం అవసరం !" మా అన్నయ్య తలూపాడు- అయితే- నువ్వుకూడా ఇందులో ఉన్నావన్నమాట ! ఈ అద్భుతమైన అవగాహన నాకు షాక్ తిన్నట్టనిపించినా, నేను ఊహించివుండని సంగతి కాదు; నన్నుతినే ప్రయత్నంలో మా అన్నయ్యకూడ 'తోడిదొంగే !'

నరమాంస భక్షకుడు మా అన్నయ్య !

ఒక నరమాంస భక్షకుడి తమ్ముణ్ణి నేను!

నన్ను ఇతరులు కూడా తింటారు— అయినాసరే, నేనొక నరమాంస భక్షకుడి తమ్ముణ్ణే!

5

కొద్దిరోజులుగా నేను మళ్ళీ ఆలోచించిచూశాను— బహుశః ఆ ముసలాయన మారువేషంలోవచ్చిన తలారివాడు కాకపోవచ్చు! నిజమైన వైద్యుడే కావచ్చు! అయినా ఆయన నరమాంసభక్షకుడే! ఆయనకి ముందువాడైన లీ షిన్-చెన్ [1] రాసిన మూలికల మీదిపుస్తకంలో స్పష్టంగా రాసిఉంది నరమాంసం ఉడకబెట్టుకుని తినొచ్చును— అని— మరి ఆయన తను నరమాంసభక్షకుణ్ణి కానని ఎలాతినగలడు?

మా అన్నయ్యవిషయంలో అతణ్ణి నేను అనుమానించడానికి తగినంత కారణం ఉంది. నాకు పాఠం చెబుతూ స్వయంగా తననోటితో తనేఅన్నాడు— "తినడంకోసం జనం తమకొడుకుల్ని మారకం చేసుకుంటారు" అని. ఒక దుర్మార్గుడి సంగతిచెబుతూ, వాణ్ణి చంపడమేకాదు, వాడిమాంసంతిని, వాడి చర్మంమీద శయనించినా పాపం లేదు" [2] అన్నాడు ఒకసారి— అప్పుడు నేనుమరీకుర్రాణ్ణి. నాగుండె దడదడకొట్టుకుంది— వుల్ఫ్‌క్లబ్ గ్రామంనించి వచ్చినరైతు ఆరోజున ఒకమనిషి గుండెకాయనీ కాలేయాన్నీ జనం తిన్నవృత్తాంతం చెప్పినప్పుడు అది అతణ్ణేమాత్రం ఆశ్చర్యపరచలేదు— అతడిలో వెనకటి క్రూరత్వం ఇప్పటికీ స్పష్టంగా నిలిచిఉన్నదన్నమాట! 'తినడానికి కొడుకుల్ని మారకంచేసుకోడం' సాధ్యమైనప్పుడు, ఇంకేదైనా మారకం చేసుకోవచ్చు; ఎవరినైనాతినచ్చు! వెనక— అతడుచేసే వ్యాఖ్యానాలు ఊరికేవినేసి ఊరుకునేవాణ్ణి! ఇప్పుడు నాకుతెలుసు— అతడేదైనా చెబుతున్నప్పుడు అతని పెదవుల కొసల్లో నరమాంసపుకొవ్వు ఉండడమేకాదు, అతని మనస్సు పూర్తిగా నరమాంస భక్షణమీద లగ్నమైఉందని.

6

చిమ్మచీకటి పగలోరాత్రో తెలియడంలేదు— 'ఛావో' కుటుంబం వారికుక్క మళ్లీ మొరగడం మొదలు పెట్టింది.

---

1 ఒక సుప్రసిద్ధ ఔషధశాస్త్రవేత్త (1518.1593). వస్తుగుణదీపిక లాంటి చెన్-కావో-గాంగ్-యు అనే గ్రంధరచయిత

2 ప్రాచీన ఉద్గ్రంథం "జువోజ్యూదాన్" నించి ఉద్ధృతం.

సింహంఅంత క్రౌర్యం, కుందేలంత పిరికితనం, నక్కఅంత జిత్తులమారి తనం............

7

వాళ్లపద్ధతి నాకుతెలుసు. ఎవళ్లనైనా వెంటనే చంపెయ్యడం వాళ్లకిగిట్టదు; అంత ధైర్యమూలేదు. పర్యవసానాన్ని గురించి తగని భయం! ప్రత్యామ్నాయంగా వాళ్లంతా ఏకమై ఎక్కడపడితే అక్కడ బోన్లుపెట్టి నేను ఆత్మహత్య చేసుకునేట్లు చెయ్యాలని వాళ్లపన్నాగం. కొద్దిరోజుల క్రితం వీధిలోని స్త్రీపురుషుల చిత్రమైన ప్రవర్తనా, కొద్దినాళ్లుగా మా అన్నయ్య వైఖరీ ఆ విషయం స్పష్టంచేస్తున్నాయి. మనిషి తన బెల్టుతీసి దానితో తనంతటతానే దూలానికి ఉరిపోసుకొని చచ్చిపోవడం వాళ్లకి చాలా ఇష్టం. అప్పుడు తాము హత్యానేరానికి గురికాకుండా వాళ్లు ఉవ్విళ్లూరుతూన్న సంతోషం పొందచ్చు. సహజంగానే అప్పుడు వాళ్లు విరగబడినవ్వుతారు. అలాకాకుండా మనిషి భయపడి బెంగపెట్టుకొని చచ్చిపోతాడనుకోండి- అప్పుడు శరీరం కొంతచిక్కినా, అదీ వాళ్ళకి సంతోషమే!

శవాల మాంసమే తింటారు వాళ్లు! కళ్లల్లో వికారమైనచూపుతో, చచ్చిపోయిన జంతువుల మాంసమేతినే ఒక ఏబ్రాసిజంతువు సివంగి (hyena) ని గురించి ఎక్కడో చదివినట్టు గుర్తు! పెద్ద పెద్ద ఎముకల్ని కూడా కరకరనమిలి అది తింటుంది; ఆ సంగతి గుర్తొస్తేనే ఎవరికైనా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. సివంగులు తోడేళ్ళ తెగకి చెందినవి; తోడేళ్ళు కుక్కలజాతి. అవాళ 'చావో' ఇంట్లో కుక్క నాకేసి చాలాసార్లు మిర్రి మిర్రి చూసింది. దానికి కూడా ఈ పన్నాగంలో భాగంఉంది. అదికూడా వాళ్లకి తోడుదొంగ అనడంలో సందేహంలేదు. ముసలాయన నేలచూపులుచూస్తున్నాడు కాని అంతమాత్రాన ఆయన నన్ను మోసం చెయ్యలేడు.

చాలా శోచనీయ పరిస్థితి మా అన్నయ్యది. తనూ మనిషేగదా! తనకి ఎందుకు భయంలేదు? ఇతర్లతోకలిసి నన్ను తినడానికి ఎందుకు కుట్రపన్నుతున్నాడు? అలవాటైపోతే ఇక అది తప్పుగా వాళ్ళకి అనిపించదా? లేకపోతే తనకి తప్పనితెలిసినా గుండె రాయిచేసుకున్నాడా?

నరభక్షకుల్ని తిట్టడానికి ముందుగా మా అన్నయ్యతోనే ఆరంభిస్తాను. నరభక్షకుల్ని వారించడానికి ముందుగా మా అన్నయ్యతోనే మొదలుపెడతాను.

8

నిజానికి, అలాంటివాదాలు ఎన్నోరోజులక్రితమే వాళ్ళమనస్సుల్ని మార్చి ఉండాల్సింది........

హఠాత్తుగా ఎవరో లోపలికి వచ్చారు- అతడికి 20 ఏళ్ళకంటె ఉండవు- ముఖ కవళికలు నేను స్పష్టంగా చూళ్లేదు- అతని ముఖంనిండా చిరునవ్వులదండలు- కాని అతడు సన్నురమ్మని తలూపినప్పుడుమాత్రం అతని మందహాసం సహజమైందిగా కన్పించలేదు. "మనుషుల్ని తినడం న్యాయమేనా ?"అని అతణ్ని అడిగాను.

అలానవ్వుతూనే "కరువులేనప్పుడు జనం మనుషుల్ని ఎలాతినగలరు ?" అన్నాడతను.

వెంటనేనాకు అర్థమైంది- ఇతనూ వాళ్ళలోవాడే! అయినా ధైర్యంతెచ్చుకుని నాప్రశ్న రెట్టించాను.

"అది న్యాయమేనా ?"

"అలాంటిప్రశ్న నువ్వెందుకు అడుగుతున్నావు ? నిజంగానువ్వు పరిహాస ప్రియుడివి... ఇవాళ వాతావరణం చాలాబాగుంది".

"ఔను బాగుంది- చంద్రుడు చాలాకాంతిగా ప్రకాశిస్తున్నాడు- అదిసరే- నేను విన్నడిగేప్రశ్న- 'అదిన్యాయమేనా ?'అని"

దానితో తెల్లముఖంవేశాడు- ఇలాగొణిగాడు "కాదు...."

"కాదూ ? మరి వాళ్ళింకా ఎందుకు ఆపని చేస్తున్నారు ?"

"ఏమిటి నువ్వనేది ?"

"నేననేది ఏమిటా ? జనం ఇప్పుడు వుల్ఫ్‌క్లబ్ గ్రామంలో మనుషుల్ని తింటున్నారు- ఆసంగతి తాజా ఎర్రసిరాతో అచ్చువేసి పుస్తకాలన్నిటిలో నీకు కని పిస్తుంది- నువుచూడొచ్చు !

అతని వాలకంమారింది- ముఖంబాగా వెలవెలబోయింది- నాకేసి నిఘాగా చూస్తూ "అయుండొచ్చు- మొదట్నించీ అలాగే జరుగుతూవస్తూంది...."అన్నాడు.

"మొదట్నించీ అలా జరుగుతూవస్తూంది కనక అది న్యాయంఅవుతుందా ?

"ఈ సంగతులు నేను నీతో చర్చించను. ఏమైనా నువ్వలాటి విషయాలు

నేనొక్క గంతుపెట్టాను; అతణ్ణి తేరిపార చూశాను. కాని అతడు అంతర్ధానమై పోయాడు. నా ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. మా అన్నయ్యకాడు అతను చాలా చిన్నవాడు; అయినా అతనుకూడా అందులో చేరాడు. అతని తలిదండ్రులతనికి బోధించిఉండాలి. అప్పుడే అతను కూడా తన కొడుక్కి ఈదుర్బోధ చేసిఉంటాడని నా అనుమానం. అందుకే పిల్లలు కూడా నాకేసి అంత క్రూరంగా చూస్తున్నారు.

9

ఒక పక్క మనుషుల్ని తినాలనే కోరికా- మళ్లీ అంతలో తమనికూడా తినేస్తారేమోనని భయం- అందరూ ఒకళ్ళనొకళ్ళు ఒల్లమాలిన అపోహలతో అనుమానాలతో చూసుకొంటున్నారు........

ఇలాంటి సంకోచాలన్నిటికీ స్వస్తి చెప్పి పనిపాట్లలో, ఆహారవిహారాల్లో, నిద్రలో నిర్భయంగా బ్రతగ్గలిగితే వాళ్ళకి జీవితం ఎంత హాయిగాఉంటుంది? ఈ ఒక్క అడుగువేస్తేచాలు! అయినా, తండ్రీబిడ్డలూ, భార్యాభర్తలు, అన్నదమ్ములూ, స్నేహితులూ, ఉపాధ్యాయులూ, విద్యార్థులూ, బద్ధవిరోధులూ, చివరికి ముక్కూముఖం తెలియనివారు కూడా- అందరూ ఈ కుట్రలోచేరి ఈ ఒక్క అడుగూముందుకి వెయ్యడానికి వీల్లేకుండా ఒకళ్లకొకళ్లు అడ్డుపడుతున్నారు.

10

ఇవాళ పొద్దున మా అన్నయ్య దగ్గరికి వెళ్లాను- హాలుబయట ద్వారంముందుగా ఆకాశం వేపుచూస్తూ ఆయన నుంచుని ఉన్నాడు. వెనగ్గావెళ్లి ఆయనకీ ద్వారానికీ మధ్యగా నిలబడి, ఎంతో సౌమ్యంగా, మర్యాదగా అన్నాను.

"అన్నయ్యా! నేనునీతో కొంచెంమాట్లాడాలి"

"ఊ.... కానీ! ఏమిటివిశేషం?" అన్నాడతను చివాలున వెనక్కితిరిగి.

"చాలా చిన్నవిషయమే! కాని ఎలాచెప్పాలో నాకు బోధపడ్డంలేదు. అన్నయ్యా! బహుశః ఆరంభంలో ఆదిమ జాతులవారందరూ ఏకొంచెమో నరమాంసం తినేవుంటారు- కాని అటుతరువాత వాళ్ళదృక్పథం మారింది- మంచిగా ఉండాలని ప్రయత్నించారు- మనుషులుగా మారారు- నిజమైన మనుషులయ్యారు- కొందరు ఆ ఆచారం మానేశారు- కాని మరికొందరు ఇంకా నరమాంసం తింటూనే ఉన్నారు- కొండచిలువల్లాగా! కొందరు చేపలుగా, పక్షులుగా, కోతులుగామారి చివరన మనుషులుగా మారారు- కాని మరికొందరు మంచిగాఉండాలనిచూడక, ఇప్ప

టికీ కొండచిలువల్లాగానే ఉండిపోయారు- మనుషుల్ని తినేవాళ్లు తిననివాళ్ళతో తమని తాము పోల్చుకుంటే వాళ్ళు ఎంతో సిగ్గుపడాలి! బహుశః- కోతుల్నిచూసి కొండ చిలువలకంటె ఇంకా ఎక్కువగా సిగ్గుపడాలి!

ప్రాచీనకాలంలో 'యీయా' తనకొడుకునివండి 'చీ,చౌ'లకు భోజనంపెట్టింది.[3] అది పాతకథ. కాని వాస్తవంగా భూమినీ, స్వర్గాన్ని పాన్‌కూ్య సృష్టించేసింది మొదలు మనుషులు ఒకళ్లనొకళ్లు తింటూనే వచ్చారు- 'యీయా' కొడుకు కాలం నించీ హ్సూహ్సీలిన్ కాలందాకా; హ్సూహ్సీలిన్ కాలంనించీ ఉల్ఫ్‌క్లబ్ గ్రామంలో ఆ రౌడీ దాకా! కిందటేడు మన పట్నంలో ఒక ఖైదీని ఉరితీశారు. క్షయవ్యాధి పీడితుడొకడు అతని రక్తంలో రొట్టె ముంచుకుతిన్నాడు.

"వాళ్ళు నన్ను తినాలనుకుంటున్నారు. నిజానికి నువ్వు ఒక్కడివీ నన్ను ఏమీచేయలేవు. అయితే- నువ్వు కూడా వాళ్లతో ఎందుకు చేతులుకలిపావు? నరభక్షకులుగా వాళ్ళు ఏదైనా చేయడానికి తగుదురు! వాళ్ళు నన్నుతింటే తర్వాత నిన్నూ తినొచ్చు. ఒకే జట్టులోవాళ్ళు ఇప్పటికీ ఒకళ్ళనొకళ్ళు తినడం జరుగుతూనేవుంది. నువ్వు వెంటనే నీ పద్ధతులు మార్చుకుంటే అందరికీ శాంతి లభిస్తుంది. అనాదికాలం నించీ ఇలా జరుగుతూనే వచ్చినా ఇప్పుడు మనం మంచిగా ఉండడానికి ప్రత్యేకంగా ప్రయత్నించవచ్చు, ఇదిఇలా కొనసాగడానికి వీలులేదని నిర్ణయించుకోవచ్చు. నువ్వు తప్పకుండా ఆ నిర్ణయానికి వొస్తావు- నాకు తెలుసు, అన్నయ్యా! ఆ రోజున రైతు శిస్తుతగ్గించమంటే నువ్వు వీల్లేదన్నావు."

మొదట అతను నిస్పృహగా ఒక మందహాసం చేశాడు. వెంటనే అతనికళ్ళల్లో హత్యాసూచకమైన మెరుపుమెరిసింది. వాళ్ళరహస్యాల్ని గురించి నేను చెబుతున్నప్పుడు అతని ముఖం వెలవెలబోయింది. గేటుబయట జనం గుమిగూడారు. చావో, కూడా అతని కుక్కతోసహా- అందులో ఉన్నాడు. అంతా మెడలు నిక్కించి చూస్తున్నారు. వాళ్ళందరి ముఖాలూ నాకుకనిపించలేదు. వాళ్ళు ముసుగులుధరించారు. కొందరు ఇంకా తమ నవ్వు అణచుకుంటూ భయంకరంగా కనిపిస్తున్నారు. వాళ్లంతా ఒక జట్టు నాకు తెలుసు, అంతా నరమాంసభక్షకులు! అయితే నాకు ఇంకో సంగతి కూడా

---

3 ప్రాచీనమైన రికార్డుల ప్రకారం 'యీయా' తన కొడుకుని వండిపెట్టింది. క్రీ. పూ. 685 నుంచి 643 వరకూ పాలించిన 'చి (chi)' రాజకుమారుడు హువాన్‌కి చీ (chi), చౌ (chou) లు అంతకు ముందు ఏలిన నిరంకుశ ప్రభువులు, ఈ విషయంలో [illegible] పొరబడాడు.

తెలుసు; వాళ్ళందరూ ఒకే ఆలోచనలో లేరు. కొందరి దృష్టిలో అనాదినుంచీ ఈ ఆచారం వస్తూంది. కనుక మనుషుల్ని తినచ్చు. కొందరికీ మనుషుల్నితినడం తప్పని తెలుసు! అయినా వాళ్ళు ఆ కోరికచంపుకోలేరు. అలాంటివాళ్ల తమ రహస్యం ఎక్కడబైటపడుతుందో అని భయపడుతూ ఉంటారు. అందుచేత నా మాటను వినగానే వాళ్ళకు కోపంవచ్చింది. అయినా ఇంకా వాళ్ళు నిస్పృహగా పెదిమెలు బిగబట్టి నవ్వుతూనే ఉన్నారు.

ఉన్నట్టుండి మా అన్నయ్యకి కోపంవచ్చి గట్టిగా అరిచాడు- "పోండి! అంతా వెళ్ళిపోండి! పిచ్చివాణ్ని చూడడం ఇదేమైనా వినోదమా?"

అప్పుడునాకు వాళ్ళమోసం కొంత అర్థమైంది- వాళ్ళుచచ్చినా మనస్సు మార్చుకోరు- ప్లానన్నీ సిద్ధమైఉన్నాయి- వాళ్ళునాకు పిచ్చివాడని ఒక కితాబు తగిలించారు- దీనివల్ల ముందుముందు నన్నుతినడం జరిగితే వాళ్ళు ఎలాంటి చిక్కుల్లోనూపడరు- పైగా జనంవాళ్ళకి కృతజ్ఞులుగాకూడా ఉంటారు- మా రైతు తనగ్రామస్థులు ఒక రౌడీని తిన్నారని చెప్పిన సందర్భంకూడా సరిగ్గా ఇలాంటిపన్నాగమే! ఇదివాళ్ళకి అలవాటయిన ఉపాయం.

ముసలి చెన్‌కూడా లోపలికివచ్చాడు- చాలాకోపంగా కాని వాళ్ళు నానోరు మూయించలేకపోయారు- నేను ఆజనానికి స్పష్టంగా చెప్పవలసివచ్చింది.

"మీరుమారాలి! హృదయపూర్వకంగా మారిపోవాలి- భవిష్యత్తులో నరభక్షకులకి లోకంలో స్థానంఉండదని మీరుగుర్తించాలి!"

"మీరు మారకపోతే అందరూ ఒకళ్ళనొకళ్ళు తినేస్తారు- ఎంతోమంది కొత్తగాపుడుతున్నా కేవలం మనుషులే వాళ్ళందరినీ తుడిచిపెట్టేస్తారు- వేటగాళ్ళు తోడేళ్ళని హతమార్చినట్టు! అచ్చంగా కొండచిలువల్లాగా!"

ముసలిచెన్ అందర్నీ తరిమేశాడు- మాఅన్నయ్య మాయమయాడు- ముసలిచెన్ నన్ను నాగదికి తిరిగివెళ్ళమని బతిమాలాడు. గదంతా చిమ్మచీకటి- నాతలమీద దూలాలూ, వాసాలు కదులుతున్నాయి- కొంతసేపు ఊగి, ఊగి అతిపెద్దవి అయినయి నామీద పేరుకుపోతున్నాయి.

ఆబరువుకి నేను కదలలేకపోయాను- నేను చచ్చిపోవాలని వాళ్ళఉద్దేశం. అయితే ఆబరువు అబద్ధాలబరువని నాకుతెలుసు- అందుచేత పెనుగులాడి ఎలాగో బయటపడ్డాను- ఒళ్ళంతా చెమటముద్ద అయింది- నేను వాళ్ళకి చెప్పకతప్పలేదు.

"మీరు వెంటనేమారాలి! హృదయపూర్వకంగా మారిపోవాలి- భవిష్యత్తులో నరమాంస భక్షకులకీ లోకంలో స్థానంఉండబోదని మీరు గుర్తించాలి—"

11

సూర్యుడు ప్రకాశించడంలేదు- తలుపుతెరవలేదు- రోజూ రెండుభోజనాలు.

భోజనానికి ఉపక్రమించాను- మా అన్నయ్యని గురించిన ఆలోచన వచ్చింది- మా చిన్నారిచెల్లాయి ఎలా చచ్చిపోయిందీ నాకుతెలుసు- దానికంతటికీ అతడేకారణం- అప్పుడు మాచెల్లాయి అయిదేళ్ళది- ఎంత ఆప్యాయంగా, జాలిగాఉండేదో ఇప్పటికీ నాకుగుర్తుంది- అమ్మ ఒకటేఏడుపు- కానిఅతను అమ్మను ఏడవ్వద్దని బతిమాలాడు- అంటే ఆమెఏడుపు అతణ్ణి సిగ్గుపడేట్టు చేసిందన్నమాట! వాడికి సిగ్గూ, శరంలనేవి ఉంటే— ?

మా చెల్లాయిని మా అన్నయ్య తినేశాడు- అయితే అమ్మకీసంగతి తెలుసో లేదో నాకు తెలియదు.

అమ్మకి బహుశః తెలిసుండాలి- కాని తనుఏడుస్తూ ఈమాట సూటిగా చెప్ప లేదు- అలా చెప్పకపోవడమే మంచిదని బహుశః ఆమెఅనుకుని ఉంటుంది- నాకు బాగాగుర్తు- అప్పుడునాకు నాలుగోఏడో, అయిదోఏడో హల్లోహాయిగా కూచున్నాను. అన్నయ్యనాతో అన్నాడు. తల్లిదండ్రులికి జబ్బుచేస్తే పిల్లలు తమ ఒంట్లో నుంచి చిన్నమాంసంముక్క కోసివేయించి వాళ్ళచేతతినిపిస్తే వాళ్ళని మంచిపిల్లలు అంటారుట! అమ్మ వాడిమాట కాదనలేదు. చిన్నముక్క తిండానికి అభ్యంతరం లేకపోతే శరీరం అంతా కూడాతినొచ్చు. అయినా అప్పటి ఆ దుఃఖం తలుచుకుంటే ఇప్పటికీ నా గుండె. తరుక్కుపోతుంది. అదే దాంట్లో చిత్రం!

12

ఈ ఆలోచన నేను భరించలేకపోతున్నాను.

ఇన్నాళ్లూ నేను నాలుగువేల ఏళ్ళుగా నరమాంసంతింటూ వస్తున్నవాళ్ళ మధ్య బతుకుతున్నానని ఇటీవలే నాకు అర్థమయ్యింది. మా చెల్లాయి పోయిన తర్వాత మా అన్నయ్య ఇంటిపెత్తనం చేబట్టాడు. అన్నయ్య ఆధరువుల్లో ఆ పిల్లమాంసం కలిపి అతడు వాడిఉండాలి; మాకు తెలియకుండా మాచేతకూడా తినిపించిఉండాలి!

తెలియకుండా మాచెల్లాయి మాంసం ముక్కలు చాలా నేను కూడా తినిఉండడం సంభవం!.... ఇప్పుడు నావంతు వచ్చింది....

నాలాంటివాడు- నాలుగువేల ఏళ్ళ నరమాంస భక్షణ చరిత్ర నడిచిన తర్వాత- ఇంతకు ముందు ఆ సంగతి రవ్వంతైనా నాకు తెలియకపోయినా- నిజమైన మనుషులకి ముఖం చూపించడం ఎలా?

13

బహుశ: నరమాంసం తినివుండని పిల్లలు ఇంకా కొందరు ఉండిపోయారు! ఆ పిల్లల్ని దేవుడుకాపాడుగాక....

అనువాదం: బొమ్మకంటి శ్రీనివాసాచార్య

ఉత్తమ ప్రజాస్వామ్యవాది

మదాం సన్‌యట్‌సేన్-సూంగ్ చింగ్ లింగ్

చైనా జాతీయ బూర్జువా విప్లవ (1911) నాయకుడైన డా॥ సన్‌యట్-సెన్ సతిగానేగాక, అసాధారణవ్యక్తిగా కార్యకర్తగా జీవించిన సూంగ్‌చింగ్-లింగ్ మే 28న చనిపోయింది. అఖిలచైనా మహిళాసమాఖ్య అధ్యక్షస్థానానికి 1953లో ఎన్నికైనా మొదటి నుంచీ మహిళలకు ఎనలేని సేవచేసింది. శిశువుల విద్యకూ ఆరోగ్యానికీగల ప్రాముఖ్యాన్ని గురించి ఎంతో శ్రద్ధచూపింది. ఈ సంవత్సరం మే 1:న చైనీస్ కమ్యూనిస్టు పార్టీ ఆవిడకు పార్టీలో పూర్తి సభ్యత్వం ఇవ్వడమేగాక, మే 16న జాతీయ ప్రజా కాంగ్రెస్ స్థాయీ సంఘసమావేశం ఆవిడను జనచైనా రిపబ్లిక్‌కు గౌరవాధ్యక్ష హోదా నిచ్చి తనను గౌరవించుకుంది. అప్పటికేతాను ఆ సంఘానికి వుపాధ్యక్షురాలు. చనిపోయేనాటికి ఆవిడప్రాయం 90 సంవత్సరాలు.

ఈ సుదీర్ఘమైన జీవితంఅంతా చైనాప్రజల ప్రయోజనానికే వినియోగించిన గొప్పమహిళ సూంగ్‌చింగ్-లింగ్ చెల్లెలు చియాంగ్‌షేక్ భార్యఅయినా, తమ్ముడు చియాంగ్ ఆర్థిక మంత్రిఅయినా, వారంతా డా॥ సన్ ఆదర్శాన్ని మంటగలిపినవారే గనక దాన్ని సఫలంచేసేందుకు ప్రజలపైపుననిలిచి ఎడతెరిపిలేని పోరాటం చేసింది. సంపన్నకుటుంబంలోపుట్టి ఉన్నతవిద్యను విదేశాల్లోనూ అభ్యసించి స్వదేశానికి తిరిగి వచ్చాక 1913లో డా॥ సన్ కార్యదర్శిగా తన విప్లవజీవితం ప్రారంభించింది. డా॥ సన్‌ను 1915లో పెళ్లాడి, చైనీస్ రిపబ్లిక్‌ను సైనికనియంతల జలగల మడుగుల నుంచి బైటపడేసేందుకు ఆయనచేసిన అన్నిప్రయత్నాలలోనూ పాల్గొంది 1922లో ఒకసైనిక నియంత రిపబ్లిక్‌ను మార్చేపథకంలో డా॥ సన్‌ను వధించబూనుకున్న సందర్భంలో, ఆవిడహెచ్చరికలు ఆయనప్రాణాన్ని దక్కించాయి. కోమింటాంగ్ పునర్నిర్మాణకృషిలో జాతీయవాదం, ప్రజలజీవనాధారం, సోవియట్ రష్యాతోమైత్రి అంశాలతో డా॥ సన్ ఒకవిధానాన్ని రూపొందించేప్పుడు, సూంగ్‌చింగ్‌లింగ్ ఈ 'మూడు కొత్త ప్రజాసూత్రాలు' మార్గదర్శకాలని ఎంచింది. డా॥ సన్ 1924లో మరణించాకకూడా వాటి వెలుగులోనే నడుస్తూ వచ్చినందుచేత, కోమింటాంగ్‌లోని అభివృద్ధినిరోధక మితవాదశక్తుల దురాగ్రహానికిగురైనా ఖాతరుచేయ్యలేదు. చియాంగ్ కై-షెక్ విప్లవ ప్రతీఘాతుకచర్యలు మొదలెట్టినప్పుడు బాహాటంగా అతన్ని ఖండించింది. 1927లో అతడు తన భీకరమైన హింసావిధానాన్ని అమలుపెట్టేక, విప్లవానికి ద్రోహంచేసిన మితవాద నాయకులనుంచి విడిపోయివచ్చి, చైనీస్ కమ్యూనిస్టుపార్టీ నడిపిన నాన్‌చాంగ్ సాయుధ తిరుగుబాటుని బలపరిచిన ఫలితంగా, విప్లవకమిటీ అధ్యక్షవర్గంలో సభ్యురాలైంది. చైనీస్ విప్లవవిజయానికి సోవియట్‌యూనియన్

సహాయం కోరడంకోసం, విదేశాలమద్దతుకోసం రెండేళ్ల దేశాంతరాలలో వుండిన కాలాన బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లోనూ జర్మన్‌లోనూ జరిపిన సామ్రాజ్యవాద వ్యతిరేక సమితి సమావేశాలలో గౌరవాధ్యక్షస్థానం పొందింది.

చైనాకు తిరిగివచ్చాక (1931) మారిన అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా కమ్యూనిస్టుపార్టీ యిచ్చిన పిలుపుమేరకు, జపాన్‌వ్యతిరేక ఐక్యసంఘటన నిర్మాణం కోసం అంతర్యుద్ధం ఆపాలంటూ, జపాన్‌తో షరీకైన చియాంగ్‌ను దుయ్యబట్ట సాగింది. 1932లో లూషున్ వంటి వారితో కలిసి చియాంగ్ ఫాసిస్టు వధాకాండకు వ్యతిరేకంగా మానవహక్కుల సమాఖ్యను స్థాపించి, దేశాభిమానులనూ కమ్యూనిస్టులనూ ఎందరినో కాపాడగలిగింది. విప్లవకారుల అక్రమ నిర్బంధాలను ఎదిరించవలసిందిగా ప్రజలకు వుద్బోధించింది. దేశవిముక్తికీ, ఐక్యతకీ, ప్రాదేశిక సమగ్రతా రక్షణకీ కష్టజీవులంతా ఒకటి కావాలని ప్రచారం సాగించింది. సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రపంచ సంఘం తాలూకు దూరప్రాచ్యశాఖను సమావేశపరిచి, జాతీయ విప్లవానికీ సామ్రాజ్యవాద వ్యతిరేకతకీ గల సంబంధాన్ని వివరించింది. జపాన్‌ను ప్రతిఘటించేందుకు ఆరు అంశాలతోకూడిన కార్యక్రమాన్ని కమ్యూనిస్టుపార్టీ రూపొందించినప్పుడు, ఇతర ప్రజాస్వామికవాదులతో కలిసి తాను సంతకం చేసింది. ప్రజాస్వామికవాదులు కొందరు షాంఘైనగరంలో 'జాతీయవిముక్తి సమాఖ్య'ను స్థాపించి అంతర్యుద్ధాన్ని ఆపుజేసి, రాజకీయ ఖైదీలను విడిచిపెట్టి, రెడార్మీతో ఒప్పందం కుదుర్చుకుని జపాన్‌ను గట్టిగా ప్రతిఘటించవలసిందని కోమింటాంగ్ ప్రభుత్వాన్ని కోరినప్పుడు, (1937), ఆవిడ కార్యవర్గంలో సభ్యత్వం పొందింది. ఈ ప్రజాస్వామికవాదులనే చియాంగ్ ప్రభుత్వం అరెస్టుచేసి విచారణ తతంగం సాగించినప్పుడు, "దేశాభిమానమనే నేరం" తానూ చేశాననీ తననూ అరెస్టుచెయ్యమని కోరింది. విదేశాలలోని ప్రజలకు జపాన్ దురాక్రమణ చర్యలను వివరించేందుకు చైనా రక్షణ సమాఖ్య స్థాపించి, ఇతరదేశాలనుంచి వైద్యసహాయాన్ని, వైద్యబృందాలను సమకూర్చింది. బెతూన్, కొట్నీస్, యిలా వచ్చినవారే.

జపాన్ వ్యతిరేక జాతీయయుద్ధం 1945లో విజయంపొందాక, 'చైనా సంక్షేమ నిధి'ని స్థాపించి, ప్రజాస్వామిక శక్తులకూ అభ్యుదయకర సంస్థలకూ ఆర్థికసహాయం అందిస్తూ, కమ్యూనిస్టుపార్టీనీ, ప్రజావిమోచన సైన్యాన్నీ ఆదుకుంది. దేశానికి మిశ్రమ ప్రభుత్వం కావాలంటూ, కోమింటాంగ్‌కు అమెరికా చేస్తూవచ్చిన సైనికసహాయాన్ని నిలుపుచెయ్యమని కోరింది.

1949 సెప్టెంబరులో చైనీస్ కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ ఆహ్వానం మేరకు, పెకింగ్‌కువెళ్లి ప్రజల రాజకీయచర్చా సదస్సులో పాల్గొని, కేంద్ర ప్రజా ప్రభుత్వ

ఉపాధ్యక్షపదవికి ఎన్నికైంది. మావో, చౌ వగైరా ప్రజానాయకులతో సహకరిస్తూ, కమ్యూనిస్టుపార్టీ జాతీయ కమిటీ ఉపాధ్యక్షపదవినీ, జాతీయ ప్రజానదస్సు వుపాధ్యక్ష పదవినీ పొందింది. 1951 లో స్టాలిన్ శాంతి బహుమతి స్వీకరించినా, ఆ ధనాన్ని చైనీస్ మహిళల, శిశువుల, సంక్షేమ సంస్థలకు యిచ్చివేసింది. ఆసియన్, పసిఫిక్ మండలాల శాంతి సమావేశంలో చైనీస్ ప్రతినిధివర్గానికి నాయకత్వం వహించి, 'లయజన్ కమిటీ' అధ్యక్షస్థానాన్ని పొందింది. (1957).

ప్రజాచైనా నిర్మాణంలోనేగాక అభివృద్ధిలో సూంగ్ చింగ్ లింగ్ చేసిన దోహదానికి మూలం, డా. సన్‌యట్ సేన్ ప్రతిపాదించిన 'మూడు కొత్త ప్రజా సూత్రాల' విధేయతేగాక, వాటిని సఫలంచేసి విప్లవాన్ని విజయవంతమొనర్చిన కమ్యూనిస్టు పార్టీకి అనుకూలత కూడా.

ఇలాంటి మహామహిళలు చాలా అరుదు. మహిళాలోకానికేగాక, అందరికీ, విప్లవకారులకేగాక జాతీయాభిమానులకూ ప్రజాస్వామికవాదులకూ మేలుబంతి అనదగిన కా. సూంగ్ చింగ్ లింగ్‌కు నివాళి.

సమీక్ష :

అకాల ఆదిమ భావపిశాచి - ఫాసిజం

[ఫాసిజం : యం. యన్. రాయ్ అనువాదం : రావిపూడి వెంకటాద్రి, ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్, తెనాలి, హైదరాబాదు. సోల్ డిస్ట్రిబ్యూటర్స్ సరళా పబ్లికేషన్సు, తెనాలి. వెల : రు. 7 పుటలు 6 + XV + 142]

సామ్రాజ్యవాద స్పర్శలేని రాజ్యమేదీలేదని ఫ్రెంచి రచయిత మేగ్జిమ్ రోడిన్సన్ అన్నాడు. సామ్రాజ్యవాదం విషయంలో లెనినిష్టు సూత్రీకరణను కాదంటున్న యీ మాటను అనాలోచితమని కొట్టివెయ్యాలంటే 'నవీన వామపక్ష భావుకులు' (న్యూలెఫ్ట్) ససేమిరా అంటారు. పెట్టుబడిదారీ రాజ్యాలన్నిటిలోనూ సామ్రాజ్యవాదఅంశం దాగుండిగానీ, బయల్పడిగానీ ఉండకతప్పదనేది రోడిన్సన్ వాదం సారాంశం.

మార్క్స్, ఎంగెల్స్‌ల జీవిత చరమదశలోగానీ యూరపియన్ పెట్టుబడిదారీ వ్యవస్థ ముదరబారలేదు. భూస్వామ్యవ్యవస్థనీ అర్థబానిస విధానన్నీ కూల్చివేసే చారిత్రిక దశలో అది అభ్యుదయకరంగా వుండినమాట నిజమే. బూర్జువా ప్రజాస్వామికం అప్పట్లో తరతమభేదాలతో యూరోపియన్ దేశాలలో వివిధసమయాలలో ఏర్పడింది. స్వదేశీ మార్కెట్ అవసరాలనుమించి వ్యాపారవస్తువులను అపారంగా వుత్పత్తి చెయ్యగలిగిన పారిశ్రామిక విప్లవం, దానివెన్నంటివచ్చిన వ్యావసాయిక విప్లవం, బూర్జువావర్గ స్వభావాన్ని క్రమంగా మార్చివేయసాగింది. తూర్పుదేశాలతో వర్తక, వాణిజ్యాలుచేస్తూ, 'అన్నపూర్ణ'లవంటి ఆ దేశాల సుగంధద్రవ్యాలను పడవల కెక్కించి సముద్రయానంచేసి మారుబేరానికి లాభసాటిగా అమ్ముకుని సిరిసంపదలు పెంచుకున్న యూరోపియన్ పెట్టుబడిదారులు, కొంతకాలానికి ఆ దేశాలను వలసలుగా మార్చి తమగుప్పిట్లో నొక్కిపెట్టుకునే దురుద్దేశంలో వ్యాపార ప్రయోజనాలను మించిన రాజకీయ లక్ష్యాలను ముందుకుతెచ్చారు. ఆ చారిత్రిక దశ తర్వాత, పారిశ్రామిక, వ్యావసాయిక విప్లవాలఫలితంగా, అదనపు సరుకులను బలవంతాన తూర్పు దేశాలకు వరదబారించి, ఆక్రమంలో వాటి రాజకీయ, ఆర్థిక, స్వాతంత్ర్య, సార్వభౌమాధికారాలను హరించి, తమస్వార్థానికి అనుగుణంగా దేశవ్యాప్తమైన మార్కెట్‌ను సృష్టించుకున్నారు. ఆ దేశాల సహజసంపదను మాతృదేశాలకు ప్రవాహంలా తరలించి (డ్రెయిన్) తమపరిశ్రమలకు మూలధనంగానేగాక ముడి సరుకుగామార్చి, వాటిని తమ పెరట్లగా (హింటర్లాండ్) చేసుకోసాగారు. వ్యక్తి ప్రయోజనవాదం ఆచరణలో వ్యావసాయిక దేశాలను బడుగుదేశాలుగా కరవుకాట

కాలకూ నిత్యావసర వస్తువులకొరకూ వంశపారంపర్యవృత్తుల విధ్వంసానికి దారి తీసింది. ముందుమిగిలిన దేశాలనీ వెనకబడ్డ దేశాలనీ కృత్రిమ విభజనజరిగింది. యంత్రనాగరికత, శాస్త్రవిజ్ఞానం, భావవికాసం మూలంగా కలిగిన ఆధిక్యభావాన్ని అహంకారంగా మార్చుకుని, తాము 'నాగరికతా దూతల'మనీ, తెల్లజాతివారిని యిది సర్వేశ్వరుడు నిర్ణయించిన పవిత్రకర్తవ్య భారమనీ (వైట్‌మాన్స్‌బర్డెన్) కపటంగా ప్రవర్తించసాగారు. ఆర్థికంగా రాజకీయంగా తోడేళ్లై భావపరంగా జిత్తులమారి నక్కలై, తమ అక్రమాలకు ఉదారవాదమనే మేలిముసుగు తగిలించుకున్నారు.

లోగడ ప్రతీ బూర్జువా విప్లవంలోనూ రక్తంచిందించి ప్రాణాలర్పించి పోరాడిన వారేమో పేదసాదలు. నాయకత్వం వహించి అధికారం చేజిక్కించుకోగానే ఎక్కివచ్చిన నిప్పెసలను కాలితో తోసివేసి, పాత పాలకవర్గాలతో సర్దుబాట్లుచేసుకుని, జనసామాన్యాన్ని దగాచేసి దోపిడీకి పూనుకున్నవారు పెట్టుబడిదార్లు కొన్ని చిన్న విప్లవాల్లోనైతే వీళ్ల జనాన్ని నట్టేటముంచి పాతపాలకులకు లొంగిపోయారు. 1848లో జర్మనీలో జరిగిన విప్లవం అలాంటిదే. నాటినుంచి మార్క్సు, ఎంగెల్సులు బూర్జువా వర్గాన్ని ఒక కంట కనిపెడుతూనే వచ్చారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అజ్ఞానులైన జనాన్ని వంచించి అధికారమనే చదరంగంలో పట్టిపావులుగా వాడుకునే చాకచక్యంవుందనీ, సార్వజనిక వోటింగుహక్కు యిచ్చినంతమాత్రాన శ్రామికవర్గానికి నిజంగా వొరిగేదేమీలేదనీ, ఎప్పుడెప్పుడైతే పాలకవర్గం సంక్షోభంలోపడుతుందో అప్పుడు దాని నైజం బయటపడి బూర్జువా ప్రజాస్వామికం కపటనాటకంగా, బూర్జువా వర్గ నియంతృత్వానికి అందాల మేలిముసుగనేది జనం అనుభవానికి వస్తుందనీ గ్రహించగలిగారు. కాబట్టి నటనలకు మోసపోక, బూర్జువా రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తేతప్ప శ్రామికవర్గం రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోజాలదనీ, చిక్కించుకున్నా కార్మికవర్గ నియంతృత్వం అమలుజరిగితే తప్ప విప్లవానంతరకాలంలో రాజ్యాధికారం నిలవదనీ పేరిస్‌కమ్యూన్ తర్వాత (1871) గుణపాఠం తీశారు. అప్పుడప్పుడే యూరోపియన్ పెట్టుబడిదారీ విధానం తొండదళ నుంచి పూసరవిల్లి దశకు మార్పు చెందుతూంది. అదేసమయంలో, విప్లవానికి సారథ్యం వహించవలసిన సోషల్-డెమోక్రాటిక్ పార్టీలు పార్లమెంటరిస్టు మాయాజాలానికిలోనై, పెట్టుబడిదారీ దుర్గానికి పరోక్షంగా తోడ్పడసాగాయి. లెనిన్ కాలానికిగాని, యీ మార్పు పూర్తి కాలేదు. మొక్కల్లా మానైంది. ద్రవ్యపెట్టుబడి (ఫైనాన్స్ కేపిటల్)ని ఇతర దేశాలకు ఎగుమతిచేస్తూ వలసాధిపత్యం మారాకు వేయసాగింది. ప్రపంచంలో పారిశ్రామిక రాజ్యాల నోటబడకుండా ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా ఖండాలలోనూ మహా

సముద్రాలలోని దీవిగడ్డలలోనూ మిగిలివున్న ఖాళీజాగాకోసం యూరోపియన్ రాజ్యాలలో పోటీమొదలై, త్వరలో తీవ్రమైన ఫలితంగా, పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్గత వైరుధ్యాలు మొదటి ప్రపంచ యుద్ధాన్ని తెచ్చిపెట్టాయి. ఈ దశలో సోషల్‌డెమొక్రటిక్ పార్టీలు 'మాతృ'దేశసంరక్షణార్థమనే మిషతో శ్రామికవర్గ అంతర్జాతీయతా దృక్పథాన్ని విడనాడి పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు వుపాంగాలయ్యాయంటే కారణం, కౌట్స్కీ, బెర్న్‌స్టీన్ వగైరాల 'రివిజనిజం' మార్క్సిజానికి వేరుపురుగుగామారడం, దీనికి భౌతికప్రాతిపదిక శ్రామికవర్గంలో పైభాగం సంపన్నకూటంగా రూపొంది పాలకవర్గ భావజాలాన్ని తలకెక్కించుకోవడం, వగైరా.

మొదటి ప్రపంచ యుద్ధంలో తనకు రావలసినంత ప్రాదేశిక లాభం సమకూరలేదని ఇటలీ అలిగి 'మిత్ర'రాజ్యాలకు దూరమై గునుస్తూంటే, ఇంగ్లాండు, ఫ్రాన్సు, అమెరికా, జపానుల ధాటికి నిలవలేక ఓడిపోయి లేనివలసలెట్లాగూ రాకపోవడమటుంచి ఉన్న వలసలూ వూడిపోయిన జర్మనీ యుద్ధవ్యయానికితోడు వర్సయిల్స్ 'శాంతి'సంధి ఫలితంగా (1919) నష్టపరిహార భారంకూడా తలమీదపడి మూలుగుతూ వచ్చింది. వాటి పెట్టుబడిదారీ- భూస్వామిక వ్యవస్థవునికికే ముప్పుఏర్పడింది. సోషల్-డెమొక్రాట్లు వైమార్ ప్రభుత్వాన్ని గజ్జికుక్కగా మార్చి ఆర్థికంగా దివాళా, రాజకీయంగా భ్రష్టతా పట్టించాక, అధికారానికి వచ్చిన ఫాన్‌పేపెన్‌ముఠా, హిట్లర్ ద్వారా మరింత బాగా సంపన్నులు తమపబ్బం గడుపుకోవచ్చునని అతని రౌడీ-కేడీ ముఠాకు అధికారాన్ని బదిలీచేసింది. ప్రభుత్వాధ్యక్షుడు హిండెబర్గ్ తన స్థానాన్ని హిట్లర్ కోసం ఖాళీచేశాడు. సోషలిస్టు భావవ్యాప్తిజరిగి విప్లవ కార్యాచరణకు పూనుకుని దృఢదీక్షతో నిర్వహించే పార్టీలే వుండివుంటే, జారిస్టు రష్యాలో 1917నవంబర్‌లో లాగా శ్రామికవర్గ విప్లవం ఘటిల్లేది. అలా జరగలేదు. కొలిమిపనివాని కొడుకై పుట్టి సోషలిస్టు సిండికలిస్టు భావవాతావరణంలో పెరిగిన బెనిటో ముసోలినీ ఇటలీలో, వియన్నా నగరంలో గృహాలంకరణ వృత్తి చేబట్టి దేబిరిస్తూ బతికిన అడాల్ఫ్ హిట్లర్ జర్మనీలో, చితికిన వర్గాలకు చెందిన వ్యక్తులే అయినా, వాళ్ల యుద్ధానుభవమేమి గెలిచి ఒడుచుకున్న రాజ్యాలపట్ల ద్వేషమేమి, జావకంటె పలచనైపోయిన సోషలిజంపేరిటి రివిజనిజం గురించి ఏవైనా భ్రమలుంటె అవి వదలడమేమి, ఆ ఇద్దరి నోళ్లా ప్రారంభదశలో సోషలిస్ట్ పదజాలాన్ని వల్లింపజేసి కష్టజీవుల ఆశల నెగసన దోయించాయిగాని, క్రమంగా వాళ్ల పెద్దపెద్ద పెట్టుబడిదారుల చంకబిడ్డలై తమ ప్రథమ సహచరుల పీడా వదిలించుకుని అంతిమంగా, పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద వ్యవస్థను

ఇటలీ, జర్మనీలలో పూర్తిగా విచ్ఛిన్నం కాకుండా రక్షించబూనారు. తమకు జన్మ నిచ్చిన వర్గాలకు ద్రోహం చేశారు. ముస్సోలినీ 'ఫేసిజం' అంటే, హిట్లర్ 'నేషనల్ సోషలిజం' - నాజీజం - అన్నాడు. ఇప్పుడు పెరానిజమన్నా, ఇందిరాయిజమన్నా, మరొకటన్నా, ఈ విషపురుగుల మూలపుటమ్మను 'ఫాసిజం' అనే వర్ణించడం సరి. పెటీబూర్జువా వర్గంలోని 'లంపెన్' ఎలిమెంట్లు ఈ పిశాచిని వూరేగించాయి.

ముస్సోలినీ వీలుదొరికితే రేచుకుక్క, దొరక్కుంటే వూరకుక్క. జులుం, జబర్దస్తీ, హింస, వధలు, దురాక్రమణలు, దౌర్జన్యంమూలంగా హిట్లర్ నరరక్తం రుచిమరిగిన బెబ్బులి. వీళ్ల అత్యాశలు రెండో ప్రపంచ యుద్ధానికి దారితీశాయని అనడం పాక్షికంగానే సత్యం. కమ్యూనిజాన్ని దుంపనాశనం చెయ్యాలనే వీరి దుష్టబుద్ధి తమకూ లాభిస్తుందిగనక, సోవియట్ యూనియన్‌మీదికి హిట్లర్‌ను ఎగదోలడానికిగాను వాడినోటికి చిన్నచిన్న దేశాలెన్నో బిరుదిళ్ళుగా మారు తుంటే, అ దేశాలతో తమకు సంధిఒప్పందాలుండికూడా వాటిసాయానికిపోక హిట్లర్‌ను గారెప్రొపోటేలుగా బలిపించిన బ్రిటన్, ఫ్రాన్సుదేశాలూ రెండోప్రపంచ యుద్ధానికి కొంతవరకైనా బాధ్యతవహించాలి. ఇంకొక్కమాట కార్ల్ లైబ్‌నెఖ్ట్, రోజా లగ్జెంబర్గ్‌వంటి కమ్యూనిస్టులను హిట్లర్‌బంట్లు హత్యచేస్తున్నా బవేరియన్ సోషలిస్టు రిపబ్లిక్‌నూ బెలాకున్ నడిపిన హంగేరియన్ విప్లవాన్నీ మొక్కలోనే తుంచివేస్తున్నా పట్టించుకోని రివిజనిస్టు సోషల్-డెమాక్రాటిక్ పార్టీలుకూడా యీ అంతర్జాతీయ నేరా నికి బాధ్యతవహించకతప్పదు. ఇప్పుడు సి. పి. ఐ., సి. పి. ఐ. (యం), మన దేశంలో ఇందిరామందిరాన్ని పహరాకాస్తూ భ్రమల సాలెగూటిలోకి పోతున్నట్టుగానే సోషల్‌డెమోక్రాట్లు మొదట్లోనైనా ముస్సోలినీతోటీ హిట్లర్‌తోటీ సంప్రదింపులు జరి పారు, ఒప్పందాలు చేసుకున్నారుకూడాను. రివిజనిజం ఫేసిజానికి తొలిమెట్టు. స్పార్టా కిస్టులు వగైరా దుర్బల కమ్యూనిస్టుబృందాల త్యాగం, తెగింపు, హిట్లర్ దుండ గీళ్ళయిన స్టార్మ్‌ట్రూపర్ల హింసకూ వధకూ బలయ్యాయి. దేల్మన్‌లాంటి కమ్యూ నిస్టు నాయకులు మెరికల్లాంటి వాళ్లయినా, యీ జాతీయవాద ఉన్మాదానికి బలయ్యారు. బవేరియన్ కమ్యూనిస్టురాజ్యం పొత్తిళ్ళలోనే ప్రాణం విడిచింది. దీనికంతా కారణం రివిజనిస్టుల విద్రోహమే. యుద్ధకాలానికి ముందూ యుద్ధకాలంలోనూ యుద్ధానంతర కాలంలోనూ ఫేసిజం ఆచరణ గురించి ఎన్నో పుస్తకాలు వచ్చాయి - 'జర్మనీ పుట్స్ ది క్లాక్ బ్యాక్', 'ముస్సోలినీస్ సెకండ్ రోమన్ ఎంపైర్', వగైరా. యుద్ధకాలంలో రజనీ పామీదత్ 'ఫాసిజం అండ్ సోషల్ రివల్యూషన్' రాశాడు (1934). సరిగ్గా

అప్పుడే ఇక్కడ మన దేశంలో ఖైదీగావుంటూ యం. యన్. రాయ్ 'ఫాసిజం'
రాయసాగాడు. యుద్ధానంతరకాలంలో పెపైన్ లాంటి రాజనీతివేత్తలూ, న్యూరెంబర్గ్
న్యాయస్థానం ముందు ఖైదీలుగా బోనులోనిలుచున్న హిట్లర్ అనుచరుల్లో స్పీర్‌లాంటి
మాజీ మంత్రిలూ చాలా చాలా రాశారు. సామ్రాజ్యవాద ఔవజాడ్యమైన ఫేసిజం
తృతీయ ప్రపంచదేశాల్లో ఛోటా ఆధిపత్యవాదులకూ సోకుతుందని గ్రహించిన అరుణ్
షౌరీలాంటి విజ్ఞులు 'సింప్టమ్స్ ఆఫ్ ఫేసిజం' లాంటి పుస్తకాలు ప్రకటించారు,
ప్రామాణికంగా పేర్కొనదగ్గవి దత్ పుస్తకమూ, రాయ్‌పుస్తకమూ.

రాజ్యం సర్వశక్తి సముపేతమైనది (టొటాలిటేరియన్). అలాంటి రాజ్యంలో
పౌరసత్వాలుగానీ, ప్రాథమిక హక్కులుగానీ పూర్తిగా ప్రభుత్వాధీనాలు, ఈ విష
యంలో ఫేసిజానికీ, కమ్యూనిజానికీ అట్టే భేదంలేదని వాదించే కుహనాపండితులు,
పెట్టుబడిదారీవిధానం సామ్రాజ్యవాదదశలో తన ప్రజాస్వామిక కపటనాటకాన్ని కట్టి
పెట్టి నగ్నమైన వర్గనియంతృత్వంగా శ్రామికవర్గాన్ని రాచిరంపానపెడుతూ బడా
పెట్టుబడిదారీ వర్గాధికారానికి కేవలం సాధనమౌతుందని విస్మరించమంటారు. ఇటలీలో
జర్మనీలో జరిగిందదే. ఇండియాలో జరుగుతున్నదీఅదే. కాకుంటే, ఫేసిస్టుల తెలివి
తేటలెక్కడవున్నాయంటే, ప్రజలను మభ్యపెట్టడంలోనే వున్నాయని చెప్పాలి. అరి
చేతిలో వైకుంఠాలు చూపుతూనో, సోషలిస్టు పదజాలం వల్లిస్తూనో, బ్రహ్మాండమైన
ప్రచారాల ద్వారా, ప్రదర్శనల ద్వారా ఉద్రేకాలనూ, దురభిమానాలనూ, ఆవేశకావేషా
లనూ రెచ్చగొట్టే వుపన్యాసాలద్వారా మనిషి నైజంలో ఇంకా అట్టడుగునవున్న పశు
లక్షణాలనూ మేల్కొలిపి, వివశుల్నిచేసి, సాధనాలుగా వాడుకునే కౌటిల్యప్రజ్ఞ చూపు
తోనో, వున్నవారికి పరోక్షంగా వూడిగంచెయ్యడం, ఫాసిజం లక్షణాలలో ఒకటి.
చెట్టుపేరుచెప్పి కాయలమ్ముకునే చతురుడిచందంగా, 'జాతి' పేరున సంపన్నవర్గ
ప్రయోజనాలను పెంపొందింపజేస్తారు. 'రాజ్యం' దైవదత్తమంటారు. ఆజ్ఞ అతిక్ర
మించరానిదంటారు. 'ఫ్యూరర్' (హిట్లర్ బిరుదు), 'ఇల్‌డ్యూస్' (ముస్సోలినీ
బిరుదు), 'దేశ్‌కీనేతా' (ఇందిర బిరుదు) వంటి కృత్రిమమైన మహిమను (కెరిస్మా)
ఆపాదించే మాటలతో ప్రజల వివేచనని మొద్దుబారించి కీలుబొమ్మలుగా చేస్తారు.
కంచే చేనుమేసినట్టుగా తమకుమాత్రం అన్నిహక్కులూ, ప్రజలకేమో అన్నీవిధులూ
కల్పించి చట్టాలను చట్టుబండలుచేసి, న్యాయస్థానాలను పక్కకునెట్టి చెరసాలలూ,
వురికంబాలూ, చిత్రహింసలూచాలక 'కాన్ సెంట్రేషన్ క్యాంపులు', 'గ్యాస్‌చేంబర్లూ'
మూకుమ్మడిహత్యలూ సాగిసారు, సాగిస్తారు. మూర్ఖకవాదాన్ని (మిస్టిసిజం), ఆధ్యా

త్మకతనీ, అధిమానవ నాయకవ్యక్తి అద్భుతశక్తుల్నీ ఆశ్రయించి, ఆదిమమానవుడి అజ్ఞానాన్ని తిరగదోడి దానిఆసరాతో తమ పబ్బం గడుపుకుంటారు. క్షణక్షణమూ యుద్ధంగురించి, లేనిగత్తర్లు లేవదీసి జనందృష్టిని దురాక్రమణవైపు మళ్ళించేందుకు, 'నరవర్గకూటమి' (రేస్) అనే చారిత్రికంగా పచ్చిఅబద్ధాన్ని ప్రచారంచేస్తూ, తమ కూటమిదే సర్వాధిక్యతఅని తెగవాగుతారు, ఫేసిజంఅనేది కలగూరగంప. దానివేరులోనే పురుగుచేరింది. ఆదిమ ఆటవికత్వం దానిబలం. భావపిశాచ విశృంఖల విహారానికి అనుకూలమైన తాత్విక వాతావరణం దానిప్రాతిపదిక. ఈ అంశాలను రాయ్ సవివరంగానే వర్ణించాడు. భౌతికవాద దృక్పథంనుంచే విశ్లేషించాడు. మార్క్సిజం (కమ్యూనిజం) కోణంనుంచే పరిశీలించాడు. అందుచేత పామీదత్ పుస్తకంలోని అంశాలకూ రాయ్ పుస్తకంలోని వాటికి పెద్దతేడా కనిపించదు. కాని, రాయ్ పుస్తకానికో విశిష్టతవుంది. హైందవమైన జగన్మిథ్యావాదాన్నీ, కర్మ సిద్ధాంతాన్నీ, చాతుర్వర్ణ్యాన్నీ, పురుషాధిక్యాన్నీ, దాసభావాన్నీ, ఫాసిస్టు-భావానుకూలమైన యూరపియన్ క్షీణతత్వ ధోరణులతో సమన్వయించడం సుకరంకాదు. 'నావిష్ణుః పృథివీపతిః' వంటి సూక్తులు దైవదత్తాధికారాలతో రాజ్యాన్ని అతీతశక్తిగానూ, పాలకుణ్ణి 'అదండ్యుడు'గానూ, 'రాజానుమతోధర్మః' వంటి సూత్రాలద్వారా, పాలకవర్గాల ధర్మప్రవర్తకుడుగానూ చిత్రించిన ప్రాచీన హైందవ రాజనీతిలో ఫాసిజం మూలాలున్నాయి. ముఖ్యంగా గతశతాబ్దిచివరా ఈ శతాబ్దిమొదటా మనదేశంలో పడగెత్తిన హైందవ పునరుద్ధరణవాదంలో అభ్యుదయకరమైన అంశాలుగా అనేకులు భావిస్తున్న వాటిలో ఫాసిజంఛాయలు దాగొనియున్నాయని నిరూపించడంలో చాలావరకు కృతార్థుడయ్యాడు. అయితే అధిమన బూర్జువా జాతీయోద్యమానికి చేసిన దోహదం దాని 'పాజిటివ్' అంశ (ధనాంశ) అనికూడా గుర్తించివుంటే బాగుండేది. రామకృష్ణపరమహంస కంటె ఎంతో వెనక్కువెళ్ళి ఉపనిషత్తులలోని లొసుగులనైతే దిక్మాత్రంగానైనా చూపాడుగాని, శంకరుని మాయావాదాన్నీ మహాయానబౌద్ధుల బోధనల్నీకూడా పుటంకించివుంటే, చిత్రణ సమగ్రమయేది.

రాజకీయంగా తాత్వికంగా రాయ్‌లో తదనంతరకాలాన వచ్చిన పెనుమార్పుల వల్ల గతితార్కిక భౌతికవాదాన్నేగాక దానితోబాటు విలువైన మరెన్నిటినో తోసేసి ఆదర్శభావవాదిగా పరిణమించిన రాయ్‌కి యిప్పుడెందరో మానసపుత్రులు కుక్కమూతి పిందెల చందంగా వున్నారు. వట్టినాస్తికత పనికిమాలిందని యీ పుస్తకంలోనే

రాసిన రాయ్‌ని అనువాదకుడైన రావిపూడి వెంకటాద్రి అనుసరిస్తున్నాడా? స్టాలిన్‌నూ మావోనూ చంఘిజ్‌ఖాన్, తామర్లేనుల సరసన నిలుపుతూ, ఫాసిజానికీ కమ్యూనిజానికీ పోలికలు చూపుతూన్న పీఠికాకర్త ఎన్. ఇన్నయ్య. ఈ పుస్తకంలోని రాయ్ భావాలని కాలదన్నడంలేదా? వీళ్లిద్దరూ గురువుని మించిన శిష్యులా, లేక (రంగనాయకమ్మగారు క్షమించాలి!) గురువుని చంపిన శిష్యులా? మంచి గురువు శిష్యుడు తనని మించిపోవాలని కోరుకుంటాడు— "శిష్యాదిచ్ఛేత్ పరాజయమ్". రాయ్ భావవైకల్యానికి పుట్టిన వికృతసంతానం, భారతితో శతానందుడై సంభోగంజరిపాక బ్రహ్మకు పుట్టిన దైత్యసంతానం లాంటిది. వెంకటాద్రిగారి నటుంంచి, రాయ్ మీగాళ్లదాకానైనా రాగలరా ఇన్నయ్యగారు? ఎరిక్‌ఫ్రామ్‌ను మెచ్చుకుంటే చాలా? కమ్యూనిజంలో నీతికి స్థానం లేదనడం ఫేసిజం లక్షణమైనప్పుడు ఇన్నయ్యగారు దానినెందుకు పేర్కొంటున్నట్టు? హోవర్డ్ సెల్సాంలాంటివారి 'మీన్స్ అండ్ ఎండ్స్' చదివే వుంటారు. కాని, లాభం! కానీలాభం లేదు. రాయ్ పెరుగుతూపోయాడనేది ఇన్నయ్యగారి నమ్మకం. ఇది గుడ్డినమ్మకమా, కాదా అనేది వేరేప్రశ్న. 'నవ్య మానవతావాదం' మార్క్సిజానికంటె ఎందులో, ఎలా, మిన్న అని సహేతుకంగా వివరించినవ్యక్తి, ఫాసిజానికి గల అవలక్షణాలలో ఒకటైన విశ్లేతుక (ఇరేషనల్) విశ్వాసానికి బలైనట్టేలెక్క. 'కాషాయవస్త్రం' అనలేక, కనీసం 'ఓఛ్రిరోబ్' అనీ అనక "ఆకర్‌రోబ్" అనేవారి భాషాజ్ఞానాన్ని గురించి ఎంత తక్కువరాస్తే అంత మంచిది. ఒక విషయంలో మాత్రం ఇన్నయ్యగారితో నాకు ఏకాభిప్రాయంవుంది. ఫాసిజం దేశ, కాలపరిస్థితుల్నిబట్టి ఒక రాజకీయ ధోరణిగా రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో తలెత్తినా, నేటికీ అది వివిధ రూపాలలో, వేర్వేరుపేర్లతో సజీవంగా వుంది, వుంటుంది కూడా. దీనికి కారణం ఏమిటంటే, క్షీణమానమై పతనోన్ముఖమైన సామ్రాజ్యవాద యుగం కొనసాగడమే. అయితే, బడాపెట్టుబడిదారీ దేశాల్లోనేగాక, అటూఇటూగాని పెట్టుబడిదారీ దేశాల్లోనూ చిల్లరమల్లర అర్ధవలస దేశాల్లోనూ ఆవ్యాధి సోకుతూంది. పెట్టుబడిదారీ సంక్షోభానికి దాన్ని 'శ్రీరామరక్ష'గా ఎంచే పాలకవర్గాలున్నంతవరకూ అది యిలాగే కొనసాగుతూ, గుప్తంగావుండి పరిస్థితి సంకటస్థితికి చేరుకోగానే 'సిగ్గుబిళ్ల' జారవిడిచి దిసమొలతో శవతాండవంచేస్తూ బూర్జువా ప్రజాస్వామిక 'మర్యాద'లను కూడా పాటించడంమాని వర్గనియంతృత్వంగా వ్యక్తి నిరంకుశత్వంగా పొటమరిస్తూంది. మితిమీరిన జాతీయాహంకారం వర్గ నియంతృత్వ సాధనోపకరణం. దౌర్జన్యం, నిర్దాక్షిణ్యం, హింస, క్షోభ దానితెన్నులు

చట్టంగాని చట్టం దాని కట్టుదిట్టం. ఆదిమ భావ పిశాచి ఆవహించినప్పుడల్లా అది వెర్రిపీర్లై గణాచార్లై ఏ అకార్యకరణానికీ, దారుణానికీ వెనుదియ్యదు. దానికి కావల సింది ఆర్థిక అరణ్యం. 'ప్లానింగ్' పనికిరాదు. ఈ అరణ్య రాజ్యంలో యధేచ్ఛగా దుర్బలమృగాలను దోస్తూ శ్రమఫలితంమేస్తూ బలిసే ఘాతుకమైన క్రూరజంతువులు క్రుప్స్, వగైరా కోటీశ్వరులైన పరిశ్రమాధిపతులు. సోషలిస్టు పదజాలంలో హక్కు ల్లేని విధులతో బండచాకిరీ చేసేందుకే నోరులేని, దిక్కుమాలిన శ్రామికులు, వీళ్ల బలిపశువులు.

తత్వశాస్త్ర విషయాలలో రాయ్ యీ పుస్తకంలో చూపిన పరిజ్ఞానం స్థూలమే అయినా, షోపెన్‌హావర్, షెల్లింగ్, బెర్గ్‌సన్, సోరెల్, నీచ్చే, ఫిచ్చే, విలియమ్ జేమ్స్‌వంటి వెనకటితరం తాత్వికులూ, రోజెంబర్గ్, సరోలియావంటి రెండోతరం తాత్వికులూ ఎలా ఫాసిజానికి అనుకూలమైన తాత్వికనేపథ్యం కల్పించారో సవివరంగా చెప్పడానికి యిది సమయంకాదు, యిక్కడ స్థలముచాలదు. ఈ ఆధారాలనుపట్టుకుని లోతునిదిగి మొత్తానిక, నియోహెగెలియన్లు క్రమంగా లౌకికమైన పెట్టుబడిదారీ నీరసాన్నీ, దౌర్బల్యాన్నీ, సంక్షోభాన్నీ తాత్వికంగా నిరాశానిస్పృహలుగా, వాటి పరిష్కారానికి అధిమానవుడినీ, 'సరవర్గ' ఆధిక్యతనీ నాగరికతా విస్తరణవాదాన్నీ, దయాదాక్షిణ్యాలకూ, మంచిచెడ్డలకూ సంబంధంలేని నిర్దాక్షిణ్యమైన స్వార్థవిజృంభణనీ జగన్మిధ్యావాదాన్ని అడ్డంపెట్టుకుని జనసామాన్యం దుస్థితిపట్లా, దుర్గతిపట్లా చూపిన దుర్మార్గపూరితమైన అశ్రద్ధనీ, నిర్లక్ష్యాన్ని రాయ్ ఆధారసహితంగా చూపగలగడం, నిజంగా మెచ్చదగింది.

పారలౌకికమనేది తిరగదిప్పిన లౌకికమే. ఈ వుల్టాసీదా వ్యవహారం ఫాసిజా నికీ వర్తిస్తుంది. దానికి రాయ్ యిచ్చిన నిర్వచనాలు ఒకటీ రెండూకాదు. ఇవ్వవల సిందే కూడా. ఎందుకంటే, దానికున్నకోణాలు అనేకంగనక. చివరికి అది క్రైస్త వాన్నీ నిరాకరించింది. జాలి, దయ, దాక్షిణ్యం సరిపడవుగదామరి ! ఇక, మేధావు లను భయభ్రాంతుల్నిచేసింది. భావస్వాతంత్ర్యం, భావప్రకటనా స్వాతంత్ర్యం, దాని నిర్హేతుకతత్వానికి వికటిస్తాయిగదా మరి ? ఇందులో ఐన్‌స్టీన్‌లాంటి యూదులేగాక, థామస్‌మేన్‌లాంటి 'నార్డిక్' జాతికిచెందిన రచయితలూ స్వదేశానికి దూరమయ్యారు. హిట్లర్ తరచూవాడిన 'ఆర్య' శబ్దం నిజానికి జర్మన్లకు వర్తిస్తుందా ? వీరిపూర్వులు ఉత్తరయూరపునుంచి వచ్చిన ట్యూటన్, శాగ్జన్, వగైరాతెగలకు చెందినవారేగాని,

రష్యా దక్షిణ సరిహద్దుకీ మధ్య ఆసియాలోని ఆక్సస్, జక్సార్టస్ నదీప్రాంతాలకూ మధ్య నివసించారని రాయ్ భావించే 'ఆర్యజాతి'కి చెందినవారు కాదుగదా ! 'ఆర్య' శబ్దం జాతివాచకంకాదనీ, భాషావాచకమనీ, ఆర్యుల ఆదిమ నివాసస్థానం తిలక్‌వాదాన్ననుసరించి ఉత్తర ధ్రువప్రాంతం కాకున్నా, నేటి హంగేరియన్ ప్రాంతంకావచ్చుననీ ఆర్యభాషా కుటుంబంనుంచి ఒకటికి రెండుసార్లు కుదించి వేర్వేరుబృందాలు పశ్చిమానికీ ఉత్తరానికీ దక్షిణానికీ తూర్పుకిగూడా విస్తరించాయనీ చరిత్రకారులు చేస్తూన్న నానాసిద్ధాంతాలను రాయ్ పూర్తిగా పట్టించుకున్నట్లులేదు. అయినా, వీరిది మొగటినుంచీ దురాక్రమణ తత్వమేననడం మాత్రం నిర్వివాదం. వర్ణాహంకారం వీరికి వుగ్గుతోపెట్టినవిద్య. దానితో బానిసత్వం జతబడింది. భారతదేశంలో దస్యులైతే, గ్రీకులో హీలట్లు, తూర్పుయూరపులో స్లావ్‌లు ('స్లేవ్'-బానిస-శబ్దం యిలాగే వచ్చింది) ఈ ఆర్యభాషా కుటుంబాల దుర్మార్గానికిగురైన ప్రజాసమూహాలే. నిజానికి 'నరవర్గం' (రేస్) అనేది శుద్ధకల్పన. శుద్ధమైన 'నరవర్గం' ఏదీలేదు. తలనీ మెదటినీ శాస్త్రీయంగా పరిశీలించిన వాళ్ళెవరూ ఒకజాతి మహాతెలివైందనీ మరొకటి మందమతిఅనీ అనరు. ఐ. క్యూ. (ఇంటలిజెన్స్ కోషెంట్) జాతి దిబుసునుబట్టి వుండదు. ఎంత పెద్దలైనాకావచ్చు, అది కోడిగుడ్డురూపంలో (ఎగ్‌హెడ్) వుండవచ్చు: దానిలోనిగుజ్జు (ఎల్లోమేటర్) రాశిలో ఎంతటిదైనాకావచ్చు: వాడకపోతే అది వుండీలేనట్టే. ఈవిషయం వాస్తవం. దీన్నిఫాసిస్టులు పట్టించుకోరు. పట్టించుకుంటే వాళ్లు ఫాసిస్టులుకారు.

1947 ఆగస్టు 15న "స్వాతంత్ర్యం" వచ్చిందని 'స్వవిషయం'లో యం. వి. రామమూర్తిలాంటి విజ్ఞులు రాయడం విచిత్రం. ఇది పొరబాటా, చరిత్ర వక్రీకరణా ? వెంకటాద్రి అనువాదం తద్ధితరూపాలు, కృతకశబ్దాలు, అస్పష్టమైన తెలుగు మాటలూ లేకుంటే ఇంకాబాగుండేది. చివరిఅట్టమీద గ్రంథకర్తగా రాయ్ పేరుగాక, తనదివుండడం అనుచితం. రాయ్ అనుచరులు యిప్పుడుచేస్తున్న అపచారం భక్తి అతిశయంవల్లనే. ఆయన 'భక్తి'కే వ్యతిరేకి. కొత్తమతం- 'నవ్యమానవవాదం'- వచ్చి పాతనీటిని- మంచినీటిని- కొట్టివేసిందా యేమిటి ?

— కె. వి. ఆర్.

క్షుద్రసాహిత్యం

చేకూరి రామారావు

కొన్ని పుస్తకాలు చాలా ప్రచారాన్ని పొందుతాయి. ఎందుకు పొందుతాయో వెంటనే చెప్పలేం. వాటికి సామాజిక కారణాలుంటాయి. వాటిని పరిశోధించి కనుక్కోవాలి. మొన్నటివరకూ, ఇప్పటికి కూడానేమో అరడుగుల హీరోలు చచ్చుప్రేమకథలు ప్రజాదరణ పొందినై. ఇవాళ చేతబడి, కథలు పాపులర్ అవుతున్నై.

క్షుద్రసాహిత్యం ప్రజాదరణ పొందటానికి ఇది ఆదీ కాదూ, అంతకాదు. కొంచెం వెనకటి కాలంలో తారాశశాంకం, వైజయంతీ విలాసం వంటి ప్రబంధాలు వచ్చినై. 19వ శతాబ్దంలో సంస్కృత మాఘకావ్యాన్ని తెలుగు చేసిన గోపీనాధ వెంకటకవి బ్రహ్మానంద శతకం అనే బూతుపద్యాల శతకం రాశాడు. మా చిన్నప్పుడు కొవ్వలి నవలలు విపరీత ప్రచారంలో ఉండేవి. ఇప్పుడు చేతబడి సాహిత్యం అని విరసం వాళ్ళ ముద్దుపేరు పెట్టినట్టుగా, ఆనాడు కొవ్వలినవలను రైల్వే సాహిత్యం అనే వాళ్లం 1960కి పూర్వం శవసాహిత్యం కొన్నాళ్లురాజ్యం చేసింది. అందువల్లనే క్షుద్ర సాహిత్యానికి ఇది ఆదీ కాదు, అంతమూకాదు.

క్షుద్రసాహిత్యం ఎందుకొస్తుందీ, అవేది విడివిడిగా కారణాలు వెతకాల్సిన ప్రశ్న. క్షుద్రసాహిత్యాన్ని ఆదరించే పాఠకులు ఎప్పుడూ కొందరుండనేఉంటారు, వాళ్ళకోసం ఈ పుస్తకాలు అచ్చవుతూనేఉంటై. ఉదాహరణకి ఇప్పుడు న్యూస్‌పేపర్ స్టాల్సులో దొరికే సెక్సునవల్లు, వాటిని ఆదరించే పాఠకులు లేకపోతే అవెందుకు అచ్చు అవుతై? కాని జనం వేలం వెర్రిగా వాటిని చదువుతున్న దాఖలాలేదు.

కొన్నిరకాల క్షుద్రరచనలు ఎందుకు ప్రజాదరణ పొందుతున్నయ్యనేదే మనం ఆలోచించవలసిన ప్రశ్న.

ఇవన్నీ మనసమాజ రుగ్మతకు ప్రతీకలు. జీవితంలో లేందీ కలల్లో ఊహించి wish Fulfilment జరుపుకోటానికి చచ్చుప్రేమకథలు వచ్చినై. లాటరీటికెట్లు ఎందుకు కొంటున్నారో, చచ్చుప్రేమకథలు అందుకే చదువుతున్నారు. ఒకదానిని ప్రభుత్వం రెండోదాన్ని పత్రికలు, ప్రచురణకర్తలూ ప్రోత్సహిస్తున్నారు.

మరి ఈ చేతబడి సాహిత్యంమాటేమిటి? ఇదిఒక ధోరణిని ప్రారంభించింది. (trend setter) అని నాకింకా నమ్మకంకుదరలేదు. ఈ ధోరణిలోవస్తున్న ఇతర నవల్లు ఇంతవేలంవెర్రిగా అమ్ముడుపోతున్నట్టులేదు. ఆంధ్రభూమి సేల్సుపెరిగినయ్యని మిగతాపత్రికలూ ఇట్లాంటి దయ్యాల, భూతాల కథలు మొదలుపెట్టినా వాటిసేల్సు

వాళ్ళాశించినంతగా పెరిగినట్టులేదు. పత్రికాముఖాన చెప్పటానికి వీల్లేని కారణాలవల్ల జానకివిముక్తిని మధ్యలో ఆపేసి, కాంచనగంగ మొదలుపెట్టినా వాళ్ళాశించిన ఫలితం వచ్చినట్టులేదు. అందువల్ల తెలుగు సాహిత్యంలో చేతబడి ధోరణి అనో, తెలుగు సాహిత్యంలో దయ్యాలు, భూతాలుఅనో రాబోయేవాళ్ల రిసెర్చిచేసి డిగ్రీలుపుచ్చుకోటానికి తగినంతసమాచారం (matter)రాదనే నానమ్మకం.

మూఢనమ్మకాలను రేషనలైజ్ చేసేఅలవాటు మనదేశంలో చాలామందికీఉంది. బొట్టుపెట్టుకోటానికి, జపంచెయ్యటానికి, మడికట్టుకోటానికీ, జంధెం వేసుకోవడానికీ, గ్రహణస్నానం చెయ్యటానికీ సైంటిఫిక్‌కారణాలు చూపించే కుహనా శాస్త్రీయవాదులు, కుటిల పునరుద్ధరణవాదులు మనదేశంలో ఉన్నారు. మూఢనమ్మకాలను చిరకాలం కొత్తబలంతో బతికించటమే వాళ్ళలక్ష్యం.

ప్రజల్లో మూఢనమ్మకాలు బలంగా పాదుకొనియున్నాయన్న యదార్థాన్ని మనం గుర్తించాలి. నవల్లుచదివే పాఠకులకు కాస్తోకూస్తో హైస్కూలుసైన్సు అబ్బిఉంటుంది. అటువంటివాళ్ళకు చేతబడి హిప్నోటిజం లాంటిదేనన్న భ్రమకలిగించటానికి ఎక్కువ కష్టపడక్కర్లేదు. బాబాలు పదార్థాన్ని 'సృష్టించ'గలరని (materialize చెయ్యగలరని)నమ్మే సైంటిస్టులూ, విద్వాంసులూ, విద్యావేత్తలూఉన్న జాతిమనది. ఈ విషయం మనం ఈ సందర్భంలో గుర్తుచేసుకోటం అవసరం. అటువంటప్పుడు సాధారణ గృహిణులు, హైస్కూలు, కాలేజివిద్యార్థులు చేతబడిని, హిప్నొటిజాన్ని ఒకటిగా భ్రమింపజేయటానికి పెద్ద శ్రమపడక్కర్లేదు. సరిగ్గా, తులసీదళం రచయిత సాధించింది అదే.

కొంత మంది అనగావిన్నాను. నాతోనే వాదించారు. తులసి మరణానికి కాష్మోరాయే కారణమని చెప్పలేదుగదా. శ్రీనివాసపిళ్లే ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ పద్ధతి (elecltronic device) చూపించారుగదా. తులసి మెదడును ఈ ఎలక్ట్రానిక్ పద్ధతి (elecltrenic device) ఇచ్చే ఆజ్ఞలకు ఒదిగేలా (tune) చేశారు గదా అదే కారణం అని ఎందుకనుకోగూడదు ? అని.

ఈ నవలరచయిత చేసిన గడుసుదనం ఏమిటంటే రెండుమూడు రకాల కారణాలను ఏకకాలంలో జరిగినట్లు చూపించటం, అందులో సస్పెన్సుకోసం ఏర్పాటుచేసింది ఎలక్ట్రానిక్ పద్ధతి, (electrenic device) ఇది చాలా బలహీనమైన కారణం. కాష్మోరా అనే క్షుద్రదేవతా ప్రీతిచేస్తున్న క్షుద్ర సొంతరక్తం కళ్లజూడటం, వాడి

పళ్లుఊడిపోవటం ఇవన్నీ నిజమనినమ్మేట్టు వర్ణించినవి. తులసి 21 రోజులు అనుభవించినట్టు చూపించిన బాధలు 'కాష్మోరా' అనే క్షుద్రవిద్యకే ఎందుకు పరిపోవాలి? వైద్యశాస్త్రానికి ఎక్కడా అందలేదే? క్షుద్ర విద్యలను ప్రవేశపెట్టి ఇవి కూడా సాధ్యమే, వీటిని కొట్టిపారెయ్యరాదు అని చూపించటమే ఈ నవల ధ్యేయం అని నిరూపించటానికి ఏమంత కష్టపడక్కర్లేదు. ఇక దానికి సస్పెన్స్, థ్రిల్ కలిపితే చదివే ఆసక్తి పెరిగింది.

ఈ నవలలో చేతబడిని గురించి వివరాలు చాలా చెప్పబడినై. వాటిని అవునో కాదో తెలుసుకునే తీరికసాకులేదు ఓపిక ఉన్నవాళ్ళు చెయ్యొచ్చు. ఆ వివరాల వర్ణన కొంత ఆసక్తికరంగా ఉండిఉండొచ్చు. ఇప్పుడు వస్తున్ననవల్లకు పూర్తిగా భిన్నంగా ఉండి కొత్త అంశాన్ని వాడుకోవటంవల్ల తులసీదళానికి ప్రచారం వచ్చింది. అయితే ఈ కొత్త మెరుపు ఎక్కువకాలం నిల్చేదికాదు- త్వరలోనే వెలాతెలాబోతుంది.

అయితే ప్రగతిశీల ప్రయోజనకర సాహిత్యం కావాలనుకునే రచయితలు చెయ్యాల్సిందేమిటి? ప్రజలను చదవొద్దని మనంచెప్పినా, ప్రభుత్వాలు శాసనాలు చేసినా చదవటంమానరు. ప్రజల అభిరుచులను పెంచేరచయితలను విరివిగాచేసి అందరికీ అందేట్టు చెయ్యటమే దీనికి విరుగుడు. ప్రగతిశీల రచయితలు సృష్టించిన ఖాళీనే (వాక్యూంనే) క్షుద్రసాహిత్యం ఆక్రమిస్తుందనే సత్యం గుర్తించి రచనలు చేయాలి. తెలుగులో చేతబడి సాహిత్యం అనేధోరణి trend రాబోవటంలేదు దానికంత శక్తిలేదు. ఇది సాహిత్య చరిత్రలో అత్యంత క్షణికమైనది దీన్ని గురించి మనం తలలు బద్దలుకొట్టుకోవాల్సిన అవసరంలేదు. మనం దీన్ని అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. మనం చేస్తున్నపనిని ఇంకాస్త తీవ్రంగాచేసి ప్రజలకు చదువగల చదువదగిన సాహిత్యం అందించాలి.

ప్రగతిశీల రచయితలు కవిత్వంలో సాధించినంతగా కథ, నవలలో సాధించలేక పోయారనేది ఈ క్షుద్రసాహితంత్య ఎత్తిచూపుతున్నది. ఒకరకంపాఠకులు అంటే విడువకుండా వారపత్రికలు, నవల్లు చదివేపాఠకుల్ని ప్రగతివాదులు విస్మరించినట్టు ఈ క్షుద్రసాహిత్యం గుర్తుచేస్తున్నది. ఆ మేరకు ఈ క్షుద్రసాహిత్యం మనకు మేలు చేసిందనే అనుకుంటాను.

అంతర్జాతీయ కార్మికగేయ రచయిత - యూజీన్ పొటియర్

(అక్టోబర్, 1816 - నవంబర్ 1887)

"ఫాసిస్టుపాలన మమ్మల్ని అండర్‌గ్రౌండ్ జీవితంలోకి నెట్టివేసిందేగానీ, పాతేసినశవాల్లా స్పందనలేకుండా లేము మేము, యీ భూగర్భాల్లో. సరిగదా, సోష లిజం కోసం నాటిన విత్తనాల్లావున్నాంమేము. ఓ వసంత సుప్రభాతాన ప్రపంచ వ్యాప్తంగా మొలకెత్తుతాంమేము. మేమీ చీకటిగర్భాల్లోవున్నా మాలక్ష్యం అందరికీ వెలుగులేవటం"- అని జ్యూలియస్ ఫ్యూజిక్ అన్నమాటలు 1871లో పారిస్ కమ్యూన్ పడిపోవటం మూలంగా అమెరికాలో ప్రవాసజీవితం గడిపిన యూజీన్ పొటియర్ జీవితానికికూడా అక్షరాలవర్తిస్తుంది. ఆ ప్రవాస జీవితంలోనే ఆయన 1871లో (జూన్‌నెల) దుర్భరమైన దారిద్ర్యజీవితాన్ని అనుభవిస్తూ, అంతర్జాతీయ కార్మిక విప్లవగీతాన్ని (ఇంటర్‌నేషనల్ సాంగ్) రచించారు. ప్రప్రథమ శ్రామికవర్గ పోరాటకాలంలో ప్రభవించిన గీతమే "ఆకలిమంటచే మలమలమాడే అనాధులందరు లేవండోయ్...." అంతర్జాతీయగేయం.

ప్రపంచచరిత్రలో తొలిసారిగా కార్మికవర్గ ప్రభుత్వ సాధనకోసం జరిగిన మహోజ్వల పోరాటమే పారిస్‌కమ్యూన్. మార్క్సిస్టు మహోపాధ్యాయులైన మార్క్స్-ఎంగెల్స్‌ల సైద్ధాంతిక ప్రేరణతో, పారిస్ విప్లవకారుల్లో అగ్రగణ్యుడైన యూజీని వార్లిన్ నాయకత్వంలో 1871 మార్చి 18వ తేదీన ఫ్రెంచిప్రభుత్వ కార్యాలయంపై అరుణపతాకం (Red Flag) ఎగురవేయబడింది. ఈ విప్లవపోరాటంలో మార్క్స్-ఎంగెల్సులుకూడా పరోక్షంగాపాల్గొన్నారు.

తరతరాలుగా, యుగయుగాలుగా దోపిడీచేయబడుతున్న సామాన్య ప్రజల సంకెళ్ళు కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడినవెంటనే తెగ్రెంచివేయబడ్డాయి. చరిత్రలో కొత్తఅధ్యాయం ప్రారంభమై, శతాబ్దాలబానిసత్వం నిర్మూలించబడింది. ఆరోజు కార్మికులు, రైతులు, స్త్రీలు - సమస్త పీడితప్రజానీకం ఆనందోత్సాహాలతో పండుగ చేసుకున్నారు. ఈ పోరాటంలో వందలసంఖ్యలో కార్మికులు - రైతులు తాము కలలు గనే సామ్యవాద వ్యవస్థకోసం ప్రాణత్యాగాలుచేశారు. అయితే యీ త్యాగఫలితం ఎంతోకాలం నిలువలేదు. బిస్మార్క్‌కి అండగా థేర్స్ ప్రభుత్వ సైనికులు కమ్యూ నిస్టులపై ఎనిమిదిరోజులపాటు దాడిజరిపి పారిస్ కమ్యూన్ ప్రభుత్వాన్ని అంతమొం దించడానికి ప్రయత్నంచేశాయి. ఈ పోరాటంలో కమ్యూనార్డ్స్ ధైర్యోత్సాహాలు

పరిరక్షించి విప్లవాన్ని రక్షించడానికై చివరివరకు కృషిచేశారు. అయినా కమ్యూన్ ప్రభుత్వం (మే 28, 1871) పడిపోయింది. ఈ కార్మికవర్గ నియంతృత్వ తొలి ప్రభుత్వం 1871 మార్చి 18వ తేదీనుండి మే 28 వరకు 72 రోజుల పరిపాలనచేసి పెట్టుబడిదార్ల కుట్రలకు బలియైంది. ఈ కమ్యూన్ పోరాటకాలంలో యూజీన్ పొటియర్ కూడా ప్రధాన పాత్రవహించాడు. ఆయన తన జీవితకాలంలో జరిగిన విప్లవ ఘటనలన్నిటినీ ఆహ్వానించి వుత్తేజకరమైన కవితలు, గేయాలు రాసేవారు శ్రామికుల్లో చైతన్యాన్ని రగుల్కొల్పడానికీ, యుగాల మూఢ మతభావాల్ని వదిలించడానికి పొటియర్ తనకలాన్ని అంకితంచేశారు. తనరచనల్లో ఆయన దోపిడీ పాలకవర్గమైన పెట్టుబడిదార్లను, వారి వత్తాసుదార్లయిన ప్రభుత్వాన్ని తీవ్రంగా గర్హించేవాడు. ఆయన గేయాల్లో ఆవేదన, ఆవేశం, ఆలోచన సమపాళ్ళల్లో మిశితమైవుండేవి. పాటద్వారా తనభావాల్ని గొప్పగా వ్యక్తీకరించేవారాయన. అక్షరజ్ఞానంలేని శ్రామికప్రజల్లో గేయాలద్వారా చైతన్యాన్నికలిగించి, పీడిత ప్రజాపోరాటాల్లో స్వయంగాపాల్గొని ఎన్నోబాధలు అనుభవించాడు ఆయన. కమ్యూన్‌రోజుల్లో ఆయన ఒక కమ్యూన్ సభ్యుడిగా ఎన్నుకోబడ్డాడు. అనేక కమ్యూన్ కార్యక్రమాలలో మిలిటెంట్‌గా పని చేశారు. కమ్యూన్ పతనంలో ఆయన కుటుంబం చెల్లాచెదరై పోయింది. ఆసమయంలో ఆయన అనేకకష్టాలకు గురయ్యాడు. ఆ బాధల్లో ఆయన కలం పదునెక్కింది కాబట్టే "ఇంటర్నేషనల్" గేయాన్ని అంత ఆవేశంగా రచించగలిగారు.

పొటియర్ "అంతర్జాతీయ గీతంద్వారా" "సకలదేశాల కార్మికులారా ఏకం కండి" అనే మార్క్స్ - ఎంగెల్సుల పిలుపుకి విశేషమైన ప్రచారాన్ని యిచ్చాడు. ఎందుకంటే శ్రామికవర్గ అంతర్జాతీయత ప్రపంచ సోషలిస్టు విప్లవవిజయానికి వెన్నెముకలాంటిది. కాబట్టి పొటియర్ ఇంటర్నేషనల్ గీతంలో యిలా అన్నారు- "అంతర్జాతీయ సంస్థయే, అశేష మానవకులమై పోవున్. ప్రధానమగు యీ పోరాటంలో పాల్గొన నందరు రారండోయ్". ఈ విషయాన్ని దృష్టిలోపెట్టుకొనే 'ఇంటర్నేషనల్ గీతం' గురించి ఎజినీపోత్యే 25వ వర్ధంతి వ్యాసంలో) లెనిన్ యిలా అన్నారు- "వర్గచైతన్యంగల కార్మికుడు ఏదేశంలో, ఎక్కడ నివసించవలసి వచ్చినా, భాషగాని స్నేహితులుగాని లేకపోయినా, తనదేశానికి చాలాదూరంగావుంటూ, తానెంత కొత్తవాణ్ణి అనుకొన్నా- 'అంతర్జాతీయ' గేయంలోని సుపరిచిత పల్లవిద్వారా అతనికి కామ్రేడ్స్, స్నేహితులు లభిస్తారు" (V. I. లెనిన్ "కార్మికవర్గ అంతర్జాతీయత" పేజీ, 60).

యూజిన్ పొటియర్ ఒక నిరుపేదకుటుంబంలో 1816, అక్టోబర్ 4న జన్మించాడు. ఆయన జన్మించిన నాటినుంచి చనిపోయేవరకు పేదరికం అనుభవిస్తూనే వున్నారు. సామాన్యుడిగా కూలిపనిచేసుకొని కుటుంబాన్ని పోషించేవాడు పొటియర్. పేదరికం ఆయనకు సామాజిక స్పృహనుకలిగించింది. చాలా చిన్నవయస్సులోనే (14 సం॥లు) ఆయన ప్రథమగేయం రచించాడు. ఆయన తన గేయాలద్వారా కార్మిక విప్లవవిజయం తథ్యం అనేనమ్మకాన్ని కలిగించేవారు. 1876లో అమెరికాలో ప్రవాస జీవితం గడుపుతూ రాసిన మరోగేయం "ఫ్రెంచికార్మికులకు అమెరికన్ కార్మికులు చెప్పేది". ఇది పొటియర్ రాసినగేయాల్లో ఇంటర్నేషనల్ గీతం తరువాత చాలా ముఖ్యమైనగేయం. ఎందుకంటే, కమ్యూన్ ప్రభుత్వం పడిపోయి ఫ్రెంచి కార్మికులు నిరాశ, నిస్పృహలకు లోనయివున్నప్పుడు, వారిలో విప్లవోత్తేజాన్ని, విశ్వాసాన్ని కలిగించడానికీ, విప్లవోన్ముఖులను చేయడానికి అమెరికన్ కార్మికులచేత ఫ్రెంచి కార్మికులకు సందేశాన్ని యిప్పిస్తాడు యీ గేయంలో. పొటియర్ 'ఇంటర్నేషనల్' గేయం ప్రపంచ భాషలన్నిటిలోకి అనువదించబడింది. 'మే' దినోత్సవంరోజు ప్రపంచ ప్రజలందరూ యీ గేయాన్ని విప్లవోత్తేజంతో పాడుకొంటారు. (ఈ గేయాన్ని బి. నళినీ కాంతరావు మొదటిసారి తెలుగులో అనువాదం చేశారు.) పూర్తి అనువాదగేయం కావాల్సినవారు సి. వి. రచించిన 'పారిస్ కమ్యూన్' వచన కవితా మహాకావ్యాన్ని చూడవచ్చు.

పొటియర్ వర్ధంతిని నవంబర్ 8వ తేదీన ప్రపంచ ప్రజలందరూ జరుపుకొంటారు. శ్రామికవర్గ శ్రేయోభిలాషిగా, గేయరచయితగా ప్రపంచ పీడితప్రజల ఐక్యతకోసం ఆయన కన్నకలలు నిజంకావాలని, దోపిడీ దౌర్జన్యంలేని సమాజం నిర్మిస్తామని. సకలదేశాలలోని కార్మికవర్గం వారిశ్రేయోభిలాషులు దీక్ష తీసుకొంటారు ఆయన చనిపోయేవరకు ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీలో, సభ్యుడిగావుంటూ విప్లవ సాహితీ యోధునిగా మరణించారు. ఆయన మరణించినా ఆయన వదిలివెళ్ళిన విప్లవ సాహితీ వారసత్వం ప్రపంచ పీడితప్రజల హృదయాల్లో విస్మరించలేనిస్థానాన్ని పొందింది. ఆయనగేయాలన్నీకలిపి 'రివల్యూషనరీ సాంగ్స్' (విప్లవగేయాల) పేరుతో 2 వాల్యూముల్లో వచ్చినాయి. ఆయన రచించిన అంతర్జాతీయగేయం ప్రజాసాహితీ-సాంస్కృతికోద్యమాల్లో పనిచేసే కార్యకర్తలకు నిజంగా ఒక ప్రేరణ.

— టి. రవిచంద్

విషాద స్వేచ్ఛ

నజీం హిక్మత్

నువ్వు నీ కళ్ళచూపునంతా వృధాచేసుకుంటావు
నువ్వు నీ చేతుల సౌకుమార్యపు మెరుపునంతా
వృధాచేసుకుంటావు
డజన్ల కొద్ది రొట్టెల పిండిని పిసుకుతూ
ఒక్కముక్కను కూడా చవిచూడలేవు
ఇతరులకు బానిసగా వుండే స్వేచ్ఛ నీకుంది
ధనవంతుల్ని మరింత ధనవంతుల్నిచేసే స్వేచ్ఛ నీకుంది

నీ బతుకంతా నిను వెంటాడే అబద్ధాల్ని సృష్టించేమరల్ని
నువ్వు పుట్టిందే ఆలస్యం వాళ్ళు నీ చుట్టూ అమరుస్తారు
తల పట్టుకొని
నువ్వు నీ మహత్తర స్వేచ్ఛలో ఆలోచిస్తూనేవుంటావు
స్వేచ్ఛగా ఆలోచించే స్వేచ్ఛ నీకుంది

నీ తలేమో మూపువరకూ నరికేయబడ్డంతగా
వంగిపోయి వున్నప్పుడు
నీ చేతులు మాత్రం
పొడుగ్గా, వేలాడుతూ వుంటాయి
నీ మహత్తర స్వేచ్ఛలో నువ్వు తారట్లాడుతూవుంటావు
నిరుద్యోగాన్ననుభవించే స్వేచ్ఛ నీకుఉంది

నువ్వు నీదేశాన్ని
ఆత్మీయంగా, అన్నిటికంటె విలువైందిగా ప్రేమిస్తావు
కాని
ఒకానొక రోజు
బహుశా వాళ్ళు నీ దేశాన్ని అమెరికాకు పణంగా పెడుతారు
నీ మహత్తర స్వేచ్ఛతోపాటు నిన్ను కూడా........
విమాన (విదేశానికి) స్థావరంగా మారే స్వేచ్ఛ నీకుంది

మనిషి పనిముట్టుగానో, సంఖ్యగానో, గొలుసుగానో కాక
మనిషిగా బతకాలని

నువు ప్రకటిస్తావు
తక్షణమే వాళ్ళు నీ చేతులకు సంకెళ్ళు బిగిస్తారు
నీకు నిర్బంధించబడే స్వేచ్ఛవుంది
నీకు జైల్లో పెట్టబడే స్వేచ్ఛవుంది
నీకు ఉరితీయబడడానికి కూడా స్వేచ్ఛ వుంది
నీ బతుకు చుట్టూ వున్నది

ఇనుపతెర కాదు
చెక్కల కటకటాలు కాదు
మేలి ముసుగూ కాదు
నీకు స్వేచ్ఛను కోరుకోవాల్సిన అవసరమేలేదు
నీకు స్వేచ్ఛ వుంది
కానీ
విశాల వినీలాకాశంకింది ఈ స్వేచ్ఛ
ఎంత విషాదకరమైంది :

[నజీం హిక్మత్ 1902లో టర్కీలో జన్మించాడు. 1924లో టర్కీ కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. మాస్కోలో చదువుకున్నాడు. 1928 లో నిర్బంధించబడ్డాడు. 1933 లో తిరిగి నిర్బంధించబడ్డాడు. 1938 లో సైన్యాన్ని రెచ్చగొట్టినందుకుగాను 35 సంవత్సరాల జైలుశిక్ష విధించబడింది. 17 సంవత్సరాల సుదీర్ఘ కారాగారవాసం తర్వాత ఖైదీలందరితోపాటు విడుదల అయ్యాడు. 1963 లో మరణించాడు.]

అక్షరాలు

కె. శివకుమార్

అక్షరాలు
ప్రేయసి తలలో మల్లెలుగా బందీలై పోవడమేమిటి ?
ఆ మల్లెలపై తుమ్మెదలై ముసరడమేమిటి ?

చెమట చుక్కలుగా
కష్టజీవి ఒంటిమీద పుడతాయి అక్షరాలు
శత్రువు తూటా చీల్చిన గుండెల్లోంచి

బొట్లు బొట్లుగా రాలిపడి
మట్టిని తడుపుతాయి అక్షరాలు
చాళ్ల చాళ్లగా దున్నబడిన బీడుభూమినుంచి
పెళ్ళలు పెళ్ళలుగా లేస్తాయి అక్షరాలు
విత్తనాన్నీ మట్టినీ చీల్చుకొచ్చి
స్వేచ్ఛగా గాలిలో
రెక్కలార్పుతుంటాయి అక్షరాలు

అక్షరాలు నక్సల్బరీలై
అక్షరాలు శ్రీకాకుళాలై
అక్షరాలు ఇంద్రవెల్లులై
మంచుకొండల్ని జీవనదులుగా
లాంగ్ మార్చ్‌లో నడిచి నడిపించి
ఉప్పొంగే సముద్రం అలలతోపాటు
లాల్ సలాములు చేస్తాయి
ఏ అక్షరం పోరాటం కాదో
అది నాది కాదు

పల్లవి

పి. యస్. ఆర్. మూర్తి

పాడుబడ్డ గుడిమీద
పాడుతున్న ఆకలికోకిల జీర్ణస్వరంనించి
పాము కడుపులో కలిసిపోతున్న
కప్ప గొంతుకనించి
కారడవులమీంచి ప్రవహిస్తున్న
కదుష్ట జలంనించి
వ్యథాభరితహృదయాల్లో
గింగురుమంటున్న నిశ్శబ్దంలోంచి
ఆత్మహత్యకు సిద్ధమౌతున్న
అణగారిన అతివహృదిలోంచి
జాతిజీవనాడిలో కొత్తగా
ప్రవహిస్తున్న భావాలలావాలోంచి
నిరాశతో, నిద్రమత్తుతో
తూగుతున్న జనసమూహాన్ని
తట్టిలేపుతున్న వేడివేళ్ళలోంచి
త్యాగాలసుదీర్ఘరస్తాను
ప్రాణాహుతుల సుందరవృక్షాలతో
అలంకరిస్తున్న నిస్వార్థ పరుల్నించి
మానవుణ్ణి సర్వశక్తి మంతంగా
సకలజీవ రంజకంగా
తీర్చిదిద్దే మనోహర
భౌతికాదర్శంనించి
నా పాటకు పల్లవి
నీ రక్తంతో స్పందిస్తోంది

సిరంజాయుధం

యన్నంరెడ్డి వెంకటరెడ్డి

వేళ్ళు అరచేతిలోకి
అరచేయి మణికట్టులోకి
గడి పోయి
సొట్ట సిలవరు చెంబుతో
సొట్ట చేత్తోకొడుక్కి నీళ్ళు తాగిస్తూ
ఆ తాగిన తృప్తితో ఊపిర్ని పీలుస్తూ
జీవంలేని కళ్ళు కరిగి నీళ్ళయి
చెంబులోదూకి, కడుపులోకి పారతాయి।
ఆ కళ్ళ తృప్తితో కడుపునిండుతుంది
– ఆ తల్లికి।
ఈ వ్యవస్థకు పట్టిన భయంకరమైన జబ్బులా
ఆ తల్లి శరీరాన్ని ఆణువణువూ తినేస్తోన్నా
ఆ చేతినే మృదువుగా తాకుతూ, నాకుతూ
– ఆ పిల్ల।
ఆ తల్లినుండి కారే రసిని కసిగా పీల్చేస్తూ
ఈగలు– ఈగలు– ఈగలు– దుష్ట ఈగలు।
ఆ జబ్బింకా ముదరకముందే
ఆ తల్లికి ట్రీట్‌మెంట్ చేయండి
ఆ జబ్బింకా సోకకముందే
ఆ పిల్లకి రక్షణ కల్పించండి
కాలాన్ని తినేస్తూ సోమరిలా కూర్చుంచే
ఫలితాలు శూన్యంలో వుంటాయి
కనుకే
సామాజికశాలలో ప్రయోగాలు జరపండి
జరిపి–
దేశానికి వెన్నెముకయిన పల్లెల్లోకి
అడవుల నరాల మూలల్లోకి పోయేలా
సిరంజాయుధంలోకి మందును దట్టించి
దుష్ట తల్లికి పట్టిన విషక్రిముల్ని
నాశనం చేయండి।

చర్చ:

సాహిత్యం మార్క్సిజం

త్రిపురనేనిని విమర్శిస్తూ రాసిన వ్యాసానికి సమాధానంగా కె. బి., సి. రా. గారలు రాసిన వ్యాసాలకు సురేంద్రరాజుగారు రాసిన జవాబులు చదివి ఈ ఉత్తరం రాస్తున్నాను.

1 "క్షీణసాహిత్యాన్ని సృష్టిస్తున్న రచయిత క్షీణ విలువల్ని ప్రతిబింబిస్తున్నాదే తప్ప వాటిని కాపాడాలనుకోవడం లేదు. ఆ విలువల్ని భద్రపరచాలను కోవడం లేదు. ఆ రచయితలు వాళ్లు చిత్రించే వాస్తవాన్ని వాంఛిస్తున్నారనే భ్రమల్లో ఉండటంవల్లనే మార్క్సిస్టులు క్షీణ సాహిత్యాన్ని విమర్శించటం జరిగింది"

ఈ కోవకుచెందిన రచయితలలో కొందరు unconscious గా క్షీణసాహిత్యాన్ని సృష్టించవచ్చు. ప్రజలను ఈలాంటి సాహిత్యం గొప్పదనుకునే భ్రమలోంచిబయటకు తేవడం అవసరం కాబట్టి విమర్శించక తప్పదు. మరి ఈ కోవకుచెందిన రచయితలందరూ unconscious గానే రాస్తున్నారా? అదేమీకాదు- conscious గా చేసే రచయితలున్నారన్న సంగతి సురేంద్రరాజుగారు తెలుసుకోవాలి.

2 "భౌతికావసరాల పరిధిలో జీవించే మనిషి కళల్ని ఆనందించలేడని, భౌతికావశ్యకత నుండి స్వేచ్ఛ పొందినప్పుడు మాత్రమే మనిషిలోని కళాకారుడు స్వేచ్ఛగా బహిర్గతుడౌతాడని వేనన్న దాని...."

భౌతికావసరాల పరిధిలో జీవించే మనిషి కళల్ని ఆనందించలేడనుకోవడం పొరపాటు. "ఏటి కేతంబట్టి ఎయిపుట్లు పండించి ఎన్నడూ మెతుకెరుగరన్నా.... నేను గంజిలో మెతుకెరుగరన్నా" ఈ పాట భౌతికావసరాల పరిధిలోనిది కాదా? లేక పాట (కళ) కాదా?

3 "సాహిత్యాన్ని ఆనందించగల సంస్కారం, మానసిక పరిణతి జీవితంపట్ల ప్రగాఢమైన ప్రేమ, సాహిత్యాన్ని జీర్ణించుకోగల జీర్ణశక్తి, సాహిత్యంపట్ల తీవ్ర అనురక్తి వగైరా వగైరా ఉండాలని సాహిత్య యింద్రియాలంటే సాహిత్యానికి స్పృశించగల గ్రహణశక్తి, స్పందించగల జిజ్ఞాసగా అర్థంచేసుకోవాలి"

సురేంద్రరాజుగారు చెప్పిన ఈ సాహిత్య ఇంద్రియాలు సహజ ఇంద్రియాలకు అతీతమైనవా?

కానప్పుడు "సాహిత్య ఇంద్రియాలు" భౌతికావసరాల పరిధిలో ఏ మేరకు పరిణతి చెందినవో ఆస్థాయిలోనే కళాకారుడు కళను అందించగలిగినపుడు, అవి

పుస్తక స్వీకారం

1. అర్నాద్ కథలు : అర్నాద్, ప్రచురణ : కాళీపట్నం రామారావు [జూన్ 1981] పేజీలు 190 + iv, వెల రు. 10-00 ప్రతులకు : కాళీపట్నం రామారావు, రామ్‌నగర్, విశాఖపట్నం, 530 021

2. గోర్కీ-సాహిత్యం-1, నగరం అనువాదం: కేశవరెడ్డి, ఐక్యఉపాధ్యాయ ప్రచురణలు, విజయవాడ [ఆగస్టు 81] పేజీలు : 106 + iv, వెల : రు. 5-00, ప్రతులకు : ఐక్యఉపాధ్యాయ ప్రచురణలు, పాలపర్తి వారివీధి, విజయవాడ

3. ప్రజాసాహితి, సాహిత్యోద్యమ మాసపత్రిక, సంచిక 41, జులై, ఆగస్టు 81 తెలంగాణ పోరాట ప్రత్యేక సంచిక నిర్వహణ : జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య, ప్రతులకు : మేనేజర్, ప్రజాసాహితి, 29-12-13, వెంకటరత్నం స్ట్రీట్, సూర్యారావుపేట, విజయవాడ 520 002

4. దిక్సూచి, సాహిత్య కరపత్రిక, ఆగస్టు సంచిక నిర్వహణ : సాహితీమిత్రులు సిరిసిల్ల, పేజీలు : 8, వెల. 25 పైసలు, ప్రతులకు : 'దిక్సూచి', 1-2-63, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా 505 301.

5. ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర -1, కంభంపాటి సత్యనారాయణ, సంక్షిప్తానువాదం : మహీధర రామమోహనరావు, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ, (జులై 1981), పేజీలు : 256 + 6 + xxiv (ఆంధ్రదేశపటంతో) వెల : రు. 12-00, ప్రతులకు : హైదరాబాద్ బుక్‌ట్రస్టు, 3-6-6?4, హిమాయత్ నగర్, హైదరాబాద్ - 500 029.

సమీక్షకోసం పుస్తకాలు తప్పనిసరిగా రెండు కాపీలు పంపాలి.

ఆనందించలేవా ? ఉదాహరణకు గద్దర్ పాటలు తీసుకుంటే, భౌతికావసరాల పరిధిలో జీవించే ఎందరో విని ఆనందిస్తున్నారుకదా ? వాళ్లకు సురేంద్రరాజుగారి "సాహిత్య ఇంద్రియాలు" ప్రత్యేకంగా ఉన్నాయన్న గ్యారంటీ ఏమీ లేదు.

సురేంద్రరాజుగారు మార్క్సిస్టులు, మార్క్సిస్టులు అంటూ మరి మరీ ఎత్తి పొడవనక్కరలేదు. "పీడితజనుల వికాసానికీ, విజయానికీ దోహదంచేసేది మంచి దానికి హానికలిగించేది చెడు" అన్నది మార్క్సిస్టు విమర్శకులకి ప్రాతిపదిక అని తెలియకనా ? సురేంద్రరాజుగారు 'నేను మార్క్సిస్టును కాను' అని చెప్పుకుంటే సమంజసంగా ఉంటుంది.

— సత్యం

గ్రహణాల కథ

'సామాన్య పాఠకులకు అర్థమయ్యే సరళశైలిలో విజ్ఞాన శాస్త్రగ్రంథాలను ప్రచురించి ప్రచారం చెయ్యాల'నే ఆశయసాధనలో భాగంగా హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురించిన పుస్తకం యిది. ఆ దృష్టితోనే సమీక్షించడం సబబు.

శైలితో సమస్యలేదు. అది సరళమేగాదు, సరసంగూడ. కావాలనుకున్న వాళ్లకు కావలసినంత కవిత్వంవుంది, రసికత్వంవుంది, తత్వంవుంది; పిట్టకథలున్నాయి, చరిత్రవుంది, చమత్కారంవుంది, అసందర్భమయిన 'ఉభయభాషా' పాండిత్య ప్రదర్శనవుంది.

'సామాన్య పాఠకులకు' ఎంతవరకు ఉపయోగకరంగా వుంటుందన్నదేసమస్య. సామాన పాఠకులంటే సామాన్య విద్యావంతులని అర్థంచెప్పుకుందాం. అయితే మన దేశంలో సగటు విద్యావంతుడికేగాదు, 'నిపుణు'లకు గూడ పక్క సబ్జెక్టు గురించి ఏమీ తెలీదు. దీనికి బూర్జువా విద్యావిధానానికి ప్రాతిపదిక అయిన మేధోవిభజన ఒక కారణమయితే అర్థవలస సమాజానికి సహజమయిన పిరికితనం మరొకకారణం. ఎలెక్ట్రానిక్స్‌లో డాక్టరేటుడిగ్రీ వున్నవాడికి తన శరీరంలో కాలేయం ఒకటివుంటుందో రెండు వుంటాయోతెలీదు. ఒకటే వుంటే అది శరీరంలో ఎడమపక్కనుంటుందో కుడిపక్కనుంటుందో తెలీదు. ఈ విషయాలన్నీ తెలిసిన జీవశాస్త్రజ్ఞుడికి ధ్వనితరంగాలకు కాంతితరంగాలకు సముద్రతరంగాలకు తేడా తెలీదు. అంతేకాదు; ముఖ్యంగా ఖగోళశాస్త్రానికి సంబంధించి భౌతికశాస్త్రంలో పట్టభద్రులయిన వాళ్లకు గూడ వున్న పరిజ్ఞానం అంతంతమాత్రమే. ఇప్పుడు కొంత నయంగాని పదిసంవత్సరాలక్రితం డిగ్రీకోర్సు భౌతికశాస్త్రంలో ఖగోళశాస్త్రం కెప్లర్ సూత్రాలను దాటి వెళ్లేదికాదు.

ఈదృష్టితోచూస్తే పుస్తకంపూర్తిగా ప్రచురణకర్తల ఆశయాన్ని సాధిస్తుందనలేం. కొన్నివిషయాలు నళిని మోహన్ చెప్పవలసినంత వివరంగాను విపులంగాను చెప్పారుగాని మరికొన్ని విషయాలకు సంబంధించి అంతజాగ్రత్త తీసుకోలేదు. ఇంకొంచెం వివరంగా విమర్శిస్తే రచయితగూడ ఉపయోగకరంగా వుంటుందేమో.

పుస్తకంలో మొత్తం ఆరు అధ్యాయాలున్నాయి. వీటిలో మూడవది నాల్గవది ముఖ్యమయినవి. మొదటి రెండింటిలో కొంచెం చరిత్ర కొన్ని పిట్టకథలువున్నాయి. చరిత్రలో కాలనిర్ణయానికి సంబంధించి కొన్ని ఆసక్తికరమయిన విషయాలు చెప్పారు.

ప్రదేశంలో సంపూర్ణ సూర్యగ్రహణాలు విరివిగా కనిపించకపోవడంచేతా, ఏదయినా ఒక చారిత్రిక సన్నివేశం స్థూలంగా ఏకాలానికి చెందిందో తెలిస్తే, ఆ ఘట్టం జరిగినప్పుడు ఫలానాప్రదేశంలో సంపూర్ణ సూర్యగ్రహణం కనిపించినట్టుగూడతెలిస్తే, ఆ సన్నివేశం సరిగ్గా ఎప్పుడు జరిగిందో చెప్పవచ్చు.

అయితే ఈపని చేయగలగాలంటే గ్రహణాలక్రమాన్ని అర్థంచేసుకోవాలి. భూమీ చంద్రుడూ రెండూ కదిలిపోతూ వుండడంచేతా, పైగా వాటిపరిభ్రమణవేగాలు సమతలాలు స్థిరంగా వుండకపోవడంచేతా ఈక్రమం చాలా సంక్లిష్టమయినది. దీన్ని వివరించడానికి మూడవ అధ్యాయంలో ప్రయత్నంచేసాడు. ఆ ప్రయత్నమే చాల అసంతృప్తికరంగావుంది.

రచయిత చేసిన మొదటిపొరపాటు వివరణను కృత్రిమమయిన భూకేంద్ర సిద్ధాంతంపరంగా యివ్వడం. భూకేంద్రసిద్ధాంతం అశాస్త్రీయమన్నదికాదు నాఅభియోగం. అశాస్త్రీయమైనా వివరణాసౌలభ్యంకోసం - అటువంటి సౌలభ్యంగనకవుంటే - వాడుకోడవం తప్పుకాదు. కాని నిజానికి ఆ సౌలభ్యం లేదు.

సూర్యగ్రహణం పట్టడానికి కారణం చంద్రుడు భూమికి సూర్యుడికి మధ్య అడ్డురావడమనీ, చంద్రగ్రహణం పట్టడానికికారణం భూమి చంద్రుడికి సూర్యుడికి మధ్య అడ్డువచ్చి చంద్రుడిని సూర్యకాంతిని ప్రతిఫలించనీయకుండ చేయడమని, బహుశా సామాన్య విద్యావంతులందరికీ తెలిసేవుంటుంది. కాని కథయింతేఅయితే ప్రతిఅమావాస్యకూ సూర్యగ్రహణం. ప్రతి పున్నమికీ చంద్రగ్రహణం పట్టాలి. ఎందుచేతనంటే అమావాస్యనాడు చంద్రుడూ సూర్యుడూ భూమికి ఒకేప్రక్కన వుంటారు; పున్నమినాడు చెరొకపక్కవుంటారు. కాని అలాజరగదు. దీనికిగల కారణాల్ని భూకేంద్ర సిద్ధాంతంపరంగా రచయిత వివరించినతీరుఇది : సూర్యుడు భూమి చుట్టూ తిరిగేపథం ('కక్ష్య' అనేకంటే ఈమాటే సులువుగావుంది), చంద్రుడు భూమిచుట్టూ తిరిగేపథం, ఒకే సమతలంలోవుండవు. వాటి సమతలాలమధ్య 5 డిగ్రీల కోణంవుంటుంది. కాని రెండుపథాలకూ భూమే కేంద్రంకావడంవల్ల అవిరెండూ రెండు బిందువులదగ్గర ఖండించుకుంటాయి. ఈ బిందువులను 'పాతములు' అంటారు. సూర్య చంద్రులు ఈ పాతముల సమీపంలో వున్నప్పుడు మాత్రమే (అంటే ఆరునెలలకొకసారి) గ్రహణాలుపడతాయి. అంతేకాదు చంద్రుడి భూపరిభ్రమణపథం స్థిరంగా వుండక కదిలిపోతూవుంటుంది. దాదాపు 18 సంవత్సరాల వ్యవధిలో తిరిగి మొదటి స్థానానికి వస్తుంది. ఈ కదలికగూడ గ్రహణాలకు అనుకూలమయిన దిశలో వుండడం

చేత ఈ 18 సంవత్సరాలలో 36 గ్రహణాలు (ఆరునెలలకొకటిచొప్పున) పట్టవలసింది, 40 పడతాయి. 18 సంవత్సరాల తరువాతకథ మళ్ళీ మొదటికొస్తుంది.

నా అనుమానం ఏమిటంటే ఈ వివరణను పైపైన చదివి ఊరుకోక సంపూర్ణంగా అర్థంచేసుకోదలచుకున్న పాఠకుడు గందరగోళంలో పడతాడని. సూర్యుడి భూపరిభ్రమణపథం అంటే ఏమిటి, దానికి భూమియొక్క ఆత్మభ్రమణమూ లేక సూర్యపరిభ్రమణమూ కారణం; మరి అవాస్తవికమయిన ఈ సూర్యుడి భూపరిభ్రమణపథం, చంద్రుడి (వాస్తవికమయిన) భూపరిభ్రమణ పథం, ఖండించుకోవడమంటే ఏమిటి, ఈ లేని ఖండన బిందువులకు (పాతములకు) సూర్యుడు చంద్రుడు దగ్గరగా వుండడం అంటే ఏమిటి- ఈ ప్రశ్నలన్నీ సహజంగానే ఉదయిస్తాయి. సూర్యుడి భూపరిభ్రమణంగా మనకనిపించేది భూమి ఆత్మభ్రమణమనీ దానికీ గ్రహణాలకూ ఏరకమయిన సంబంధంలేదనీ గ్రహించగలగాలి; సూర్యుడి కక్ష్య చంద్రుడి కక్ష్య ఒకే సమతలంలో లేవంటే అర్థం, భూమి తాలూకు సూర్యపరిభ్రమణపథం చంద్రుడి భూపరిభ్రమణపథం ఒకే సమతలంలో లేకపోవడమని గ్రహించగలగాలి; సూర్యుడి కక్ష్య చంద్రుడి కక్ష్య ఆరునెలలకొకసారి ఖండించుకుంటాయంటే అర్థం పై రెండు కక్ష్యల సమతలాలఖండనరేఖ ఆరునెలలకొకసారి సూర్యుడి గుండా పోవడమని గ్రహించగలగాలి; ఇవన్నీ సామాన్య విద్యావంతులు- భౌతికశాస్త్రంలో పట్టభద్రుల్ని కలుపుకొని!- గ్రహించగలుగుతారని నాకు నమ్మకంలేదు. ఈపనేదో రచయితే పటాల సాయంతో చేసివుంటేబాగుండేది, కొన్ని పేజీలు అదనంగా రాయవలసివచ్చేదేమో; కాని పుస్తకంలోవున్న చాల అనవసరపు విషయాలను తొలగించివుండవచ్చు ఉదాహరణకు సాపేక్షసిద్ధాంతాన్ని గురించిన ఆరవ అధ్యాయం లేకుంటే ఏం నష్టం లేదు. అదెట్లాగూ ఎవ్వరికీ అర్థం కాదు. పోనీ ఆ భూకేంద్ర సిద్ధాంతాన్నయితే స్థిరంగా అనుసరించారా అంటే అదీలేదు. ఉదాహరణకి నళినీమోహన్ దేనినయినా సూర్యుడి 'భూప్రదక్షిణ' కాలం అన్నారో (పేజీ 45) అది నిజానికి సూర్యుడి 'భూప్రదక్షిణానికి' సంబంధించినదికాదు (భూకేంద్ర సిద్ధాంతం ప్రకారంగూడ). దానికి పట్టేకాలం ఒకరోజే. 365 రోజులు పట్టేది సూర్యుడు తన 'భూప్రదక్షిణ'లో ఒక కక్ష్యను వదిలిపెట్టి మళ్లీతిరిగి ఆ కక్ష్యను అదేదిక్కు నుండి చేరుకోవడానికి. మొత్తం మీద మూడవ అధ్యాయం కొంత అజాగ్రత్తగా రాసినట్లుంది.

నాలుగవ అధ్యాయంలో గ్రహణ క్రమాన్ని వదిలిపెట్టి గ్రహణాల రూపానికి, వ్యవధికి, గ్రహణసమయంలో కనిపించే వింతవిషయాలకు సంబంధించి ఆసక్తికర

మయిన సమాచారం అందజేసారు. సామాన్య విద్యావంతులకు అర్థమయ్యేరీతిలో, పటాలసాయంతో వివరించారు. సూర్యుడికి అరచేయి అడ్డంపెడితే సూర్యగ్రహణం పట్టంది చంద్రుడుఅడ్డంవస్తే ఎందుకుపడుతుందో, సూర్యుడికి మబ్బులడ్డంవస్తే నక్షత్రాలు కనబడవుగాని సంపూర్ణ సూర్యగ్రహణమవ్వుడు ఎందుకు కనబడతాయో, ఒక్కొక్కప్పుడు సంపూర్ణ సూర్యగ్రహణానికి బదులు 'అంగుళ్యాకార' గ్రహణం ఎందుకు కనబడుతుందో, ఇత్యాదివిషయాలను అందరికీ అర్థమయ్యేలాగా వివరించారు. ఈ జాగ్రత్త ముందు అధ్యాయంలోగూడ తీసుకునివుంటే బాగుండేది. అయిదవ అధ్యాయంలో ఇతర గ్రహాలకూ (వాటిపల్లా) పట్టేగ్రహణాలగురించి చాల ఆసక్తికరమయిన విషయాలుచెప్పారు. ఇక్కడగూడ తీసుకోవలసిన జాగ్రత్త తీసుకున్నారనేచెప్పాలి.

మొదటి రెండుఅధ్యాయాలలో చెప్పిన చారిత్రిక విషయాలకు సంబంధించి కొంత ఊహాగానం కొంత అతిశయోక్తి వుందని చెప్పాలి. ముఖ్యంగా మన పూర్వీకులయిన హైందవ ఖగోళ శాస్త్రజ్ఞుల పరిజ్ఞానానికి సంబంధించి నళినీమోహన్‌గారు కొంత జాగ్రత్తగా వ్యవహరించవలసింది. 'మన ఋషులకు అన్నీ తెలుసునంట' అనే మతిలేని అతిదేశభక్తి ప్రబలంగావున్న ఈ దేశంలో అటువంటిజాగ్రత్త చాల అవసరం. గ్రహణక్రమం గురించి గ్రహణశ్రేణులగురించి వాళ్లకు క్షుణ్ణంగాతెలుసుననడంలో అతిశయోక్తీ లేదు ఆశ్చర్యమూలేదు. ప్రాచీనకాలానికి చెందిన చెప్పుకోదగ్గ నాగరికత లన్నింటిలోను ఖగోళశాస్త్రపరిజ్ఞానం- గ్రహాల గమనక్రమానికి సంబంధించినంతవరకు- బాగా పరిణతిచెందింది. ఆర్యభట్టుగాని భాస్కరుడుగాని రాహుకేతువులకథను నమ్మలేదంటే విజంకావచ్చు. ముఖ్యంగా వాళ్లు సూర్యగ్రహణానికి గల కారణాన్ని అర్థంచేసుకున్నారని నమ్మవచ్చు- (కాని సూర్యకేంద్ర సిద్ధాంతం తెలియకుండ చంద్రగ్రహణానికిగల కారణం అర్థంకావాలంటే అంతసులువుకాదేమో?) అదెట్లావున్నా, వాళ్ళకు గ్రహణాలకు సంబంధించిన ఇతర మూఢనమ్మకాలు లేవా? లేవనడానికి ఆధారంవుందా? ఉన్నా, వాళ్ళదృష్టిలో రాహుకేతువులకథ కేవలం 'సాహిత్యానికి ఖగోళశాస్త్రానికి పెట్టినముడి' (పేజీ 12) మాత్రమేనా? 'పామరజనాన్ని అలరించడానికి 'తమాషాగా' సృష్టించిన కథమాత్రమేనా? ఇక్కడ కొంచెం సామాజికమయిన వివేచనకావాలి. వర్గసమాజాలకు- ముఖ్యంగా ఫ్యూడల్ సమాజాలకు- అజ్ఞానంవల్ల వున్నలాభాన్ని గుర్తించాలి; అట్టి సమాజాలలో మేధావులు తాము సగం అజ్ఞానులయితే తమకుతెలిసిన సగంగూడ ప్రజలకు చెప్పలేకపోవడానికి గల కారణాన్ని గుర్తించాలి; గుర్తిస్తే, తమకు ఎంతోకొంత వివరంగా తెలిసిన గ్రహణాల కథను

శాస్త్రీయంగా చెప్పకుండ పురాణాలతో జతచేయడం 'ఒక ముచ్చట, ఒక శిల్పం, ఒక చమత్కారం' (పేజీ 91) మాత్రమే కాదని అర్థంచేసుకోవచ్చు. సామాజిక శాస్త్ర వేత్తకు గ్రహణాల కథ తెలియక పోవడం ఎంతశోచనీయమో, ఖగోళ శాస్త్రజ్ఞుడికి చరిత్రలో కేవలం చమత్కారం కనిపించడం అంతే శోచనీయం.

అలాగే ఆర్యభట్టు వగైరాల 'ఖగోళ గణితం పరాకాష్ఠనందుకుంది' అనడం హాస్యాస్పదం. ప్రాచీన హైందవ గణితశాస్త్రవేత్తలు, అరబ్బులు, గణకం (calculation) లో అద్భుతమయిన ప్రావీణ్యం గలవారేగాని గణితం (mathematics) లో కాదు. ఆప్రావీణ్యం ఒక్క గ్రీకులకే ఉండేది. నిర్దిష్టమయిన సమస్యలను నిర్దిష్టంగా పరిష్కరించడంలో మన వారికి మనవారే సాటిగాని అనిర్దిష్టమయిన (abstract) ఆలోచనాసామర్థ్యం వారికి తక్కువ. వారి 'ఖగోళ గణితం' గూడ అటువంటిదే. గ్రహగమనక్రమాలను గ్రహణక్రమాలను గుర్తించారు, తమ జ్యోతిశ్శాస్త్రం అనబడే మౌఢ్యానికి వాడుకున్నారు, కాని తమకంటె చాలప్రాచీనులయిన టాలెమీ వంటి గ్రీకులతో సమానంగా ఖగోళ నిర్మాణానికి సంబంధించి సిద్ధాంతాలు చేయలేకపోయారు.

మొత్తంమీద ఇది అందరూగూడ చదవడానికి ప్రయత్నం చేయదగ్గపుస్తకం. మూడవ అధ్యాయం కొరుకుడు పడకపోతే డీలాపడకుండ నాలుగు అయిదు చదవండి; అర్థమవుతాయి.

అచ్చుతప్పులు అంతగాపున్నట్లులేవు. ఒకచోట 'ఆకాశం' బదులు 'అవకాశం' అనిపడింది (పేజీ 125). మరొకచోట 'గణించడం' అనడానికి బదులు 'గుణించడం' అన్నారు (పేజీ 91). మొదటిది అచ్చుతప్పేకావాలిగాని రెండవది రచయితపొరబాటు కావచ్చు.

తిరుపతిలోవున్న యూనివర్సిటీ పేరు తిరుపతి యూనివర్సిటీ కాదని నళినీ మోహన్‌గారికి ఎవరయినా చెప్పివుంటే బాగుండేది.

— బాలగోపాల్

గ్రహణాల కథ - డాక్టర్ మహీధర నళినీమోహన్, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ, [జూన్ 1981], పేజీలు. 150 + vi, వెల రు. 7-00, ప్రతులకు : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, 3-6-694, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.

కొ. కు. ను తిరిగి తెలుసుకోవడానికి...

మురా

మట్టిచేతులు నిన్ను మేధావిగామలిస్తే
ఆ చేతులుకట్టిన రక్తగాయాలతో
నువ్వెవరిపై గేయాలు కట్టావని అడుగు.

సమాజఉత్పత్తిని, గతిని, ప్రగతిని నిర్దేశించే శ్రామికులే పరోక్షంగా నయినా మేధోకార్యకలాపాలకు దోహదంచేస్తున్నారనే ప్రాథమికసత్యాన్ని గుర్తిస్తే మనకు తట్టాల్సిన మొదటిప్రశ్న మరి ఈ మేధస్సుకి ఆ ప్రజానీక ప్రయోజనాలకు ఎలాంటి సంబంధం ఉండాలన్నదే. పదకొండేళ్ళవయసులో తెనాలిలో సహాయ నిరాకరణోద్యమం నయిప్పకి ఆకర్షితుడయినప్పటినుంచి, డెబ్బయి రెండవఏట విప్లవ సాహిత్యం గురించి ఆలోచనలను రేకెత్తిస్తూ మరణించేదాకా కొడవటిగంటి కుటుంబ రావు జీవితంఅంతా ఈ సంబంధాన్ని పరిశోధిస్తూ అన్వేషిస్తూ సాగినదే. ఈ ఆరు దశాబ్దాల అన్వేషణ నిరంతరమయినదే అయినా ఒడుదొడుకులు లేనిదికాదు. మొదట్లో అసంకల్పితంగా. తర్వాతకాలంలో చైతన్యపూరితంగా కొ. కు. సాగించిన ఈ అన్వేషణలో చెప్పుకోదగ్గ మైలురాళ్ళు- స్వాతంత్ర్యోద్యమం, రెండవ ప్రపంచయుద్ధం తెలంగాణపోరాటం / అభ్యుదయ సాహిత్యోద్యమం, నక్సల్బరీఉద్యమం / విప్లవ సాహిత్యోద్యమం. ఈ మైలురాళ్ళు కొ.కు. కే కాక మన చరిత్రకుకూడా మైలురాళ్ళు కావడమే కొ. కు. ని అర్థంచేసుకొ ప్రయత్నించడం మనల్నిమనం అర్థంచేసుకోవడంలో భాగంచేస్తుంది- ఆ మైలురాళ్ళు మార్పుకి సూచికలయినంతమేరకు, ఈ ప్రయత్నంకూడా మార్పుకొసమే.

స్థూలంగాచెప్పుకోవాలంటే శ్రమకి - మేధస్సుకి, జ్ఞానానికి- ఆచరణకుమధ్య సంబంధాన్ని అన్వేషిస్తూ సాగిన కొ.కు. రచనా వ్యాసంగంఅంతా మానవుడు- ప్రకృతి సమాజం మధ్యగల సంబంధాన్ని, వైరుధ్యాన్ని పరిశోధిస్తూసాగింది- అందుకే ఆయన ప్రశ్నించని రంగంఅంటూ ఏది మిగలలేదు- సాహిత్యం, సాహిత్యవిమర్శ, కళ, కళారూపాలు, చరిత్ర, రాజకీయాధికశాస్త్రం, శాస్త్రవిజ్ఞాన (ముఖ్యంగా భౌతిక శాస్త్రం), తత్వశాస్త్రం- అన్నింటిలోనూ ఆయన నిర్భయంగా ప్రవేశించాడు- ఈ ప్రవేశానికి తను ఎన్నుకున్న ప్రయోజనం శుద్ధఅకాడమికీ ఆసక్తికాదు, తన జీవనోపాధి అంతకన్నకాదు- ముందేచెప్పినట్టు మార్పుకోసం జరిగిన ప్రయత్నంఅది- అందుకే ఆయారంగాలలో పరిచయాన్ని (కొన్నిరంగాలలో చెప్పుకోదగ్గ పాండి

త్యాన్ని) అలవరచుకొనడంకూడా ఆయన ఆ జ్ఞానం, ఆ పాండిత్యం లేనివాళ్ళకు కూడా ఆ విషయాలు అర్థమయ్యేలా విశదీకరించడంకోసమే చేసాడు. ఆయన రచనా పద్ధతిలో ఉండే సౌలభ్యానికి అదేకారణం. తెలుగు సంస్కృతి సాహిత్యాలలో ఆయన పాత్రను అంచనావేసేముందు ఈ మేధోపరిణామక్రమాన్ని దాని సంపూర్ణతను (Comprehensive totality of evolution as an intellectwal)దృష్టిలో పెట్టుకోవడం అవసరం. అయితే తెలుగు సంస్కృతికి ఆయన చేసిన సేవను అంచనావేసే సాహసం ఈ రచయితకులేదు. ప్రస్తుత ప్రయత్నం ఆయననుగురించి వాడుకలోఉన్న కొన్ని అభిప్రాయాలను, ధోరణులను చర్చించడానికి ఉద్దేశ్యించింది. 'జ్ఞానం మన అజ్ఞానం గురించి మనం తెలుసుకునే క్రమం (Education in the progressive rediscovery of ignorance- Will Durent) అయితే కొ. కు. గురించి మన అజ్ఞానాన్ని మనం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతయినాఉంది.

కొ. కు. గురించి చెలామణిలో ఉన్న మొదటిధోరణి ఆయన్ని కొన్ని సాహిత్య ప్రక్రియలకు, ఆ ప్రక్రియలలో ఆయన ప్రతిభకు కుదించివేయడం. కథాకారుడిగా కొ కు, నవలాకారుడిగా కొ కు వగయిరా విభజనలనుచేసి ఆయా ప్రక్రియలలో ఇతరులతో ఆయన్ని పోల్చి, తద్వారా ఆయన్ని అంచనావేయడం ఈ ధోరణిలక్షణం. ఈ ధోరణి గుర్తించలేకపోయిన విషయం ఒకటుంది. రచనా బాల్య దశను వదిలేస్తే, ఆయనకథలు, నవలలు తనెరిగిన జీవిత వాస్తవికతను విశ్లేషిస్తూ పాఠకులముందుంచడమే ప్రయోజనంగాగలవి. ఆ రకంగా కథ, నవలా, సాంఘిక వాస్తవికతకు భాష్యంచెప్పడానికి ఆయన ఎన్నుకున్న సాధనాలుమాత్రమే. వర్తమాన సమాజానికి విమర్శనాత్మకంగా ప్రతిస్పందించే మేధావిగా ఆయన ఆ ప్రతిస్పందనను వ్యక్తంచేయడానికి కథను, నవలను వాహికగా వాడుకొన్నాడు. తనకున్న జీవిత పరిజ్ఞానపరిధిలో ఆ వాహికలు పనికిరావని అనుకున్ననాడు వాటిని వదిలేసాడు. అందుకే కథకుడు, నవలాకారుడు, వ్యాసకర్త, శాస్త్రవేత్త అంటూ ఆయన్ని విభజించి విశ్లేషించే పద్ధతి ఆయన తాత్వికచింతనను అర్థంచేసుకోవడానికి పనికిరాకుండా పోతోంది.

కొ. కు, గురించిన రెండవధోరణి ఆయన రచనలను సాహిత్యోద్యమంతో ఆయనకున్న సజీవ సంబంధం నుండి వేరుచేసి చూసేధోరణి. నవ్యసాహిత్య పరిషత్ నుండి విప్లవ రచయితల సంఘం దాకా, మధ్యలో కొంతకాలం మినహాయించి ఆయన ఎప్పుడూ ఏదో ఒక ఉద్యమంతో నడుస్తూనే వచ్చాడు. (ఆ మధ్య కాలంలో అయినా చెప్పుకోదగ్గ సాహిత్యోద్యమాలేమున్నాయని!). సమాజంలో ఉండే వర్గ సంఘర్షణ మన సాహిత్యంలో చాలాకాలం నుండే ప్రతిఫలిస్తూ వస్తోందని ఇవ్వాళ సాహిత్య చరిత్రకారులు చెప్పగల్గుతున్నారు. శతాబ్దాల ఈ భావవర్గ సంఘర్షణకు ఇరవయ్యో శతాబ్దం కొత్తమలుపు. ఒక వయిపు పెట్టుబడి తెలుగు సాహిత్యంలో ప్రవేశించిదాన్ని

అమ్మకపు వస్తువుగా కూడా మార్చిన క్రమం మొదలయింది. మరోవయిపు భావ సంఘర్షణ సంస్థాగతరూపాన్ని, ఉద్యమరూపాన్ని తీసుకోవడం మొదలయింది. (పోతన వేమన ఏ రచయితల సంఘంలోను సభ్యులుకావు గదా!). ఈ పరిణామాలు ఉద్యమంలో పాల్గొనకుండా భావ సంఘర్షణలో పాల్గొనడాన్ని అసాధ్యం చేసాయి. (చివరికి గుంటూరు శేషేంద్రశర్మ కూడా 'ఉద్యమ రూపం'లోనే గదా తెలుగు సాహిత్యం మీద గొరిల్లా పోరాటం చేస్తున్నాడు). అందుకే కొ.కు ఈ ఉద్యమాల ద్వారా తన భావ పరిణామక్రమాన్ని సమాజ సంఘర్షణతో ముడివేసుకున్నాడు ఈ ఉద్యమాలే ఆయన భావాలకి ముడిసరుకులు, ఆయన శిల్పసౌలభ్యతకు పదును. తద్వారా ఆయన 'సృష్టించిన' సాహిత్యం తిరిగి ఆ ఉద్యమాలకు బలంపోసింది. ఉద్యమం నుండి మళ్ళీ ఉద్యమం చేరుకునే ఈ క్రమం నుండి ఆయన రచనలను విడదీసి చూడటం వాటి వర్తమాన ప్రాముఖ్యతను సారాంశాన్ని నిరాకరించడమే.

కొ.కు గురించి వాడుకలో ఉన్న మూడో ధోరణి మార్క్సిజంపట్ల ఆయనకున్న దృక్పథానికి సంబంధించింది. అన్నిటికన్నా వివాదస్పదమయిన ఈ ధోరణిలో కొందరు మార్క్సిస్టులు కూడా ఉన్నారు. కొ.కు. మార్క్సిజంలో ఉన్న శాస్త్రీయ పద్ధతిని All Science is superflous, if appearnace coinside with essenee Karl Marx, Capital - III మాత్రమే స్వీకరించి ఇతరత్రామార్క్సిజంతో గుర్తింపబడే నమ్మకాలు, అభిప్రాయాలు వదిలేసినట్టు అన్పిస్తుంది. వదిలేసాడంటే నిరాకరించలేదు, మార్క్సిస్టు పద్ధతిద్వారా వాటి వాస్తవికతను, ఆచరణాత్మకతను తనంత తాను అంచనావేయ ప్రయత్నించాడు. చరిత్రను, వర్తమాన సమాజాన్ని నైసర్గిక భౌతిక ప్రపంచాన్ని ప్రమాణంగా తీసుకొని తన పద్ధతిని పదును పెట్టుకున్నాడు తను పరిశోధించి నిర్ణయానికి రాకుండా ఆయన ఏవ్యాసం రాసినట్టు ఆధారాలులేవు (ఉత్తరాలలో మాత్రం పరిశోధన లేకుండానే రాస్తున్నట్టు గుర్తిస్తూ వాటిని ప్రచురించవద్దని ఆయన విజ్ఞప్తి చేసేవారు) ఆపద్ధతిననుసరిస్తూ ఆయన కొన్ని తప్పుడు సూత్రీకరణలు చేసినా శాస్త్రీయమైన పద్ధతినొకదానిని సాధన చేయప్రయత్నించడం మార్క్సిస్టుగా ఆయన విలక్షణత, ఆయనలో ఉండే ఈ విలక్షణత అనేక దురభిప్రాయాలకి ఆస్కారం ఇచ్చింది. చరిత్రను, వర్తమాన సమాజాన్ని ప్రమాణంగా తీసుకునే రచయిత ఆ చరిత్రతోను, వాస్తవికతతోనూ పేచీలేని వాళ్ళకు మార్క్సిస్టేతర మేధావిగా కన్పిస్తాడు తెలుగు సాహిత్యంలో ఆయనకుండే స్థానాన్ని నిరాకరించలేని కొందరు కమ్యూనిస్టు వ్యతిరేక పెద్దమనుషులు ఈ కోవలోనే ఆయనలో ఉండే మార్క్సిస్టుని పక్కకునెట్టి, అదేదో ఆయనకు అప్పుడప్పుడు పట్టే భూతంలా తోసిపారేస్తుంటారు. మరోవయిపు

ఆయన సాధన చేసిన ఈ పద్ధతిని గ్రహించలేని కొందరు మార్క్సిస్టులు కూడా ఆయనను తప్పుపట్టారు. పరిశోధించకుండా వాళ్ళు ఏర్పరుచుకున్న అభిప్రాయాల్ని, ఆయన ఇంకా పరిశోధిస్తుంటే ఆయన, మార్క్సిజానికి విరుద్ధంగా పోతున్నట్టు భావించి బాధ పడిపోయారు. చివరి రోజులలో ప్రజాభిప్రాయాంపై, పునాది, ఉపరితలం సంబంధాలపై, బుద్ధికొలతపై ఆయన వ్యాసాన్ని విమర్శించిన కొంతమంది మార్క్సిస్టులు ఈ కోవకు చెందినవాళ్ళే ముందు ఆయన పద్ధతిగురించి ప్రాథమికమయిన జ్ఞానం కూడా లేకుండా ఆయన అభిప్రాయాలపై ఆరోపణలు చేయడం ఆయన తాత్వికచింతనను అర్థంచేసుకోవడానికి పనికిరాదు. ఈ ధోరణులలో ఉన్న బలహీనతను గుర్తించడం తెలుగు సంస్కృతికి ఆయన చేసిన సేవను గుర్తించడానికి మొదటిమెట్టు.

కొ. కు. గురించి మరోవిషయం ఈ సందర్భంలో మనం గుర్తించాలి. అది ప్రజామేధావిగా ఆయన విలువలు. మద్రాసులో ఉంటూకూడా సినిమా సంస్కృతికి లొంగని ఏకైక తెలుగురచయిత ఆయన. షష్టిపూర్తిసన్మానాలు, ఫౌండేషన్ అవార్డులు ఆయన ఎన్నడూ స్వీకరించలేదు. (సాహిత్య అకాడమి బహుమతిపొందిన సందర్భంలో 'తార' నవలకు ఆయన రాసినముందుమాట చూడండి). తనకెంతో సన్నిహితమయిన చందమామతోనూ, చక్రపాణితోనూ అభిప్రాయభేదాలు వచ్చినప్పుడుకూడా రాజీనామా చేయడానికి సిద్ధపడ్డాడుగాని, రాజీపడటానికి సిద్ధపడలేదు. రచనలలో ప్రతిఫలించే విలువలను తన వ్యక్తిగత జీవితంలోకూడా ఆచరించడానికి, కాపాడుకోడానికి ఆయన చైతన్యపూరితంగా ప్రయత్నించినట్టు కన్పిస్తుంది. ఆధునిక తెలుగు రచయితలలో ఇది అరుదయిన విషయం.

చివరిగా కొ కు గురించి ఎప్పుడూ ఆశ్చర్యంగా మిగిలిపోయే విషయంగురించి చెప్పుకోవాలి. నాలుగు దశాబ్దాలుపైగా సాహిత్యోద్యమాలతో ఉద్యమ సాహిత్యంతో సన్నిహిత సంబంధాలుపెట్టుకున్న తెలుగు సాహిత్యంలో ఆయన్నిమించిన ఒంటరివాడు లేడు. ఆయనకున్న విషయపరిజ్ఞానం, పరిధి, లోతు మరెవ్వరికీ ఉన్నట్టుతోచదు. ఆయన ఎంతోసులభంగా విశదీకరిస్తూ రాసినవిషయాలు పాఠకులకు అదే మొదటిసారి తెలుసుకోవడం, అందుకే చాలారంగాలలో ఆయన వ్యాసాలకు విమర్శనాత్మకంగా ప్రతిస్పందించేవాళ్ళు లేకుండా పోయారు. మేధస్సురీత్యా ఆయన ఒంటరివాడు. అయితే అశ్చర్యమల్లా ఈ ఒంటరివాడు తన రచనా జీవితకాలమంతా అచంచలమయిన ఆత్మవిశ్వాసంతో రాయడమే. తను సాధనచేసిన శాస్త్రీయపద్ధతే ఆ ఆత్మవిశ్వాసానికి కారణం అనుకోవాలి. ఈపద్ధతి సరయినదయితే నిస్సందేహంగా ఆయన తెలుగు సాహిత్యంకంటె ముందున్నవాడే.

అందుకే రానున్న చరిత్రకోసం ఈ సాంస్కృతిక పోరాట యోధుడు ఇంకా బతికేఉన్నాడు. వాళ్ళనుమలిచే రక్తగాయాల మట్టిచేతులగురించి మేధావుల్ని ప్రశ్ని

సాహిత్య లేఖ :

ఎవరీ యండమూరి? ఎందుకీ ఆత్మహత్య??

"చట్టానికి పట్టుబడకుండా ఆస్తి, డబ్బు దోచుకోడమెలా? అమ్మా
భవించడమెలా?"

ఈమధ్య ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమైన తులసి దళం,
వెలువడుతోన్న 'తులసి' అనే సీరియల్స్ ఆంధ్ర పాఠకలోకానికి ఒక కొత్త
అందించినట్లు తెలుస్తోంది.

ఆర్థిక లైంగిక అసంతృప్తులకు గురై బాధపడే పాఠకలోకం మెదడు
వేసి, రచయిత తను మాత్రం 'నీ శరీరం కావాలన్నాడ'ట.

ఆర్థిక లైంగిక అసంతృప్తులకు జనం గురికావడం అసహజ మెంత
కాదు, సరిగదా అందుకు వ్యక్తులెవ్వరూ బాధ్యులుకూడా కాదు, ప్రస్తుతం మన
చారిత్రిక సామాజిక దశ సహజ లక్షణాలే అవి.

అయితే పైన పేర్కొనబడ్డ రచనలు యీ అసంతృప్తులకు మూల
సామాజిక, ఆర్థిక పరిస్థితులను నిర్మూలించడానికి, తద్వారా యీ అస
రూపుమార్చే దిశలోగాక, పైగా వీటిని రేకెత్తించడానికి కనిపెట్టిన వెర్రి
వున్నాయని మా దృఢవిశ్వాసం. ఈ రచనల్లోని మూలవృత్తాంతం- ద
వివిధ సంఘటనలను (ఘటనల్ను) పరిశీలిస్తే యీ విషయం తేటతెల్ల
యీ వెర్రి యింకా పలువురి కలాల ద్వారా బహుకృతవేషాలు ధరించక
నీకం జాగృతం గావడం హర్షదాయకం. కాని ప్రస్తుత సామాజిక ఆరిక
యీ వెర్రికి గల మూల సంబంధాన్ని ప్రజలు పూర్తిగా అర్థం చే
యిది మారువేషాల్లో మళ్ళీ మళ్ళీ ప్రత్యక్షం కావడం ఖాయం అని హె

ప్రగతిసా

స్తూనే ఉంటాడు, ఆ ప్రశ్నకు సమాధానం చెప్పగల సాహసం ఉన్న వ
ప్రజాసంస్కృతితో ముందుకునడిచి కొడవటి కుటుంబరావుని మర
కోవచ్చు....

(ప్రగతి సాహితి, జవహర్‌లాల్‌నెహ్రూ విశ్వవిద్యా
నీర్ విడుదల సందర్భంలో జరిపిన సంస్మరణసభలో
సెప్టెంబర్, 13, 1981)

ఆదిలాబాద్ గిరిజన సహాయనిధి

C/o సృజన, హనుమకొండ, వరంగల్ 506 001

…ంబర్ సంచిక వరకు అందిన విరాళాలు :

బంగారు ఉంగరం + 4 వెండిపళ్ళెలు + 1500 రు. మందులు	+ రు. 14580-88
…ంది కార్మిక మిత్రులు, మహారాష్ట్ర	100-00
…ాత్రిమిత్రులు, విజయనగరం	35-00
సి. ఎచ్. మునిస్వామి, గుడివాడ	15-00
…ర్పు గోదావరిజిల్లా ఆర్ ఎస్ యు, ఆర్ వై ఎల్ వసూళ్ళు	100-00
…విలీపట్నం ఆర్ వై ఎల్ వసూళ్ళు	50-00
బి. సి. రావు, శ్రీహరికోట	25-00
…ధ్రాలయోలా కాలేజి, విజయవాడ సీనియర్ ఇంటర్ విద్యార్థులు	111-50
…ాఖపట్నంలో వసూళ్ళు	50-00
…ద్మిని, విశాఖపట్నం	75-00
…దర్లాండ్స్ నుంచి విరాళం	265-50
…కృష్ణాపురం (చీరాల) బహిరంగసభ వసూళ్ళు	34-00
…ర్ ఎస్ యు వసూళ్ళు	327-15
మొత్తం రు.	15769-03

ఒక బంగారు ఉంగరం + 4 వెండిపళ్ళెలు + 1500 రు. మందులు.

…న్న …జన సహాయనిధి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, వరంగల్ బ్రాంచిలో …రావు పేరవుంది. అకౌంట్ నంబర్ 2730

SRJANA Telugu Monthly Oct. 81 H/WL-10
Regd. No. with Registrar of Newspapers 10953/67.

తెలంగాణా పోరాట కథల సంపుటి

తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని, ఆ సమయంలో ప్రజల జీవితాన్ని చిత్రిస్తూ ఎంతో సాహిత్యం వెలువడింది నాడు. ఈ పోరాట సాహిత్యమే తెలుగు సాహిత్యానికి పోరాట చేవను చేకూర్చి పెట్టింది. అయితే ఈనాడు చాలా తక్కువ భాగమే ఆనాటి సాహిత్యం అందుబాటులో ఉంది. కథలు మినహా మిగిలిన ప్రక్రియలకు సంబంధించిన రచనలు అప్పుడప్పుడయినా వెలుగును చూడగలుగుతున్నాయి. ఒక తరాన్ని ఎంతగానో ప్రభావితం చేసిన కథలీనాడు అదృశ్యమైపోతున్నాయి

ఈనాటి తరానికి ఆ కథలు ఎంతగానో ఉపయోగపడగలవనే ఉద్దేశంతో జనసాహితి సాంస్కృతిక సమాఖ్య తెలంగాణా పోరాట కథల సంపుటాన్ని తీసుకొచ్చే ప్రయత్నంలో ఉంది. ఈ సంపుటానికి తమ, తమ సూచనలు సలహాలు, కథలకు సంబంధించిన వివరాలు, ఈ క్రింది అడ్రస్‌కి పంపి సహకరించవలసిందిగా సాహిత్యాభిమానులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

– నవీన్
జనసాహితి కార్యదర్శి,
1-1-780/ఎ/2/1, గాంధీనగర్, హైదరాబాద్ - 500380

రా వి శాస్త్రి రచనలు

శ్రీ రాచకొండ విశ్వనాధశాస్త్రి రచనలు- కథలు, వ్యాసాలు, లేఖలు, గేయాలు, పుస్తకాలకు రాసిన ముందుమాటలు, పత్రికలలో అచ్చయినా కథాసంపుటాలలో అచ్చు కాని కథలు మొదలగునవి, జాస్మిన్ పేరుతో 'చిత్రగుప్త'లో వచ్చిన కథలు ప్రచురింపబోతున్నాం. వాటి కాపీలు పంపినాసరే, ఎక్కడుండేదీ తెలిపినా సరే. ఆయన రచనలన్నీ వెలుగులోకి తెచ్చే ఈ ప్రయత్నానికి సాహిత్యాభిమానులు చేయూత నివ్వవలసిందిగా కోరుతున్నాను.

టి. వేణుగోపాలరావు
సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ, విజయవాడ - 520 006

SRJANA
Hanamkonda-506001

Single copy Rs. 2-00
Yearly Subscription Rs 20-00